www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



11

విజయ్, రష్మిక పెళ్లి 26న?

ఉదయ్‌పూర్‌లో సన్నిహితులు, బంధువుల సమక్షంలో!.. సోషల్ మీడియాలో ప్రచారం

శుక్రవారం | 6-2-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 331 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం, తిథి: పంచమి రా.1:19 తదుపరి షష్ఠి, నక్షత్రం: హస్త రా.12:24 తదుపరి చిత్త, వర్జ్యం: ఉ.7:51-9:33, దుర్ముహూర్తం: ఉ.9:05-9:50, మ.12:51-1:37, అమృతఘడియలు: సా.6:02-7:44, రాహుకాలం: ఉ.10:30-12:00, సూర్యోదయం:6:49, సూర్యాస్తమయం:6:09 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, పక్కన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు లోకేశ్, సత్యకుమార్, ఆనం, పార్థసారథి

హిందూమతంపై పకడ్బందీ కుట్ర!

కల్తీ నెయ్యి.. కమీషన్ల కక్కుర్తితో చేసింది కాదు: చంద్రబాబు

- పామాయిల్, లాక్టిక్ యాసిడ్, ఎసిటిక్ యాసిడ్ లాంటి రసాయనాలను లడ్డూ ప్రసాదంలో కలపడం మహాపాపం కాదా? ప్రజల మనోభావాలతోనే కాదు.. వారి ప్రాణాలతోనూ ఆడుకోవడం కాదా? - సీఎం చంద్రబాబు
- చేసిన తప్పునకు క్షమాపణ కోరకుండా.. పైగా మేం సారీ చెప్పాలంటున్నారు. తప్పు చేసిన వారు భగవంతుడికి మోకరిల్లే వరకు ఈ యుద్ధం సాగుతుంది. - డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- ప్రపంచంలో ఎక్కడైనా కేజీ ఆవు నెయ్యి రూ.319కి వస్తుందా? భగవంతుడంటే ఏమాత్రం భయం, భక్తి లేకుండా ఇష్టారాజ్యంగా కల్తీ నెయ్యిని లడ్డూ తయారీకి వాడారు. - బీజేపీ నేత మాధవ్

బీజేపీ క్రియాశీలం కావాలి!

కల్తీ లడ్డూ వ్యవహారాన్ని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి: చంద్రబాబు

- తిరుమల పవిత్రతను దెబ్బతీయడమే ఉద్దేశం
- జగన్ హయాంలో 219 గుళ్లపై దాడులు
- మొత్తం 10 ఆలయాల్లో నెయ్యి కల్తీ
- భక్తుల మనోభావాలతో ఆడుకున్నారు
- నాటి టీటీడీ చైర్మన్, కొనుగోలు కమిటీకి కల్తీ నెయ్యి గురించి తెలుసు
- దోషులను కఠినంగా శిక్షించడానికి అన్ని చర్యలూ తీసుకుంటాం
- సిట్ సూచనలపై ఏకసభ్య కమిటీ: సీఎం

జగన్‌కు దేవుడంటే లెక్కలేదు

- ఆయన కరుడుగట్టిన నేరస్థుడు
- క్షమించరాని మహాపాపం చేశారు
- సిట్ క్లీన్‌చిట్ ఇచ్చిందని కలగన్నారా?: చంద్రబాబు
- తిరుమలలో వైసీపీ అరాచకాలపై కూటమి నేతలు, మంత్రుల భేటీ

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుమలేశుడి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసింది చాలక.. ఈ విషయంలో సీబీఐ సిట్ తమకు క్లీన్ చిట్ ఇచ్చిందంటూ మాజీ సీఎం జగన్, వైసీపీ నేతలు ప్రచారం చేసుకోవడంపై కూటమి భాగస్వాములైన టీడీపీ, జనసేన, బీజేపీ అగ్ర నేతలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. హిందూమతంపై పకడ్బందీ ప్రణాళిక ప్రకారమే జగన్ అండ్ కో కుట్ర చేశారని సీఎం, టీడీపీ అధినేత

మిగతా 13వ పేజీలో...

జంతువుల కొవ్వూ కలిసింది!

ఇది ఎన్‌డీడీబీ ల్యాబ్ తేల్చిన నిజం

- 'నెయ్యి' నమూనాలో ఎస్-వాల్యూ 117
- ఇది పంది కొవ్వు కలిసిందనే సంకేతం
- స్వచ్ఛమైన ఆవునెయ్యి ఎస్-వాల్యూ 104 దాటొద్దు
- అన్ని ప్రమాణాల్లో అంతకుమించే
- కొవ్వులతో కల్తీ చేశారనేందుకు అదే నిదర్శనం
- కూటమి వచ్చిన కొత్తలోనే ఎన్‌డీడీబీలో పరీక్ష
- నెయ్యి కల్తీని 2022లోనే నిర్ధారించిన సీఎఫ్‌టీఆర్ఐ
- కళ్లుమూసుకున్న నాటి పాలక మండలి, అధికారులు
- అడ్డంగా దొరికిపోయినా బుకాయింపు మానని వైవీ

"స్వచ్ఛమైన ఆవు నెయ్యిలో ఎస్-వాల్యూ 97.96 నుంచి 102.04 మధ్య ఉండాలి. అంతకుమించితే... జంతువుల కొవ్వులు కలిపి కల్తీ చేసినట్లే"! సింపుల్‌గా గూగుల్ చేస్తే ఈ విషయం తెలిసిపోతుంది. 'నెయ్యి' పేరిట టీటీడీకి సరఫరా చేసిన 'రసాయన మిశ్రమం'లో ఎస్-వ్యాల్యూ ఏకంగా 117 వచ్చినట్లు పాడి పరిశ్రమకు సంబంధించి దేశంలోనే అత్యున్నత సంస్థ అయిన ఎన్‌డీడీబీ ల్యాబ్ నిర్ధారించింది. అంటే... అందులో 'ల్యార్డ్' (పంది కొవ్వు) కలిసిందని తేల్చింది.


తప్పు చేసిన వాళ్లు లెంపలేసుకోవాలి!.. పాపం చేసిన వాళ్లు కనీసం పశ్చాత్తాపం ప్రకటించాలి!

కానీ... వైసీపీ నేతల తీరే వేరు! కించిత్ పశ్చాత్తాపం లేకపోగా... ఎదురుదాడి, బుకాయింపులే వారి దారి!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

వైసీపీ రాజ్యసభ సభ్యుడు, టీటీడీ పాలకమండలి మాజీ అధ్యక్షుడు వైవీ సుబ్బారెడ్డి అడ్డంగా దొరికిపోయారు. మొన్నటిదాకా 'కల్తీ' మాటెత్తని ఆయన... 'కల్తీ జరిగితే జరిగి ఉండొచ్చు' అని సన్నాయి నొక్కులు నొక్కారు. జంతువుల కొవ్వు కలవలేదంటున్న ఆయన.. పంది కొవ్వు కలిసిందని ఏకంగా జాతీయ పాడిపరిశ్రమాభివృద్ధి సంస్థ (ఎన్‌డీడీబీ) ధ్రువీకరించిందని చెప్పగా... 'అది అనుమానం మాత్రమే' అని వెల్లడించారు. అసలు నిజం ఏమిటంటే... జగన్ హయాంలో తిరుమలకు సరఫరా

మిగతా 13వ పేజీలో...





భగవంతుడిపైనే పగబట్టారు

- వాళ్లు సర్వనాశనమైపోతారు
- వైసీపీ వాళ్లకు హిందూ ధర్మంపై గౌరవం లేదు
- దేవుడంటే విశ్వాసం లేనివారు మట్టికరుస్తారు
- లడ్డూ కల్తీ.. విశ్వాసాలపై దెబ్బకొట్టే ప్రయత్నం
- తప్పు చేసినవారు భగవంతుడి ముందు మోకరిల్లేవరకు యుద్ధం: పవన్ కల్యాణ్

అయోధ్యకు పంపిన లక్ష లడ్డూలూ కల్తీవే

ఏ స్థాయిలో కుట్ర జరిగిందో అర్థం చేసుకోవచ్చు

13

అన్యమతస్థుల ప్రాబల్యం పెంచే కుట్ర

- అందులో భాగమే తిరుమల లడ్డూ కల్తీ
- వైసీపీది కల్తీ మనస్తత్వం.. కల్తీ పాలన
- దేవాలయ వ్యవస్థ అంటే వారికి లెక్కలేదు
- మహాపచారం చేసి క్లీన్ చిట్ ఇచ్చుకోవడం వారికే చెల్లు: బీజేపీ నేత మాధవ్

కల్తీ నెయ్యి వ్యవహారంలో తప్పు చేశా

- డెయిరీ ఎక్స్‌పర్ట్ విజయభాస్కర్‌రెడ్డి పశ్చాత్తాపం.. 'నెయ్యి' దందాలో కీలక పాత్ర
- 2017లో దూరం పెట్టిన టీటీడీ.. 2019లో తిరిగి అనూహ్యంగా తెరపైకి
- భోలే బాబా, వైష్ణవి, మాల్ గంగాలతో 'కల్తీ నెయ్యి' వ్యవహారం నడిపింది ఈయనే
- భోలేబాబా ఓనర్ పామిల్‌జైన్‌ను ఏపీకి, వైష్ణవి డెయిరీకి తీసుకెళ్లి 'నెయ్యి' డీల్
- పాపం ఒప్పుకొని లంచం సొమ్ములో 34 లక్షల నగదు, గోల్డ్ కాయిన్ అప్పగింత
- కొవ్వు కలవలేదని సిట్ చెప్పింది.. అయినా దుష్ప్రచారం: వైవీ సుబ్బారెడ్డి



2

ఎప్‌స్టీన్‌తో సంబంధాలపై

క్షమాపణలు

- పశ్చాత్తాప పడుతున్నా
- వైద్య సేవలకు నిధుల కోసమే ఆయనతో సంభాషణలు
- బిల్ గేట్స్ వ్యాఖ్యలు

వాకింగ్‌కు తీసుకెళ్లి..

ప్రియుడితో భర్తను చంపించిన భార్య

అనంతరం రోడ్డు ప్రమాదం అంటూ నాటకం 2

రాజస్థాన్‌లో దారుణ ఘటన

'ఆర్ఏసీ'లో బెర్త్ రాకుంటే చార్జీలో

కొంత వెనక్కి ఇవ్వాలి!

రైల్వే శాఖకు పార్లమెంటరీ కమిటీ సూచన 2

భూమాతకు జలహారతి

నదుల అనుసంధానంతో ప్రతి ఎకరాకు నీరందించవచ్చు

- మే 15 నాటికే నారుమళ్లకు నీళ్లందిస్తాం
- వర్షం నీటిని సంరక్షించుకుని రబీకి వాడతాం
- కరువు రహిత రాష్ట్రంగా మారుస్తాం
- 'పుష్కరాలకు' ముందే పోలవరం తొలిదశ
- 2027 మార్చికి ఎడమ కాలువ పూర్తి చేస్తాం
- అనకాపల్లికి గోదావరి జలాలు అందిస్తాం
- సీమ ఎత్తిపోతలపై స్టేను జగన్ ఎందుకు ఎత్తివేయించలేదు?
- చేతకానివాళ్లు ఇప్పుడు ఎంతో చేశామని మాట్లాడుతున్నారు!
- నీరు-ప్రగతి-జలహారతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్వజం



నీరు-ప్రగతి-జలహారతి కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, వేదికపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రులు అచ్చెన్న, నిమ్మల, దుర్గేశ్ తదితరులు

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నదుల అనుసంధానంతో ప్రతి ఎకరాకూ సాగునీరందించడమే భూమాతకు మనమిచ్చే జలహారతి అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రాన్ని సాగునీటి ప్రదేశ్‌గా, కరువు రహిత రాష్ట్రంగా మారుస్తామని ప్రకటించారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం తొలిదశను పూర్తి చేస్తామన్నారు. పోలవరం

మిగతా 12వ పేజీలో...

వరి తగ్గించి.. పండ్ల తోటలు పెంచండి

- సాగునీటి సంఘాల సమావేశంలో మంత్రి అచ్చెన్న సూచన
- కిసాన్ యోజనతో రైతులకు సాయం: బీజేపీ అధ్యక్షుడు మాధవ్
- పోలవరం పూర్తి చేస్తామని నాడు తొడగొట్టారు: నిమ్మల 12

కార్మిక సంక్షేమ పథకాల పునరుద్ధరణ

- ఆధునిక నైపుణ్యాల్లో శిక్షణకు చర్యలు
- తద్వారా ఆదాయాలు గణనీయంగా పెరగాలి
- అసంఘటిత రంగ కార్మికులను మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్లుగా ప్రోత్సహించాలి 14
- కార్మిక శాఖపై సమీక్షలో సీఎం ఆదేశాలు

అవినీతిపరులపై ఏసీబీ పంజా!

- విశాఖలో పంచాయతీరాజ్ రిటైర్డ్ ఎస్ఈ అరెస్టు
- రూ.30 కోట్ల విలువైన ఆస్తుల గుర్తింపు 12
- ఇళ్ల స్థలాలు, ఫ్లాట్లు, 18 ఎకరాల భూమి, కిలోల కొద్దీ బంగారం, వెండి, 56 లక్షలు నగదు
- ఏసీబీ వలలో ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్
- లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత
- బాధితుడితోనే కదిరి ఏఈసీడ్సీబ్యువోకీ ఎర



'భారత్ ట్యాక్సీ' ప్రారంభం

సహకార సంఘాల ఆధ్వర్యంలో క్యాబ్ బుకింగ్ ప్లాట్‌ఫాం.. తొలుత ఢిల్లీ, గుజరాత్‌లలో సేవలు

రెండేళ్లలో దేశంలోని అన్ని రాష్ట్రాలకు విస్తరిస్తాం: అమిత్‌షా 2

నాకు సమాధి తవ్వడమే మీ పని

మీ వైఫల్యాలను సరిచేయడమే నా పని

ఆర్టికల్ 370 రద్దు, ఈశాన్య భారతాన్ని ఉగ్రవాదం నుంచి విముక్తి చేయడం, ఆపరేషన్ సిందూర్, పాకిస్థాన్ ఉగ్రవాదులకు వారి శిబిరాల్లోకే వెళ్లి బుద్ధి చెప్పడం, నక్సలైట్లను నిర్మూలించడం, సింధూనది జలాల ఒప్పందాన్ని బుట్టదాఖలు చేయడం వంటి పనులు చేసినందుకే నా కోసం ప్రతిపక్షాలు సమాధిని తవ్వాలనుకుంటున్నాయి.

- ప్రధాని నరేంద్ర మోదీ

- దళిత బిడ్డలైన రాష్ట్రపతిని, తెన్నేటినీ అవమానించారు
- రాజ్యసభలో మోదీ ఫైర్.. విపక్షాల నిరసన, వాకౌట్
- లోక్‌సభలో ప్రధాని మాట్లాడకుండానే రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం ఆమోదం.. విపక్షాల తీవ్ర నిరసన
- మోదీ భద్రతకు మహిళా ఎంపీల నుంచి ముప్పు ఉందన్న సమాచారంతోనే ప్రధానిని సభకు రావొద్దన్నా: స్పీకర్ ఓం బిర్లా
- మహిళా ఎంపీలు ఏమైనా ఉగ్రవాదులా?: ప్రియాంక



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): 'నాకు సమాధి తవ్వడం, నన్ను అవమానించడం తప్ప మీకు పనేమీ లేదు. నాకు మాత్రం మీ తప్పులను సరిదిద్దడమే పని. ప్రధానమంత్రి పదవి వారి కుటుంబ వారసత్వం అనుకుంటున్నారు' అని కాంగ్రెస్ పార్టీపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాజ్యసభలో విరుచుకుపడ్డారు. నాలుగు రోజులపాటు లోక్‌సభలో ప్రతిపక్షాలు తీవ్ర గందరగోళం సృష్టించడంతో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు హాజరు కాని ప్రధాని.. గురువారం రాజ్యసభకు హాజరై ప్రతిపక్షాలపై ఎదురుదాడి చేశారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను సరిచేయడమే తన పని అని ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రధాని ప్రసంగాన్ని అడ్డుకునేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో విపక్షాలు పెద్దపెట్టున నినాదాలు చేసినప్పటికీ మోదీ పట్టించుకోలేదు. 'మీ వయసు రీత్యా మీరు కూర్చుని నినాదాలు చేయండి.. లేదంటే అలసిపోతారు' అని ఖర్గేపై సెటైర్లు వేశారు. ఈ దశలో విపక్షాలు మోదీ

మిగతా 2వ పేజీలో...

'భారత్ ట్యాక్సీ' సేవలు ప్రారంభం


తొలుత ఢిల్లీ, గుజరాత్‌లో అందుబాటులోకి

రెండేళ్లలో అన్ని రాష్ట్రాలకు విస్తరిస్తాం: అమిత్‌షా



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: దేశంలో సహకార సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే తొలి క్యాబ్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ 'భారత్ ట్యాక్సీ' సేవలను కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్‌షా ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో గురువారం లాంఛనంగా ప్రారంభించారు. పైలట్ ప్రాజెక్టుగా రెండు నెలలు విజయవంతంగా పూర్తిచేసుకున్న అనంతరం ఈ సేవలు ప్రస్తుతం ఢిల్లీ, గుజరాత్‌లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. వచ్చే రెండేళ్లలో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఈ సేవలు విస్తరించనున్నట్లు అమిత్‌షా తెలిపారు. మూడేళ్లలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, ద్వారక నుంచి కామాఖ్య (అస్సాం) వరకు ట్యాక్సీ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. దీని ద్వారా వచ్చే లాభాలు నేరుగా డ్రైవర్లకే పంచుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ యాప్ ద్వారా కార్లు, ఆటోలు, బైక్ ట్యాక్సీలను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ప్రస్తుతం దేశంలో క్యాబ్ బుకింగ్ సేవల్లో ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి ప్రైవేట్ సంస్థలు ఆధిపత్యం వహిస్తున్న నేపథ్యంలో భారత్ ట్యాక్సీ వాటికి ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని అధికారులు తెలిపారు. 2025, జూన్ 6న కేంద్రం ఈ యాప్‌ను రూపొందించింది. ఇది జీరో కమీషన్, సర్జ్ ప్రైసింగ్ లేని విధానంలో పనిచేస్తూ, లాభాలను నేరుగా డ్రైవర్లకే పంపిణీ చేస్తోంది. ఎనిమిది ప్రముఖ సహకార సంస్థల మద్దతుతో 2025, డిసెంబరు 2న ఢిల్లీ, గుజరాత్‌లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైంది. భారత్ ట్యాక్సీ ప్రపంచంలోనే మొదటి, అతిపెద్ద సహకార ఆధారిత క్యాబ్ బుకింగ్ ప్లాట్‌ఫామ్‌గా, డ్రైవర్లే ఓనర్లు కలిగిన రైడ్ బుకింగ్ యాప్ గా అవతరించిందని సహకార మంత్రిత్వశాఖ తెలిపింది. ఇప్పటివరకు ఈ యాప్‌లో 3 లక్షలకు పైగా డ్రైవర్లు, లక్షకు పైగా వినియోగదారులు తమ పేర్లను నమోదు చేసుకున్నారని పేర్కొంది. సుమారు రూ.10 కోట్ల లాభాలను డ్రైవర్లకు పంపిణీ చేసినట్లు చెప్పింది. డ్రైవర్లకు 'సారథి' పేరిట ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, పదవీ విరమణ ప్రయోజనాలను ఈ యాప్ అందిస్తోంది. ఢిల్లీలో ఏడుచోట్ల సపోర్ట్ సెంటర్లు పనిచేస్తున్నాయి.

లోకం తీరు



'ఆర్ఏసీ'లో బెర్త్ రాకుంటే టికెట్ చార్జీలో కొంత తిరిగివ్వాలి!

» రైల్వే శాఖకు పార్లమెంటరీ కమిటీ సూచన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: అత్యవసర లేదా ఇతర సమయాల్లో టికెట్లు అందుబాటులో లేనప్పటికీ.. చాలా మంది 'ఆర్ఏసీ (రిజర్వేషన్ అగైనెస్టు క్యాన్సిలేషన్)' క్యాటగిరీలో రైల్వే టికెట్లు బుక్ చేసుకుంటుంటారు. అయితే బోర్డింగ్ సమయానికి ఎవరైనా తమ ప్రయాణాన్ని రద్దు చేసుకుంటేనే వారికి బెర్త్‌లు కేటాయించబడతాయి. అది కూడా ముందు, వెనుక అనే ఒక క్రమ పద్ధతిలో! లేదంటే మరో వ్యక్తితో కలిసి ఒకే బెర్త్‌ను పంచుకొని రైలు ప్రయాణం చేయాల్సిందే!! ఇందుకుగానూ సదరు వ్యక్తికి సగం బెర్త్ కేటాయించినప్పటికీ.. టికెట్ బుకింగ్ సమయంలో పూర్తి చార్జీ చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ విధంగా ఆర్ఏసీ క్యాటగిరీ కింద టికెట్లు బుక్ చేసుకొని, చార్ట్ తయారీ తర్వాత కూడా ఆదే క్యాటగిరీలో ఉండి, ఫుల్ బెర్త్ లేకుండా ప్రయాణించే వారి నుంచి పూర్తి చార్జీ వసూలు చేయడం సమర్థనీయం కాదని పార్లమెంటరీ కమిటీ పేర్కొంది. అలాంటి ప్రయాణికులకు చార్జీలో కొంత మేర రీఫండ్ చేయాలని రైల్వే మంత్రిత్వ శాఖకు సూచించింది. ఇందుకోసం ఒక ప్రత్యేక వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉందని తెలిపింది. ఈ మేరకు ప్రజాపద్దుల కమిటీ 'పంక్చువాలిటీ అండ్ ట్రావెల్ టైమ్ ఇన్ ట్రైన్ ఆపరేషన్స్ ఇన్ ఇండియన్ రైల్వేస్' పేరుతో బుధవారం పార్లమెంట్‌కు సమర్పించిన నివేదికలో పేర్కొంది.

వీధులకు కులాల పేర్లు తొలగిస్తే వివక్ష తొలగిపోతుందా?: మద్రాసు హైకోర్టు

చెన్నై, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రజల మనస్సులో నెలకొన్న వివక్షను తొలగించకుండా వీధులకు ఉన్న కులాల పేర్లు తొలగించడంవల్ల ఏమాత్రం ఫలితం ఉండదని మద్రాస్ హైకోర్టు అభిప్రాయపడింది. తమిళనాడులోని వివిధ ప్రాంతాలు, వీధులు, రోడ్లకు ఉన్న కులాల పేర్లను తొలగించేందుకు మార్గదర్శకాలతో గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోను సవాల్ చేస్తూ ప్రజా ప్రయోజన వ్యాజ్యం హైకోర్టులో దాఖలైంది. ప్రభుత్వం జారీ చేసిన జీవో మేరకు ఆదిద్రావిడుల కాలనీ, హరిజన కాలనీ తదితర కులాల పేర్లు తొలగింపు ప్రారంభమైందని, ఇందులో పలు సమస్యలు నెలకొన్నాయంటూ మదురైకి చెందిన పరమశివం అనే వ్యక్తి కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో జీవోను హైకోర్టు గత ఏడాది నిలుపుదల చేసింది. ఈ నేపథ్యంలో గురువారం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి.జయచంద్రన్, జస్టిస్ కేకే రామకృష్ణన్‌ల మదురై ధర్మాసనం మరోమారు విచారణ జరిపింది. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. ముందుగా ప్రజల మనసుల్లో నెలకొన్న వివక్షను నిర్మూలించేందుకు ప్రయత్నించాలని, వీధులు, రోడ్లకు పెట్టిన కులాల పేర్లు మార్చినంత మాత్రాన వివక్షలో ఎలాంటి మార్పు ఉండదని వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను ఈ నెల 11వ తేదీకి వాయిదా వేసింది.

బొగ్గు గనిలో పేలుడు..18 మంది కార్మికుల మృతి

షిల్లాంగ్, ఫిబ్రవరి 5: మేఘాలయలో అక్రమంగా తవ్వకాలు సాగిస్తున్న ఓ బొగ్గు గనిలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. తూర్పు జైంతియా హిల్స్ జిల్లాలోని తంగ్‌స్కు ప్రాంతంలోని గనిలో గురువారం పేలుడు సంభవించి 18 మంది కార్మికులు మరణించారు. ఇంకా పలువురు గనిలో చిక్కుకుపోయి ఉంటారని ఆందోళన చెందుతున్నారు. మృతుల్లో పలువురు అస్సాంకు చెందినవారు. పేలుడుకు కారణాలు తెలియాల్సి ఉంది.

కుమార్తె తీసిచ్చిన లాటరీ టికెట్..

» కర్ణాటక వాసికి 49 కోట్ల జాక్‌పాట్..!

» యూఏఈ బిగ్ టికెట్ లక్కీడ్రాలో విజేత

» మిత్రుడితో కలసి పంచుకోవాలని నిర్ణయం



బెంగళూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా లాటరీ టికెట్లు కొంటున్నా నిరాశే వెక్కిరించేది..! అయితే ఇటీవల తన కుమార్తె చేతితో తీసిచ్చిన ఓ లాటరీ టికెట్‌తో ఆ వ్యక్తి జాక్‌పాట్ కొట్టేశారు..! యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో జరిగిన బిగ్ టికెట్ లక్కీ డ్రాలో కర్ణాటక వాసి రూ.49 కోట్ల లాటరీ (2 కోట్ల దిర్హాంలు) గెలుచుకున్నారు. ఉడుపి జిల్లా కటపాడి మట్టు ప్రాంతానికి చెందిన శాంతను శెట్టిగార్ వ్యాపార నిమిత్తం కొన్నేళ్లుగా ఒమన్‌లో ఉంటున్నారు. లాటరీ టికెట్లు కొనే అలవాటు ఉన్న ఆయన ఐదేళ్లుగా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఈ క్రమంలో ఇటీవల 283వ సీరియల్ టికెట్ నంబరు 305810 లాటరీని కొనుగోలు చేశారు. అబుదాబిలో ఈ నెల 3న తీసిన లక్కీ డ్రాలో శెట్టిగార్ 2 కోట్ల దిర్హాంలు గెలుచుకోగా.. మరో ఐదుగురు లగ్జరీ కారుతోపాటు ఒక్కొక్కరూ 10 లక్షల దిర్హాంలు గెలుచుకున్నారు. ఈ టికెట్‌ను తన స్నేహితుడితో కలసి కొనుగోలు చేశానని, వచ్చే ప్రైజ్‌మనీని తామిద్దరం చెరి సంగం పంచుకుంటామని శెట్టిగార్ తెలిపారు. తన విజయానికి ఆ రోజు తన కుమార్తె తీసిన టికెట్ కారణమని వెల్లడించారు.

వాకింగ్ అని తీసుకెళ్లి.. ప్రియుడితో భర్తను చంపించిన భార్య

» రాజస్థాన్‌లో దారుణ ఘటన



ఆశిష్, అంజు పెళ్లి నాటి ఫొటో

శ్రీగంగానగర్, ఫిబ్రవరి 5 : మేఘాలయాలో గతేడాది వెలుగు చూసిన హనీమూన్ హత్య గుర్తుందా ? రాజా రఘువంశీ, సోనమ్ మేఘాలయకు హనీమూన్‌కు వెళ్లారు. కానీ ప్రియుడి కోసం భర్తను సోనమ్ హత్య చేయించింది. దేశవ్యాప్తంగా సంచలనమైన ఈ హత్యోదంతాన్ని మరువకముందే అదే తరహా ఘటన ఒకటి రాజస్థాన్‌లో చోటు చేసుకుంది. వాకింగ్ అని భర్తను బయటకు తీసుకెళ్లిన భార్య.. తన ప్రియుడితో అతడిని చంపించేసింది. ఆపై, గుర్తు తెలియని వాహనం తమను ఢీకొట్టిందంటూ నాటకమాడింది. కానీ పోలీసు విచారణలో ఆమె ఘాతుకం బయటపడింది. రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్‌కు చెందిన ఆశిష్, అంజు(23)కు మూడు నెలల క్రితం వివాహమైంది. భర్తతో మనస్పర్థల వల్ల అంజు వెంటనే పుట్టింటికి వెళ్లిపోయింది. పెద్దలు నచ్చజెప్పడంతో తిరిగి అత్తింటికి వచ్చింది. అయితే, జనవరి 30వ తేదీ రాత్రి 9 గంటలకు ఆశిష్, అంజు రోడ్డుపై అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి తీసుకొచ్చేసరికే ఆశిష్ మరణించాడు. తర్వాత పోలీసులు అంజును విచారించారు. భర్తతో కలిసి తాను ఈవినింగ్ వాక్‌కు వెళ్లగా.. గుర్తు తెలియని వాహనం తమను ఢీకొట్టి వెళ్లిందని చెప్పింది. అలాగే, కారులోని దుండగులు తన బంగారు ఆభరణాలను కూడా దొంగలించారంది. అంజు చెప్పిన సమాచారానికి, ఘటనాస్థలంలో పరిస్థితికి పొంతన లేకపోగా.. ఆశిష్ శరీరంపై గాయాలు ఉన్నట్టు గుర్తించిన పోలీసులు అంజును గట్టిగా ప్రశ్నించారు. దీంతో అసలు విషయాన్ని బయటపెట్టింది. తమ ఇంటికి సమీపంలో ఉండే సంజు అనే వ్యక్తితో అంజుకు పెళ్లికి ముందు నుంచే సంబంధం ఉంది. పెళ్లి తర్వాత కూడా అంజు అతడితో నిత్యం మాట్లాడేది. అత్తింటి నుంచి పుట్టింటికి వెళ్లి ఉన్నప్పుడు సంజును కలిసిన అంజు తన భర్త ఆశిష్ హత్యకు కుట్ర చేసింది. దీంతో పథకం ఆశిష్‌ను వాకింగ్ పేరుతో ఓ నిర్మానుష్య రహదారిలోకి తీసుకెళ్లింది. అప్పటికే తన స్నేహితులు రాకీ, సిద్ధార్థ్‌తో కలిసి ఆ మార్గంలో మాటు వేసిన సంజు.. ఆశిష్‌పై దాడి చేసి గొంతు నులిమి ప్రాణం తీశారు. కేసులో నిందితులు నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు.

నాకు సమాధి తవ్వడమే మీ పని

(మొదటి పేజీ తరువాయి)



రాజ్యసభలో మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ

ప్రసంగాన్ని బహిష్కరించి వాకౌట్ చేయటంతో.. 'అలసిపోయి, వారే వెళ్లిపోయారు' అని మోదీ వ్యాఖ్యానించారు. తనను అయిదారు సార్లు అడ్డుకునేందుకు విఫలయత్నం చేశారని, కానీ తాను ప్రారంభిస్తే ఆపే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.

దళిత బిడ్డలను అవమానించారు

ఆర్టికల్ 370 రద్దు, ఈశాన్య భారతాన్ని ఉగ్రవాదం నుంచి విముక్తి చేయడం, ఆపరేషన్ సిందూర్, పాకిస్థాన్ ఉగ్రవాదులకు వారి శిబిరాల్లోకే వెళ్లి బుద్ధి చెప్పడం, నక్సలైట్లను నిర్మూలించడం, సింధూనది జలాల ఒప్పందాన్ని బుట్టదాఖలు చేయడం వంటి పనులు చేసినందుకే తనకోసం ప్రతిపక్షాలు సమాధిని తవ్వాలనుకుంటున్నాయని మోదీ ఆరోపించారు. 'మొహబ్బత్ కీ దుకాణ్ అని చెప్పేవారు గత 25 సంవత్సరాలుగా నన్ను అవమానిస్తూనే ఉన్నారు. నన్నే కాదు, దళిత బిడ్డ అయిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంపై చర్చను అడ్డుకుని ఆమెను కూడా అవమానించారు. లోక్‌సభలో ప్యానల్ చైర్మన్‌గా ఉన్న దళిత బిడ్డ, టీడీపీ ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌నూ అవమానించారు. దేశం కోసం త్యాగం చేసిన సిక్కు మంత్రి బిట్టూను ద్రోహి అంటూ అవమానించారు. అస్సాం ప్రజాగాయకుడు భూపేన్ హజారికాకు భారతరత్న పురస్కారం ప్రకటిస్తే.. ఆయనను కూడా అవమానించారు. అలాంటి వారికి రాజ్యాంగం గురించి మాట్లాడే అర్హత లేదు' అని ప్రధాని మండిపడ్డారు.

ప్రపంచ సవాళ్లకు భారత్ వద్ద సమాధానం

21వ శతాబ్దం రెండో భాగంలో ఉన్న దేశానికి ఎంతో భవిష్యత్ ఉందని, అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్నామని ప్రధాని మోదీ అన్నారు. మన లక్ష్యం సాధించేవరకు వెనక్కి తిరిగి చూడకూడదని చెప్పారు. దేశానికి ప్రతిభ గల యు వతే వరమని, ప్రపంచంలోని అనేక సవాళ్లకు భారత్ జవాబివ్వగలదని తెలిపారు. అత్యధిక అభివృద్ధి రేటు, తక్కువ ద్రవ్యోల్బణం మన ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు నిదర్శనమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రాజెక్టులను ప్రకటించడం తప్ప పూర్తి చేసిన దాఖలాలు లేవని విమర్శించారు. తాను ప్రధాని అయిన తర్వాతే సర్దార్ సరోవర్ ఆనకట్టను ప్రారంభించినట్లు తెలిపారు. రైల్వే ప్రాజెక్టులైనా, రహదారులైనా పూర్తి చేసేంతవరకు తాము విశ్రమించడం లేదని చెప్పారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ తనకు 56 (జనాభాను ఉద్దేశించి) కోట్ల సమస్యలున్నాయంటే, ఇందిగాంధీ 70 కోట్ల సమస్యలున్నాయని చెప్పుకున్నారని.. తాము మాత్రం 140 కోట్ల మంది ప్రజలకు 140 కోట్ల పరిష్కారాలున్నాయంటున్నామని ప్రధాని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు భారత్‌తో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకునేందుకు ఇతర దేశాలు వెనుకాడేవని, తాము యూరోపియన్ యూనియన్‌తో ఒప్పందాలకే తల్లిలాంటి ఒప్పందాన్ని కుదుర్చుకున్నామని తెలిపారు.

ప్రధాని సమాధానం లేకుండానే తీర్మానానికి ఆమోదం

చైనాతో ఘర్షణ సమయంలో ప్రభుత్వం తమకు సరైన దిశానిర్దేశం చేయలేదని ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ నరవణే తన పుస్తకంలో రాసిన అంశాలను లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రస్తావించకుండా అధికార పక్షం అడ్డుకోవటంతో నాలుగైదు రోజులుగా తీవ్ర ప్రతిష్టంభన ఏర్పడిన విషయం తెలిసిందే. గురువారం సభలో మరింత నాటకీయ పరిస్థితులు ఏర్పడ్డాయి. బుధవారం సాయంత్రం లోక్‌సభలో కొందరు ప్రతిపక్ష మహిళా సభ్యులు ప్రధాని కుర్చీ వద్దకు రావడంతో ఆయన భద్రతకు ముప్పు ఏర్పడవచ్చని సమాచారం అందిందని, అందుకే ప్రధానిని సభకు రావద్దని తానే సూచించినట్లు స్పీకర్ ఓం బిర్లా గురువారం లోక్‌సభలో ప్రకటించారు. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రధాని సమాధానం లేకుండానే మూజువాణి ఓటుతో ఆమోదింపజేశారు. ఈ పరిణామంపై విపక్ష సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. సభలో గందరగోళం ఏర్పడటంతో స్పీకర్ సభను వాయిదా వేశారు.

నిజాలకు భయపడి.. అబద్ధాలను ఆశ్రయించిన ప్రధాని: రాహుల్‌గాంధీ

ప్రధాని ఆరోపణలను కాంగ్రెస్ నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, పవన్‌ఖేరా తిప్పికొట్టారు. నిజాలను చూసి ప్రధాని భయపడుతున్నారని, అందుకే అబద్ధాలను ఆశ్రయించారని ఎక్స్‌లో రాహుల్ గురువారం విమర్శించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత అడిగిన కొన్ని ప్రశ్నలకే ప్రభుత్వం బెంబేలెత్తిపోయిందని ఎద్దేవా చేశారు. లోక్‌సభకు హాజరు కాకుండా చర్చ నుంచి తప్పించుకునేందుకే తమపై ప్రధాని తప్పుడు ఆరోపణలు చేశారని ఎంపీ ప్రియాంకాగాంధీ విమర్శించారు. ప్రధాని సీటు వద్ద బుధవారం ముగ్గురు మహిళా ఎంపీలు మాత్రమే ఉన్నారని, వారివల్ల మోదీ భద్రతకు ఎలా ముప్పు వస్తుందని ప్రశ్నించారు. మహిళలు మోదీపై దాడి చేయబోతున్నారనే తప్పుడు కథనాలను మీడియాలో వ్యాప్తి చేయించారని పవన్ ఖేరా ఆరోపించారు.

వెనెజువెలా చమురుకు రిలయన్స్ ఆర్డర్!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందంలో భాగంగా.. రష్యా నుంచి చమురు కొనుగోళ్ల తగ్గింపు, బదులుగా వెనెజువెలా నుంచి చమురు కొనుగోలుకు సంబంధించిన ప్రక్రియ మొదలైంది. అతిపెద్ద చమురు రిఫైనరీ ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ భారత్ నుంచి వెనెజువెలా చమురు కోసం మొదటి ఆర్డర్ పెట్టింది. ఈ మేరకు వెనెజువెలాకు చెందిన విటోల్, ట్రఫిగురా సంస్థలు ఏప్రిల్ నెలలో 20 లక్షల బ్యారెళ్ల చమురు రిలయన్స్‌కు సరఫరా కానున్నట్టు మార్కెట్ వర్గాలు తెలిపాయి. ఈ చమురును ఒక్కో బ్యారెల్‌పై 7 డాలర్ల వరకు రాయితీపై అందిస్తున్నట్టు పేర్కొన్నాయి. వెనెజువెలా అధ్యక్షుడు మదురోను అరెస్టు చేసి తీసుకెళ్లిన తర్వాత ఆ దేశ చమురు వ్యవస్థలను అమెరికా నియంత్రణలోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఇప్పుడు అమెరికా నిర్ణయం మేరకే వెనెజువెలా చమురు విక్రయాలు జరగనున్నాయి. కాగా, భారత రిఫైనరీలు ఇప్పటికే ఆర్డర్ చేసినమేరకు రష్యా నుంచి చమురు కొనుగోళ్లు జరుగుతాయని, ఒకట్రెండు నెలల పాటు ఇది కొనసాగవచ్చని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

అల్ ఫలాహ్ వర్సిటీ చైర్మన్ అరెస్టు

» ఫోర్జరీ, మనీలాండరింగ్ కేసుల నమోదు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: ఫోర్జరీ, మనీలాండరింగ్ కేసుల్లో అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయం చైర్మన్ జావద్ అహ్మద్ సిద్దికీని గురువారం ఢిల్లీ క్రైం బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆ విద్యాసంస్థకు ఇచ్చిన న్యాక్ గుర్తింపు గడువు కాలపరిమితి ముగిసినా దాన్ని ఉపయోగించుకొని విద్యార్థులను మోసగించారంటూ ఆయనపై యూజీసీ ఫిర్యాదు చేసింది. అల్ ఫలాహ్ చారిటబుల్ ట్రస్టు నిధుల వినియోగంలో మనీలాండరింగ్ జరిగినట్టు ఈడీ మరో కేసు పెట్టింది. వీటి ఆధారంగా ఢిల్లీ పోలీసులు ఆయనను అరెస్టు చేశారు.

ఎప్‌స్టీన్‌తో సంబంధాలకు పశ్చాత్తాప పడుతున్నా

» క్షమాపణలు చెబుతున్నా

» వైద్య సేవలకు నిధుల కోసమే ఆయనతో సంభాషణలు.. బిల్ గేట్స్ వ్యాఖ్యలు

వాషింగ్టన్, ఫిబ్రవరి 5: టీనేజీ బాలికలను ఎరవేసి సెక్స్ స్కాంలు జరిపే సూత్రధారి జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో పరిచయం ఉన్నందుకు మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ మరోసారి పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్ విడుదల చేసిన ఎప్‌స్టీన్ పత్రాల్లో ఆయన ప్రస్తావన ఉండడం చర్చనీయాంశంగా మారింది. బిల్ గేట్స్ నేరం చేసినట్టు ఎలాంటి ఆరోపణలు లేకపోయినప్పటికీ సమాజంలోని ప్రముఖ వ్యక్తులు బాధ్యతాయుతంగా ఉండాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన ఆస్ట్రేలియాకు చెందిన టీవీ చానెల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఎప్‌స్టీన్‌తో సమయం గడపడం చాలా పెద్ద తప్పిదమని అంగీకరించారు. "ఆయనతో గడిపిన ప్రతి నిమిషానికీ పశ్చాత్తాప పడుతున్నాను. క్షమాపణలు చెబుతున్నాను. ప్రపంచంలో ఆరోగ్య సేవలు అందించడానికి సంబంధించిన దానధర్మాలపైనే మేం మాట్లాడుకునేవాళ్లం. ఆయనకు చాలా మంది పెద్ద పెద్ద ధనవంతులు తెలుసు. ప్రపంచంలో ఆరోగ్య సేవలు అందించడం కోసం నిధులు తీసుకొస్తానని చెప్పేవారు. మా మాటలన్నీ దానిపైనే ఉండేవి. చివరకు శూన్యం మిగిలింది. నేను ఎలాంటి అనుచిత సంబంధాలు పెట్టుకోలేదు" బిల్‌గేట్స్ స్పష్టం చేశారు.

స్వయం ప్రకటిత విశ్వగురువు ఒక్కపనీ నన్ను ఆకట్టుకోలేదు!

» ఆయన్ను నేను ఎప్పుడూ కీర్తించలేదు

» ప్రధాని మోదీపై నసీరుద్దీన్ షా విమర్శలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: ప్రధాని మోదీ 'స్వయం ప్రకటిత విశ్వగురువు'గా ప్రముఖ హిందీ నటుడు నసీరుద్దీన్ షా అభివర్ణించారు. ఆయన్ను తాను ఎప్పుడూ కీర్తించలేదని చెప్పారు. గత పదేళ్లలో స్వయం ప్రకటిత విశ్వగురువు చేసిన ఒక్కపనీ తనను ఆకట్టుకోలేకపోయిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఓ ఆంగ్ల పత్రికకు నసీరుద్దీన్ షా ఓ వ్యాసం రాశారు. ఇటీవల ముంబై యూనివర్సిటీ తాము నిర్వహిస్తున్న 'జష్న్-ఎ-ఉర్దూ' కార్యక్రమం కోసం నసీరుద్దీన్ షాను ఆహ్వానించింది. ఆ కార్యక్రమానికి ఆయన హాజరుకాలేదు. అయితే కార్యక్రమానికి వెళ్లేందుకు తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూశానని, కానీ ముందు రోజు రాత్రి వర్సిటీ అధికారులు ఫోన్ చేసి రావొద్దని చెప్పడంతోనే తాను వెళ్లలేదని ఆ వ్యాసంలో నసీరుద్దీన్ షా వివరణ ఇచ్చారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులు, నేతలపై తాను బహిరంగంగా చేస్తున్న విమర్శల కారణంగానే ఆహ్వానాన్ని వెనక్కి తీసుకొని ఉంటారని ఆయన అనుమానాలు వ్యక్తం చేస్తూ.. 'స్వయం ప్రకటిత విశ్వగురువు'ను తాను ఎప్పుడూ పొగడలేదని చెప్పారు. మోదీ పేరును ఆయన ఎక్కడా ప్రస్తావించలేదు. అయితే స్వయం ప్రకటిత విశ్వగురువు ప్రవర్తించే విధానంపైనే తాను విమర్శలు చేశానని.. ఆయన తనను తాను కీర్తించుకునే ధోరణే తనకు నచ్చదని చెప్పారు. తన విమర్శలు దేశంపైన కాదని, అధికారంలో ఉన్నవారు ప్రవర్తిస్తున్న తీరుపైనేనని స్పష్టం చేశారు. 'గొప్ప నాయకుడు' అని పొగడకపోతే దేశ వ్యతిరేకులుగా ముద్రపడే ప్రమాదం నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు.

అమెరికా సుంకాల తగ్గింపు.. వారంలో అమల్లోకి!

» అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందంపై నాలుగైదు రోజుల్లో సంయుక్త ప్రకటన

» మార్చి మధ్య నాటికి చట్టబద్ధ ఒప్పందం

» అమెరికా నుంచి రూ.45 లక్షల కోట్ల దిగుమతులు పెద్ద కష్టం కాదు..

» వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ వెల్లడి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తొలిదశ సిద్ధమైందని.. దీనిపై నాలుగైదు రోజుల్లో సంతకాలు జరిగి, సంయుక్త ప్రకటన వెలువడుతుందని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. తర్వాతి ఒకటి రెండు రోజుల్లోనే (సుమారు వారం రోజుల్లో) భారత ఉత్పత్తులపై అమెరికా సుంకాల తగ్గింపు అమల్లోకి వస్తుందని తెలిపారు. చట్టబద్ధ ఒప్పందాన్ని సిద్ధం చేయడానికి నెలా, నెలన్నర రోజులు పట్టవచ్చని.. మార్చి మధ్య నాటికి దానిపై సంతకాలు పూర్తయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. ఆ తర్వాత అమెరికా ఉత్పత్తులపై భారత్‌లో సుంకాల తగ్గింపు అమల్లోకి వస్తుందని తెలిపారు. చట్టబద్ధ ఒప్పందం తర్వాత భారత్‌కు మరిన్ని మినహాయింపులు దక్కుతాయని, అందువల్ల ఒప్పందం ప్రక్రియను వేగంగా పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు. అమెరికా నుంచి రూ.45 లక్షల కోట్ల (500 బిలియన్ డాలర్ల) దిగుమతులకు అంగీకరించిన అంశంపై పీయూష్ గోయల్ స్పందిస్తూ.. "వేగంగా వృద్ధి చెందుతున్న భారత్‌కు భారీగా చమురు, డేటా సెంటర్లు, సమాచార రంగ పరికరాలు అవసరం. దానికి అదనంగా మన దేశానికి అవసరమైన విమానాల కోసం ఇప్పటికే చేసిన, ఇకపై చేయబోయే ఆర్డర్ల విలువే రూ.7.2 లక్షల కోట్ల (80 బిలియన్ డాలర్ల)కుపైగా ఉంటుంది. ఇక పాతవాటికి అవసరమైన ఇంజన్లు, విడిభాగాల ఖర్చును కలిపితే ఇది రూ.9లక్షల కోట్లు (100 బిలియన్లు) దాటుతుంది. భారత్ డేటా సెంటర్ల ఏర్పాటుకు ట్యాక్స్ హాలిడే ఇచ్చింది. దీనితో రూ.9 లక్షల కోట్ల నుంచి రూ.13.5 లక్షల కోట్ల మేర డేటా సెంటర్ల ఏర్పాటుకు పెట్టుబడులు వస్తే.. వాటికి సంబంధించిన పరికరాలను అమెరికా నుంచే దిగుమతి చేసుకుంటాం. ఇలాంటివన్నీ లెక్కిస్తే రూ.45 లక్షల కోట్ల దిగుమతులు పెద్ద విషయమేమీ కాదు.." అని పేర్కొన్నారు. అమెరికాలో భారత్ పెట్టుబడులు పెట్టాలన్న అంశమేదీ వాణిజ్య ఒప్పందంలో లేదని స్పష్టం చేశారు. ఇక వాణిజ్యశాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ మాట్లాడుతూ.. అమెరికాలో కేవలం ప్రభుత్వ ఉత్తర్వు జారీ చేస్తే చాలు సుంకాల్లో మార్పులు అమల్లోకి వస్తాయని.. కానీ భారత్ చట్టాల ప్రకారం సన్నిహిత మిత్రదేశం (మోస్ట్ ఫేవర్డ్ నేషన్) హోదా కల్పించి, పూర్తిస్థాయి చట్టబద్ధ ఒప్పందంపై సంతకాలు జరిగితేనే సుంకా ల్లో మార్పు చేయవచ్చని తెలిపారు. ఈ కారణంగానే అమెరికా సుంకాల తగ్గింపు త్వరగా అమలవుతుందని.. భారత సుంకాల తగ్గింపు కోసం సమయం పడుతుందని, దీనిని ఒప్పందంలో చేర్చామని ఆయన వివరించారు.

ఇంధన భద్రతకు అనుగుణంగానే నిర్ణయం: విదేశాంగ శాఖ

దేశంలోని 140 కోట్ల మంది ప్రజల ఇంధన భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని.. అందుకు అనుగుణంగానే చమురు కొనుగోళ్లపై నిర్ణయాలు తీసుకుంటుందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ పూర్తిగా నిలిపివేస్తుందని, వెనెజువెలా చమురు కొంటుందని అమెరికా చేసిన ప్రకటనను మీడియా ప్రస్తావించగా.. దేశ ప్రజల ఇంధన భద్రతకే ప్రభుత్వ ప్రాధాన్యం ఉంటుందన్నారు. భారత్ గతంలో వెనెజువెలా నుంచి చమురు కొనుగోలు చేసిందని తెలిపారు. ఇప్పుడు కూడా అవసరాన్ని బట్టి, వెనెజువెలా, ఇతర ప్రాంతాల నుంచి చమురు కొనే అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తుందని జైస్వాల్ వెల్లడించారు.

థరూర్ కుమారుడిపై 'వాషింగ్టన్ పోస్టు' వేటు

» ఇషాన్ థరూర్ సహా 300 మంది జర్నలిస్టులు, సిబ్బంది తొలగింపు

వాషింగ్టన్, ఫిబ్రవరి 5: లే-ఆఫ్‌ల సెగ కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్ కుమారుడు ఇషాన్ థరూర్‌కూ తగిలింది. ఉద్యోగాల్లో కోతలో భాగంగా ప్రముఖ ఆంగ్ల పత్రిక 'ది వాషింగ్టన్ పోస్టు' ఆయనతోపాటు 300 మంది జర్నలిస్టు లు, ఉద్యోగులను తొలగించింది. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్‌కు చెందిన ఈ పత్రిక.. స్పోర్ట్స్ డెస్క్‌ను, విదేశీ బ్యూరోలను మూసివేసింది. అలాగే పుస్తకాల కవరేజీని కూడా ఆపేసింది. ఇషాన్ ఇక్కడ సీనియర్ అంతర్జాతీయ వ్యవహారాల కాలమిస్టుగా పనిచేస్తున్నారు. వాషింగ్టన్ పోస్టులో 800 మంది జర్నలిస్టులు ఉన్నారని.. వారిలో 300 మంది పైచిలుకును యాజమాన్యం బుధవారం తొలగించిందని మరో పత్రిక 'ది న్యూయార్క్ టైమ్స్' వెల్లడించింది. ఇషాన్ కూడా తన తొలగింపును 'ఎక్స్'లో ధ్రువీకరించారు. వాషింగ్టన్ పోస్టు కార్యాలయంలో చర్చల్లో తాను పాల్గొన్న న్యూస్‌రూం ఫొటో పెట్టి.. 'చీకట్లో ప్రజాస్వామ్యం చనిపోయింది' అంటూ ఓ పోస్టరు పెట్టారు. దానికి 'దుర్దినం' అనే శీర్షిక పెట్టారు. 'నాతో పాటు పలువురు అంతర్జాతీయ సిబ్బందిని, అద్భుతమైన సహచరులను ఉద్యోగం నుంచి తొలగించారు. నిర్భయంగా వ్యవహరిస్తూ 12 ఏళ్లుగా వాషింగ్టన్ పోస్టుకు సేవలందిస్తున్న నా మిత్రులైన ఎడిటర్లు, కరెస్పాండెంట్లను తీసివేయడంతో గుండె బద్దలైంది. వారితో కలిసి పనిచేయడం ఓ గౌరవం' అని ఆయన పోస్టు చేశారు. కాగా.. ఇషాన్ సహా 300 మందిని తొలగించడం బాధగానే ఉందని పత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ మ్యాట్ ముర్రే పేర్కొన్నారు. 1877లో 'వాషింగ్టన్ పోస్టు' ఆవిర్భవించింది. ఈ పత్రిక 2023లో 7 కోట్ల డాలర్లు, 2024లో 10 కోట్ల డాలర్లు నష్టపోయినట్లు అంచనా. వాషింగ్టన్ పోస్టు తీసుకున్న నిర్ణయం అసాధారణం.. ఆత్మహత్యాసదృశమని శశి థరూర్ 'ఎక్స్'లో ఆగ్రహం చేశారు.



ముంబై-పుణె హైవేపై.. 33గంటల ట్రాఫిక్ నరకం

ముంబై, ఫిబ్రవరి 5: ముంబై-పుణె ఎక్స్‌ప్రెస్ హైవేపై దాదాపు 33గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. మంగళవారం సాయంత్రం ఖండాలా ఘాట్ సెక్షన్‌లో అతివేగంతో వెళ్తున్న ప్రొపిలీన్ గ్యాస్ ట్యాంకర్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదకరమైన, మండే స్వభావం గల గ్యాస్ కావడంతో అధికారులు భద్రతా కారణాల దృష్ట్యా రోడ్డును మూసివేశారు. బుధవారం రోజంతా ట్యాంకర్‌లోని గ్యాస్‌ను మరో వాహనంలోకి మార్చే ప్రక్రియ కొనసాగింది. దీనివల్ల హైవేపై సుమారు 22 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు నరకయాత న అనుభవించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త సుధీర్ మెహతా 8గంటల పాటు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. ఆయన తన కారును అక్కడే వదిలేసి తిరిగి పుణె చేరుకోవడానికి హెలికాప్టర్‌ను ఆశ్రయించారు. గురువారం తెల్లవారుజాము నుంచి రాకపోకలు పునఃప్రారంభమయ్యాయి.


లండన్ మ్యూజియంలో ఉన్న అమరావతి స్తూపరాయి శిల్పాలు

లండన్ మ్యూజియం నుంచి అమరావతి శిల్పాలు రప్పించే ప్రయత్నాలు

» కేంద్రానికి లేఖ రాసిన సాంస్కృతిక శాఖ

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియంలో భద్రపరిచిన అమరావతి స్తూపానికి చెందిన శిల్పాలను ఆంధ్రప్రదేశ్‌కు తిరిగి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు వేగవంతం చేసింది. ఈ మేరకు యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్.. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖకు లేఖ రాశారు. మొదటి దశలో ఈ శిల్పాలను అప్పుగా (లోన్ పద్ధతిలో) భారత్‌కు తీసుకురావడంపై బ్రిటిష్ మ్యూజియంతో చర్చలు జరపాలని లేఖలో సూచించారు. ప్రస్తుతం బ్రిటిష్ మ్యూజియంలో సుమారు 133 అమరావతి శిల్పాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ప్రతిపాదిత మ్యూజియం నిర్మాణం పూర్తయ్యాక ఈ శిల్పాలను అమరావతిలో ప్రదర్శించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

ఉపాధి కోసం ఒమాన్‌కు వచ్చిన మహిళకు అస్వస్థత

» సందర్శక వీసాతో రావడంతో చికిత్సకు ఇబ్బందులు

» అండగా నిలిచి స్వదేశానికి పంపిన టీడీపీ ఎన్నారై విభాగం


అబిదా బేగంతో టీడీపీ ఎన్నారై విభాగం ప్రతినిధులు

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి

ఉపాధి కోసం ఒమాన్ దేశానికి వెళ్లిన శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన మహిళ విమానం దిగేసరికి అస్వస్థతకు గురైంది. సందర్శక వీసాతో ఒమాన్ చేరుకున్న ఆమె చికిత్స పొందేందుకు ఇబ్బందులు ఎదుర్కొంది. ఈ విషయం తెలిసి తెలుగు ప్రవాసీయులు అండగా నిలిచారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన అబిదా బేగం(48) అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన ఒక ఏజెంటు సహాయంతో సందర్శక వీసాపై ఒమాన్‌కు చేరుకుంది. విమానం దిగిన వెంటనే ఆరోగ్యం క్షీణించడంతో ఆమెను హుటాహుటిన మస్కట్ నగరంలోని ఒక ఆసుపత్రికి తరలించారు. ఎలాంటి ఉద్యోగ ఒప్పందం, ఉపాధి వీసా లేకుండా కేవలం సందర్శక వీసాపై వచ్చిన ఆమె చికిత్స పొందేందుకు ఇబ్బందులను ఎదుర్కొంది. ఆమె దీనస్థితి గురించి తెలుసుకున్న ఒమాన్‌లోని తెలుగుదేశం పార్టీ ఎన్నారై, హైదరాబాద్ దక్కన్ వింగ్ సభ్యులు అబిదా చికిత్సకు అవసరమైన ఖర్చును భరించడంతో పాటు ఆమె వీసా గడువు ముగియక ముందే బుధవారం రాత్రి స్వదేశానికి వెళ్లడానికి విమాన టికెట్ సమకూర్చారు. తెలుగు రాష్ట్రాల నుంచి సందర్శక వీసాలపై వచ్చి ఇబ్బందులకు గురి కావద్దని ఒమాన్‌లోని తెలుగుదేశం పార్టీ ఎన్నారై విభాగం ప్రతినిధి గారపాటి సత్య శ్రీధర్ విజ్ఞప్తి చేశారు.

హజ్ యాత్ర ఏర్పాట్లపై మంత్రి ఫరూక్ సమీక్ష

విజయవాడ(లబ్బీపేట), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కార్యాచరణ సిద్ధం చేసినట్టు రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్ తెలిపారు. హజ్ యాత్ర-2026 ఏర్పాట్లపై గురువారం విజయవాడలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం నుంచి హజ్‌యాత్రకు వెళ్లే వారందరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా రవాణా, వసతి, భద్రత కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని తెలిపారు. జిల్లాల వారీగా ఉన్న హజ్ సొసైటీలు తమ పరిధిలో హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్, యాత్రలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించేందుకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింటు నుంచి వెళ్లేవారికి ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక చేయూత అందిస్తుందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైలు ఢీకొని చిరుత మృతి



కర్నూలు జిల్లా కోసిగి రైల్వేస్టేషన్ సమీపంలో రైలు ఢీకొని ఓ ఆడ చిరుతపులి మృతి చెందింది. కోసిగి-పీకలబెట్ట మార్గంలో రైలుపట్టాల పక్కన గురువారం ఉదయం చిరుత కళేబరాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. పులి కళేబరం నుంచి సేకరించిన శాంపిళ్లను కర్నూలు రాయలసీమ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు, చెన్నై ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు జిల్లా ఫారెస్టు అధికారిణి శ్యామలాదేవి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం పులి మృతదేహాన్ని దహనం చేశారు. - కోసిగి, ఆంధ్రజ్యోతి

గుడ్డుకు గడ్డుకాలం!

» సంక్రాంతి తర్వాత తగ్గిన డిమాండ్

» ఒక గుడ్డుపై రైతుకు రూ.4.80 చెల్లింపు

» కోల్‌కతా మార్కెట్‌లో డిమాండ్ లేదంటూ రూ.4.37 కే అడుగుతున్న ట్రేడర్లు

» గిట్టుబాటు కాదంటున్న రైతులు

» ఫారాల వద్ద పేరుకుపోతున్న నిల్వలు



(అనపర్తి, ఆంధ్రజ్యోతి)

గుడ్డుకు గడ్డుకాలం వచ్చింది. గోదావరి నెక్ గుడ్డు ధర నెల రోజుల నుంచి నేల చూపులు చూస్తోంది. ప్రస్తుతం ఒక గుడ్డుపై కోళ్ల రైతుకు చెల్లిస్తున్న రేటు రూ.4.80 . గోదావరి గుడ్డుకు ప్రధాన మార్కెట్ కోల్‌కతా. అయితే, అక్కడి మార్కెట్‌లో డిమాండ్ లేదంటూ ట్రేడర్లు మరీ తగ్గించి అడుగుతున్నారు. ట్రేడర్లు రూ.4.37 పైసలకు బేరం ఆడుతున్నారు. ఆ రేటుపైకే కోల్‌కతాకు ప్యాకింగ్ చేస్తామని చెబుతున్నారు. దీంతో నాలుగు రోజులుగా ప్యాకింగ్‌లు నిలిచిపోయి ఫారాల వద్ద గుడ్లు పేరుకుపోతున్నాయి. దీనిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఒక గుడ్డు ఉత్పత్తికి రూ.5.50 పైసలు వరకు ఖర్చు అవుతోందని, ట్రేడర్లు అడిగిన రేటుకు ఇస్తే తమకు గుడ్డుకు 1.13పైసలు నష్టం వస్తుందని వాపోతున్నారు. పైగా, దీనిపై ట్రేడర్లు రెండు శాతం కమీషన్ కూడా ఇవ్వాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశంలోని మిగిలిన మార్కెట్లకు డిమాండ్ బాగానే ఉంది. గోదావరి నెక్‌లో కూడా జనవరి వరకు మంచి రేటే పలికింది. డిసెంబరు 22 నాటికి ఒక గుడ్డుకు రైతుకు చెల్లించే ధర రూ.6.95పైసలకు చేరుకుని రికార్డు నెలకొల్పింది. ఆ తర్వాత కోళ్ల రైతులకు కష్టాలు మొదలయ్యాయి. కోల్‌కతా మార్కెట్‌కు వివిధ రాష్ట్రాల నుంచి గుడ్లు అధికంగా రావడంతో, అక్కడి ట్రేడర్లు ధరను తగ్గిస్తున్నారని ఇక్కడి ట్రేడర్లు వివరణ ఇస్తున్నారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉండగా, సహజంగా డిమాండ్ తక్కువ ఉండే వేసవిలో తమ పరిస్థితిని ఊహించుకుని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆ ఐదేళ్లలో ఎంత అరాచకమో..

గర్భిణులన్న కనికరం చూపలేదు.. దాడులు చేశారు.. తరిమికొట్టారు



మహిళలు అని కూడా చూడలేదు

గ్రామంలో వైసీపీ నాయకులు మాపై అక్కసు పెంచుకొని మహిళలు అని కూడా చూడకుండా కులాల పేరుతో దూషిస్తూ గ్రామం నుంచి తరిమికొట్టారు. నా కుమార్తె ప్రసవ వేదనతో బాధపడుతున్నా కనీసం కనికరం చూపలేదు. గ్రామంలో ఉండడానికి వీల్లేదని హుకుం జారీ చేశారు. గత్యంతరం లేక మేము ఊరు విడిచి వెళ్లిపోయాం. మమ్మల్ని అక్కున చేర్చుకొని, మా కుటుంబాలు చెదిరిపోకుండా కాపాడి అధికారంలోకి వచ్చాక గుర్తుంచుకుని ఆదుకుని సాయం చేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. - మందా శాంతికుమారి

» జగన్ పాలనలో పల్నాడు జిల్లా దళితులపై దాష్టీకం

» టీడీపీకి ఓటేశారనే అక్కసుతో దాడులు

» తల్లడిల్లిన దళిత హృదయాలకు నాడు చంద్రబాబు భరోసా

» ఆత్మకూరు బాధితులకు ప్రభుత్వ సాయం

» రూ.1.16 కోట్లను అందించిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

వెల్దుర్తి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): "తెలుగుదేశం పార్టీకి సానుభూతిపరులుగా ఉండటం, ఆపార్టీకి ఓటేయడమే వారి తప్పయింది. పల్నాడు జిల్లా, దుర్గి మండలం, ఆత్మకూరు గ్రామానికి చెందిన 116 కుటుంబాలను గ్రామంలో అడుగు పెట్టనీయకుండా ఐదేళ్లపాటు వైసీపీ నేతలు తరిమిగొట్టారు. మహిళలు, గర్భిణుల పట్ల కనీసం కనికరం చూపకుండా దాడులకు తెగబడ్డారు. వీరి కష్టాలు చూడలేక నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు ఛలో ఆత్మకూరు కార్యక్రమం తలపెట్టగా నాటి వైసీపీ పాలకులు ఆయన్ను గృహ నిర్బంధం చేశారు. గ్రామానికి చెందిన దళిత కుటుంబాలు చంద్రబాబును కలిసేందుకు గుంటూరు వెళ్లారు. వారికి తాత్కాలిక ఆవాసం కల్పించి ఆరు నెలల పాటు ఆదుకొని పోలీసుల సహాయంతో గ్రామానికి వచ్చేందుకు చంద్రబాబు కృషి చేశారు" అంటూ వైసీపీ పాలనలో దళితులపై దాష్టీకాలను మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి గుర్తుచేశారు. దళితులను అన్ని విధాలా ఆదుకుంటానని ఆనాడు చంద్రబాబు వారికిచ్చిన మాట ప్రకారం ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం తరఫున రూ.లక్ష చొప్పున 116 కుటుంబాలకు రూ.1.16 కోట్లు అందించారన్నారు. గురువారం వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారితో ఆయన సమావేశమై చెక్కులను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వంలో దాదాపు 3 వేల మంది దళితులు హత్యకు గురయ్యారని చెప్పారు. దళితులను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు మేకల దాసు (బిక్షం) మాట్లాడుతూ, రాష్ట్రంలో దళిత హక్కులను కూటమి ప్రభుత్వం కాపాడుతుందని అన్నారు. ఆత్మకూరు దళితులకు సాయం అందించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. దళిత నేత మాచర్ల వాసు మాట్లాడుతూ, నాడు ఇబ్బందులు పడ్డ దళితులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సాయం చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో నాటి బాధితులు తమ అనుభవాలు పంచుకున్నారు.

టీడీపీ నేతల భరోసా మమ్మల్ని బతికించింది



నాటి పరిస్థితుల్లో మేం బతికి తిరిగి ఊళ్లోకి వస్తామనే నమ్మకం లేకపోయింది. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి కుటుంబంపై మాకు అపారమైన నమ్మకం ఉంది. టీడీపీ నేతల భరోసా మమ్మల్ని బతికించింది. ముఖ్యమంత్రి చంద్రబాబుతో బ్రహ్మానందరెడ్డి మాట్లాడి మమ్మలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశారు. గ్రామంలో ఎప్పటిలాగే జీవనం సాగించేందుకు అవకాశం కల్పించడం మాకెంతో సంతోషాన్ని ఇస్తోంది. బతికున్నంత కాలం మా దళితులంతా సీఎం, ఎమ్మెల్యేలకు రుణపడి ఉంటాం. - మందా శారమ్మ

నా తల్లి మృతదేహాన్ని ఊళ్లోకి రానివ్వలేదు



నా అమ్మ 95 యేళ్ల వృద్ధురాలు చనిపోతే అంత్యక్రియలు చేసుకునేందుకు మృతదేహాన్ని గ్రామానికి తీసుకొస్తామంటే ఆనాటి వైసీపీ నేతలు ఊళ్లోకి రానివ్వకుండా అడ్డుకున్నారు. ఇది మాకెంతో బాధ కలిగించింది. గత వైసీపీ ప్రభుత్వం దళితుల పట్ల అనేక దాష్టీకాలకు పాల్పడింది. మమ్ములను, మా కుటుంబాలను గ్రామం నుంచి తరిమివేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి మేం ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు వెసులుబాటు కల్పించారు. వారికి రుణపడి ఉంటాం.

- మాచర్ల మదార్, దళిత నేత, ఆత్మకూరు

మెడికో అనుమానాస్పద మృతి

» విజయవాడ ప్రభుత్వాసుపత్రి ఆపరేషన్ గదిలో ఘటన

» 'సిద్ధార్థ'లో పీజీ చదువుతున్న విద్యార్థిని

» విచారణకు కమిటీ ఏర్పాటు

» ఘటనపై మంత్రి సత్యకుమార్ ఆరా


దీపిక

విజయవాడ, అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని సిద్ధార్థ వైద్య కళాశాల పీజీ చివరి సంవత్సరం విద్యార్థిని అనుమానస్పద స్థితిలో మృతిచెందింది. విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. అనంతపురానికి చెందిన బత్తుల దీపిక (27) సిద్ధార్థ వైద్య కళాశాలలో అనస్తీషియా విభాగంలో పీజీ చివరి సంవత్సరం చదువుతోంది. బుధవారం రాత్రి విధుల నిమిత్తం ప్రభుత్వాస్పత్రిలోని సీ బ్లాక్‌కు వెళ్లింది. ఆమెతో పాటు మొదటి సంవత్సరం పీజీ విద్యార్థిని దివ్య కూడా విధుల్లో ఉంది. ఇద్దరూ పది గంటల సమయంలో ఎగ్ ఫ్రైడ్‌రైస్ తెప్పించుకుని తిన్నారు. అనంతరం దివ్య వార్డుల్లో రోగులను పరిశీలించడానికి వెళ్లి 1.30 గంటలకు తిరిగి వచ్చింది. ఆ తర్వాత క్యాజువాలిటీలో ఉన్న రోగిని పరీక్షించడానికి వెళ్దామని దీపికను దివ్య అడిగింది. తనకు వాంతి అయ్యేలా ఉందని, తగ్గడానికి ఇంజెక్షన్ చేయాలని దీపిక కోరింది. దీంతో దివ్య ఆమె చెప్పిన ఆన్‌డెన్‌సెట్రాన్ ఇంజెక్షన్ చేసింది. తర్వాత దివ్య క్యాజువాలిటీకి వెళ్లింది. రోగి పరిస్థితి చెప్పడానికి దీపికకు ఫోన్ చేయగా ఆమె స్పందించలేదు. పీజీ డ్యూటీ రూం వద్దకు వెళ్లి చూడగా అక్కడ కనిపించలేదు. ఆపరేషన్ థియేటర్ వద్ద అపస్మారక స్థితిలో కనిపించింది. సమాచారం అందుకున్న ఆస్పత్రి అనస్తీషియా విభాగాధిపతి వినయ్ వచ్చి ఆమెకు సీపీఆర్ చేశారు. ఇతరపరీక్షలు కూడా చేసి చనిపోయినట్టు నిర్ధారించారు. దీనిపై ఆసుపత్రి, కళాశాల అధికారులు కలెక్టర్, డీఎంఈ, దీపిక తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. కాగా, ఘటనపై ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరా తీశారు. విచారణకు ఉన్నతస్థాయి కమిటీని నియమించారు. ప్రస్తుతానికి విద్యార్థిని మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని, పోస్టుమార్టం నివేదిక వస్తే మరణానికి కారణాలు తెలుస్తాయని ఇన్‌చార్జ్ సూపరిండెంట్ ఏడుకొండలరావు వెల్లడించారు. కాగా, దీపిక గ్యాస్ నొప్పికి తనంతట తాను మరో ఇంజక్షన్ చేసుకుందా అనే అనుమానాలను వైద్యులు, పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. పీజీ విద్యార్థిని దీపిక అనుమానాస్పద మృతిపై రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఆరా తీశారు.

పని ఒత్తిడి తట్టుకోలేక టెకీ ఆత్మహత్య


సతీశ్

మియాపూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగంలో పని ఒత్తిడి తట్టుకోలేక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. అమలాపురానికి చెందిన సతీశ్ (31) గచ్చిబౌలిలోని ఎక్సెంచర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు ఏడాది క్రితం రవళితో వివాహమైంది. రవళి సంక్రాంతి పండుగకు ఊరెళ్లగా.. ప్రస్తుతం ఇంట్లో సతీశ్, అతడి సోదరుడు మాత్రమే ఉన్నారు. బుధవారం ఉదయం 10 గంటలైనా సతీశ్ బెడ్‌రూమ్ తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన అతడి సోదరుడు తలుపులు పగులగొట్టి చూడగా... ఫ్యాన్‌కు ఉరివేసుకొని కనిపించారు. స్థానికుల సాయంతో కిందికి దించి చూడగా అప్పటికే చనిపోయి ఉన్నారు. మియాపూర్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు.



అభివృద్ధి కాదు.. విధ్వంసం కావాలి!

» అందుకోసం ఎదురుచూపులు.. వైసీపీ ఫ్లెక్సీ వైరల్

ఎవరైనా అధికారంలోకి వస్తే అభివృద్ధి చేస్తాం, ప్రజల సంక్షేమం కోసం పాటుపడతాం.. అని చెబుతుంటారు. అయితే వైసీపీ నేతలు, కార్యకర్తల తీరు అందుకు విరుద్ధం. గత ప్రభుత్వ హయాంలో అరాచకాలు, విధ్వంసాలతో విసిగిన ప్రజలు ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పినా ఏమాత్రం మార్పు రాలేదు. అదే 'విధ్వంసం', 'రప్పా రప్పా' నినాదాలు! ఆ పార్టీ శ్రేణులు విధ్వంసాన్నే కోరుకుంటున్నాయి. పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం కోట నెమలిపురి గ్రామంలో ఏర్పాటు చేసిన ఓ ఫ్లెక్సీ ఇందుకు ఉదాహరణగా కనిపిస్తోంది. 'నువ్వు సృష్టించే విధ్వంసం కోసం ఎదురు చూస్తున్నాం.. 2029' అని అందులో రాసి ఉంది. గతేడాది జగన్ పుట్టినరోజు సందర్భంగా ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీన్ని చూసిన వారు విధ్వంసం, రప్పా రప్పా అనేవి వైసీపీ పేటెంట్ పదాలుగా మారాయనుకుంటున్నారు. - నరసరావుపేట-ఆంధ్రజ్యోతి

ఆర్టీసీ బస్సులో మంటలు



తిరుపతి నుంచి వినుకొండకు 28 మంది ప్రయాణికులతో గురువారం రాత్రి బయలుదేరిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సులో విన్నమాల సమీపంలోకి రాగానే అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన ప్రయాణికులు కిందకు దిగేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగినట్టు అనుమానిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, నాయుడుపేట టౌన్

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పాక్‌కు బలూచ్ భయం

పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్సులో ఏకకాలంలో దాదాపు పన్నెండు జిల్లాల్లో బలూచ్ ఆర్మీ జరిపిన భీకరదాడుల్లో వందలాది ప్రాణాలు పోయాయి. 36మంది పౌరులు, 22మంది పాక్ భద్రతాసిబ్బంది ఈ దాడుల్లో మరణించారని, 192మంది బలూచ్ ఉగ్రవాదులను తాము మట్టుబెట్టామని పాక్ ప్రభుత్వం అధికారికంగా చెబుతున్నప్పటికీ, దాడుల తీవ్రత దృష్ట్యా సైనికుల మరణాలు అనేక రెట్లు ఉండవచ్చునని అంచనా. ఇప్పటికీ అక్కడక్కడ పరస్పరదాడులు జరుగుతున్నట్టుగా, ఇతర ప్రావిన్సులనుంచి వచ్చిన పాకిస్థానీలమీద స్థానికులు విరుచుకుపడుతున్నట్టుగా వార్తలు వెలువడుతున్నాయి. బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ)ను ఉగ్రవాద సంస్థగా గుర్తించిన నేపథ్యంలో, మంగళవారం ఐక్యరాజ్యసమితి కొన్ని పడిగట్టుపదాలతో ఈ ఘటనను ఖండించడంలో ఆశ్చర్యమేమీ లేదు. కానీ, బలూచ్ తిరుగుబాటు దారులను ఎదుర్కోవడం తమవల్ల కావడం లేదని పాకిస్థాన్ రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ జాతీయ అసెంబ్లీలో వ్యాఖ్యానించడం ద్వారా తమ పరువు తామే తీసుకున్నట్టు అయింది.

విదేశీశక్తుల సాయంతోనే బలూచ్ ఆర్మీ రెచ్చిపోతోందని చెప్పుకోవడం పాక్ పాలకులకు క్షేమకరం. ఎవరో ఆర్థికసాయం చేస్తున్నారని, అత్యాధునిక ఆయుధాలు అందిస్తున్నారని అనడం ద్వారా తమ వైఫల్యాన్ని, నష్టాన్ని చక్కగా సమర్థించుకోవచ్చు. పాకిస్థాన్‌లోని అతిపెద్ద ప్రాంతంలో స్వల్ప సంఖ్యలో ఉన్న ఈ టెర్రరిస్టుల దగ్గర ఒక్కొక్కటీ రెండుకోట్లు విలువచేసే అధునాతన రైఫిళ్ళు, మెషీన్‌గన్లు, నైట్‌విజన్ పరికరాలు, థర్మల్ వెపన్స్ వంటివి ఉన్నాయని, పాకిస్థాన్ సైన్యం దగ్గర ఆ స్థాయివి లేనేలేవని, అందువల్ల ఢీకొట్టడం కష్టమవుతోందని ఆయన వ్యాఖ్యల సారాంశం. బీఎల్ఏ నాయకత్వం అఫ్ఘానిస్థాన్‌లో ఉన్నదని, ఆయుధాలు అమెరికావని ఆయన మాట్లాడారు. రెబెల్స్ విరుచుకుపడుతూంటే పాక్ ఆర్మీ పరుగులు తీస్తోందని సామాజిక మాధ్యమాల్లో సాగుతున్న ప్రచారం ఆయనను ఇబ్బంది పెట్టడం సహజం. తిరుగుబాటుదారుల దెబ్బకు పాక్‌సైనికులు మిలటరీ క్యాంపులు వదిలేసి పారిపోతున్నారంటూ ఖాళీగా ఉన్న ఆ స్థావరాలు, సైనికదుస్తులు, వివిధ పరికరాలు సోషల్ మీడియాలో ప్రచారమవుతున్నాయి. సరైన సమన్వయంతో, ఏకకాలంలో, అనేక ప్రాంతాల్లో భయానక దాడులు జరిపి వందమందికి పైగా శత్రువులను మట్టుబెట్టామని బలూచ్ ఆర్మీ చెప్పుకుంటూంటే, పాక్ ఆర్మీ 'ఫిజికల్లీ హ్యాండీకాప్డ్' అయిపోయిందని స్వయంగా రక్షణమంత్రి చట్టసభలో అనడం విచిత్రం. బలూచ్ తిరుగుబాటుదారులకు భారత్ సహకరిస్తున్నదంటూ పాక్ పాలకులు విమర్శించడం, మనం ఖండించడం ఇప్పుడూ జరిగింది.

ఇటీవలి కాలంలో బీఎల్ఏ ప్రతిఘటన స్థాయిలోనూ, తీవ్రతలో మార్పు వచ్చింది. పాక్ భద్రతాబలగాలను లక్ష్యంగా చేసుకొని రెబెల్స్ వివిధరకాల దాడులు చేస్తున్నారు. ఆత్మాహుతిదాడులు గతంలోనూ ఉన్నవే కానీ, మహిళలను అధికంగా వినియోగించడం పెరిగిందని అంటున్నారు. గత వారం జరిగిన దాడుల్లో ఇద్దరు మహిళలు ప్రధానపాత్ర పోషించారంటూ బలూచ్ ఆర్మీ వారి ఫోటోలను, వివరాలను, వీడియోలను సైతం విడుదల చేసి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. వనరులదోపిడీ, అణచివేతను ఎదుర్కోవడానికి తమవారు నవ్వుతూ ప్రాణాలు వదిలేస్తున్నారంటూ ఆ సంస్థ చెప్పుకుంటోంది.

మొత్తం పాకిస్థాన్‌లో నలభైశాతం భూభాగం ఉన్న ఈ ప్రావిన్సుని ఎందుకు అదుపుచేయలేపోతున్నామో పాకిస్థాన్ పాలకులు ఆలోచించాలి. అత్యంత విలువైన ఖనిజ సంపదతోపాటు, చమురు, సహజవాయువు, బంగారం ఇత్యాది భారీ నిల్వలున్న ఈ ప్రాంతాన్ని దోచుకోవడమే లక్ష్యంగా పాక్ పాలకులు ఆదినుంచీ వ్యవహరిస్తున్నారు. గనుల నిర్వహణతో పాటు, గ్వాదర్ నౌకాశ్రయాన్ని కూడా చైనా చేతుల్లో పెట్టి, అక్కడివరకూ చైనా–పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్‌ను నిర్మించుకొనేందుకు అనుమతించి బలూచ్‌లను మరింత రెచ్చగొట్టారు. బలూచిస్థాన్‌ను బలవంతంగా విలీనం చేసుకున్న పాకిస్థాన్ దానిని ఎన్నడూ తనది అనుకోలేదు. పాక్షిక స్వయంపాలనకు సైతం అనుమతించకుండా, ప్రజలు ఎన్నుకున్నవారిని కూలదోసి, తమ అనుకూలురని ప్రతిష్ఠించి, సైన్యంతో దానిని ఏలేందుకు ప్రయత్నించడమే ఈ పరిస్థితికి కారణం. పదేళ్ళకాలంలో పదివేలమంది బలూచ్‌లను మాయం చేసిన ఘనత పాక్ పాలకులది. గత ఏడాది మార్చిలో ఏకంగా ఒక రైలునే హైజాక్ చేసిన బలూచ్ ఆర్మీ, ఇటీవలి దాడితో తన శక్తిసామర్థ్యాలు మరింత హెచ్చినట్టుగా ప్రపంచానికి చాటగలిగింది.

వాణిజ్యం సరే.. విజ్ఞానం సంగతేమిటి?





■ రాహుల్ కుమార్

కొన్ని కీలక ఘటనలను గుర్తుంచుకోవటం అందరికీ అవసరమే! వ్యక్తుల జీవితాల్లోనూ, దేశాల చరిత్రల్లోనూ అలాంటి ఘటనలు తప్పనిసరిగా ఉంటాయి. స్వేచ్ఛ, సమానత్వం, సౌహార్దం అనే భావాలు రాజకీయాలకు పునాదులు కావాలని చాటిచెప్పిన ఫ్రెంచ్ విప్లవం (1789) అలాంటిదే. బ్రిటీషు వలసపాలనను ఎదిరించి స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్న అమెరికన్ విప్లవమూ (1776) అలాంటిదే. రష్యన్ అక్టోబర్ (1917) విప్లవమూ అదే కోవలోదే. ఆ మూడు విప్లవాలు కలిగించిన భావాలు ఎన్నో ఎగుడుదిగుడులను చూసినా ప్రపంచాన్ని ఇప్పటికీ ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. ఆధునిక రాజ్యాంగాలన్నీ ఈ భావాల ఆధారంగానే రూపొందాయి. ఇవన్నీ అందరికీ తెలిసిన అసాధారణ సంఘటనలు.

ఎంతో ప్రాచుర్యాన్ని సంపాదించుకున్న ఈ ఘటనలకు భిన్నమైనవీ ఉంటాయి. వాటికి ఇప్పుడిప్పుడే ప్రాధాన్యం లభిస్తోంది. 1820వ సంవత్సరం అలాంటి ఘటనకు సూచికగా మిగిలిపోయింది. ఆ ఏడాదిలో ప్రజలు విస్తృతంగా పాల్గొని ఎలాంటి విప్లవాన్నీ విజయవంతం చేయలేదు. కానీ ఒక మహా ఆర్థిక పరిణామానికి కొండ గుర్తుగా మాత్రం అది నిలిచిపోయింది. ఆ ఏడాది నాటికి చైనా, భారత్ ఆర్థిక వ్యవస్థలు ప్రపంచంలో అగ్రస్థానాన్ని కోల్పోయాయి. యూరప్ ఆధిపత్యం అన్నింటా మొదలైంది. అమెరికా ఆ దిశగా అడుగులు వేయటమూ ఆరంభమైంది. ఎంతో ప్రగతితో, ఎన్నో యుద్ధాలతో, ఎన్నో విధాల దోపిడీలతో కాలచక్రం గిర్రున తిరిగింది. రెండు వందల ఏళ్లు గడిచాయి. 2020 నాటికి చైనా తన ఆర్థిక అగ్రస్థానాన్ని తిరిగి సంపాదించుకుంది. భారత్ కూడా ఆ దిశగా అడుగులు వేస్తోందనే అంచనాలే ఎక్కువగా ఉన్నాయి. ప్రపంచ వస్తుసేవల ఉత్పత్తిలో కాస్త అటూ ఇటుగా 60శాతం వాటాను ఆసియా ఖండం మళ్లీ సంపాదించుకుంది. కరెన్సీ కొనుగోలు శక్తిలో తేడాలను (పర్చేజింగ్ పవర్ పారిటీ) పరిగణనలోకి తీసుకుని లెక్కగట్టిన ఈ అంచనాలు ఎక్కువగా కనపడొచ్చు. ఇతరత్రా ప్రమాణాల ప్రకారం చూసినా ఆ పరిణామమే స్పష్టమవుతుంది. అందుకే ఆర్థికరంగాన ఆసియా జైత్రయాత్రపై ఇప్పుడెవరికీ అనుమానాల్లేవు. అధిక జనాభా (450 కోట్లు) వల్ల ఆసియా తలసరి ఆదాయాలు అమెరికా, యూరప్‌లతో పోల్చితే తక్కువగా కనపడొచ్చు. అవి కూడా వేగంగా మారుతున్నాయి. రోజుకు మూడు డాలర్ల కంటే తక్కువ ఆదాయం ఉన్న వ్యక్తులు ఆసియాలో ప్రస్తుతం 5శాతం లోపుగానే ఉన్నారు. చైనాలో 1980 నాటికి 75 నుంచి 80 శాతం ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన ఉండేవారు. 2010 వచ్చేసరికి వారి సంఖ్య 10 శాతానికి దిగువకు పడిపోయింది. 30 ఏళ్లలో ప్రజల జీవితాల్లో ఇంతటి మార్పు వచ్చిన సంఘటన ప్రపంచ చరిత్రలోనే లేదు. అమెరికా, యూరప్ చరిత్రల్లో ఏ దశలోనూ దీన్ని చూడలేం. ప్రజాస్వామ్య దేశాల్లో మాదిరి రాజకీయ, భావప్రకటనా హక్కులు లేకపోయినా, ప్రజల నుంచి వచ్చే నిరంతర ఒత్తిళ్లు నాయకులను ప్రభావితం చేసే పరిస్థితులు లేకపోయినా అనూహ్యమైన ఆర్థికప్రగతి అక్కడ సాధ్యమైంది.

> **సొంతంగా శాస్త్ర, సాంకేతిక ఆవిష్కరణలు లేకుండా స్వదేశంలో ఎన్ని వస్తువులను తయారుచేసినా, విడిభాగాల అమరికలో ఎంత నైపుణ్యాన్ని సాధించినా విశ్వగురువు స్థానాన్ని సంపాదించలేం. మొబైల్ ఫోన్ల తయారీలో ప్రపంచంలోనే మనం రెండో స్థానంలో ఉన్నాం. కానీ ఏ ఫోనునీ భారత్ ఆవిష్కరించిన సాంకేతిక పరిజ్ఞానంతో తయారైందని చెప్పుకోలేం.**

ఒకవైపు ఆసియా ప్రజల నిజవేతనాలు గణనీయంగా పెరుగుతూ ఉంటే అమెరికాలో మాత్రం వాటిల్లో పెద్దగా ప్రగతిలేదు. ముఖ్యంగా 1973 నుంచి 2015 మధ్యకాలంలో నిజవేతనాల్లో (ద్రవ్యోల్బణ ప్రభావాన్ని తీసివేసిన తర్వాత లెక్కకట్టే నికర వేతనాలు) పెరుగుదల చాలా తక్కువగా నమోదైంది. 1973 వరకూ నిజవేతనాల్లో 91.3శాతం పెరుగుదల ఉంటే ఆ తర్వాత అది 11.1శాతానికే పరిమితమైంది. 1973 వరకూ ఉత్పాదకతలో (ప్రొడక్టివిటీ) పెరుగుదల 96.7 ఉంటే వేతనాల్లో ప్రగతి 91.3శాతంగా నమోదైంది. మనం ఘనంగా చెప్పుకునే ప్రపంచీకరణ యుగంలో (1973–2015) ఉత్పాదకతలో 73.4శాతం పెరుగుదల ఉంటే వేతనాలకు వచ్చేసరికి అది 11.1 శాతానికి పరిమితమవ్వటంతో.. ఎంతో అశాంతికీ అసంతృప్తికీ దారితీసింది. తయారీ రంగం కుంగిపోయింది. లక్షల ఉద్యోగాలు పోయాయి. విదేశీ ఉత్పత్తుల దిగుమతులు పెరిగాయి. ఉద్యోగాల కోసం వలసవచ్చిన ప్రజల నుంచి గట్టి పోటీ వచ్చింది. ఐటీ, ఫైనాన్స్, ఇన్సూరెన్స్, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో వేతనాల్లో పెరుగుదల ఉన్నా ఆసియా ప్రజలు వాటిల్లో ముందుండటం స్థానిక యువతను ఒత్తిళ్లకు గురిచేసింది. 2015 నాటికి అమెరికా అంతటా అభద్రతా భావమూ అసంతృప్తీ అలముకున్నాయి. అసమానతలూ విపరీతంగా పెరిగాయి. 1965లో కార్మికుడితో పోల్చితే సీఈఓ వేతనం 20 రెట్లు అధికంగా ఉండేది. 2013కు వచ్చేసరికి అది 296 రెట్లు అయింది. ఆదాయ అసమానతలకు దీనికి మించిన ఉదాహరణ లేదు. నివురుగప్పిన నిప్పులా ఉన్న ఈ పరిణామాలను ఆధారంచేసుకుని అమెరికాకు పూర్వవైభవాన్ని తెచ్చిపెడతాననీ, మళ్లీ పరిశ్రమలను తెరిపిస్తాననీ వాగ్దానం చేస్తూ డొనాల్డ్ ట్రంప్ మొదటిసారి అధికారంలోకి వచ్చారు. రెండోసారి ఆ నినాదాలతోనే ఎన్నికల్లో నెగ్గారు.

ఆసియా ఆర్థిక జైత్రయాత్రను అడ్డుకోవటం ట్రంప్‌కు గానీ అమెరికా పాలకవర్గాలకు గానీ ప్రధాన లక్ష్యంగా మారినా అది సాధ్యమయ్యే పనిగా కనపడటంలేదు. ఇటీవల కాలంలో భారత్‌ను ఎన్నోరకాలుగా హేళనచేస్తూ మాట్లాడినా చివరికి వాణిజ్య ఒప్పందానికి అంగీకరించక తప్పలేదు. ఈ ఒప్పందంలోని విషయాలు ఇంకా పూర్తిగా వెల్లడి కాకపోయినా అది అమెరికాకు అనుకూలంగా ఏకపక్షంగా ఉంటుందని ఏ విధంగానూ అనుకోలేం. ఆర్థికశక్తి.. రాజకీయాలను, ఇతర విధానాలను నిర్ణయిస్తుందని అనుకుంటే భారత్‌ను విస్మరించగలిగే స్థితిలో అమెరికా లేదు. యూరప్ పరిస్థితి కూడా అంతే. భారత్–యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందమే అందుకు నిదర్శనం. ఇక చైనాను నియంత్రించటానికి చేస్తున్న ఏ ప్రయత్నమూ ఇప్పటిదాకా ఫలించలేదు. అందుకే వాణిజ్యసుంకాల వ్యవహారంలో చైనాపై దూకుడును అమెరికా తగ్గించుకుంది. చైనా, భారత్‌లను కాదని వ్యవహారాలను నెగ్గుకురావటం అన్నివిధాలా కష్టంగా మారింది.

యూరప్‌తోనూ, అమెరికాతోనూ వాణిజ్య ఒప్పందాలు కుదిరినంత మాత్రాన భారత్ ముందున్న సవాళ్ల తీవ్రత తగ్గిపోదు. లభించిన ఉపశమనంతో ఉప్పొంగిపోయే పరిస్థితీ లేదు. వస్తు తయారీ, విద్య, ఆరోగ్యం, కృత్రిమ మేధా రంగాల్లో, పర్యావరణ పరిరక్షణలో చైనాతో పోల్చితే భారత్ పురోగతి చక్కగా ఉందని చెప్పుకునే పరిస్థితి లేదు. తయారీరంగాన్నే తీసుకుంటే 2010 నుంచి ఇప్పటి వరకూ జీడీపీలో దాని వాటా 15–16శాతం మధ్యే అటూ ఇటూ తిరుగుతోంది. చైనాలో అది ఇప్పటికీ దీనికి రెట్టింపు ఉంది. విద్య, ఆరోగ్య రంగాల ఖర్చులో ఎదుగుబొదుగు లేకుండానూ.. కొన్ని సందర్భాల్లో తగ్గుదల కూడా కనపడుతోంది. కేంద్ర బడ్జెట్‌లో పాఠశాల విద్యకు 2014–15లో 3.07శాతం కేటాయింపులు ఉంటే అవి 2024–25 నాటికి 1.53శాతానికి పడిపోయాయి. ఉన్నత విద్యారంగంలోనూ (1.06శాతం నుంచి 1శాతం) ఇదే కనపడుతుంది. ఆరోగ్య రంగం కూడా అంతే. 2014లో రెండుశాతం ఉన్న కేటాయింపులు 2026కు వచ్చేటప్పటికీ 1.99శాతం అయ్యాయి. పన్ను వసూళ్లలో కూడా పెద్దగా ప్రగతి కనపడటం లేదు. జీడీపీలో పన్నుల శాతం 10 నుంచి 12 శాతానికి మించటం లేదు. చైనాలో అది 17 నుంచి 19 శాతం దాకా ఉంది. పన్ను వసూళ్లలో ఎదుగుదల లేకపోవటంతో అప్పులూ తగ్గటం లేదు. 2014లో కేంద్రం చేసే ఖర్చులో 30శాతం డబ్బు అప్పుగా తీసుకున్నదే ఉంటే, 2026కు వచ్చేటప్పటికీ 31.7 శాతమైంది.

> **చరిత్రలో ఒకనాటి ఉన్నత స్థానాన్ని అందుకోటానికి అన్ని దేశాలకు అవకాశం రాదు. చైనా, భారత్‌లకు ఈ శతాబ్దంలో అది లభించింది. దురాక్రమణలతో, స్థానిక జాతుల హననంతో, వలస దోపిడీలతో అవి ఒకనాడు ఆ స్థానాన్ని పొందలేదు. పాశ్చాత్య దేశాలు మాత్రం ఆ స్థానాన్ని అలాగే దక్కించుకున్నాయి. పూర్వవైభవం సాధించాలంటే హిందూత్వ ఆధిక్యతను, ఆధిపత్యాన్ని పదేపదే వల్లెవేయటం వల్ల ప్రయోజనం ఉండదు. సుదీర్ఘ చరిత్రలో మనకు బలాలుగా నిలబడ్డ వాటిపైనే ఆధారపడాలి.**

ఏ రంగం తీసుకున్నా 2014 నుంచి ఇప్పటివరకూ ఇదే పరిస్థితి కనపడుతోంది. మౌలిక మార్పులంటూ పెద్దగా కనపడవు. ఆస్తుల కల్పనకు పెట్టే ఖర్చు మాత్రం కేంద్ర బడ్జెట్‌లో పెరుగుతోంది. పన్నెండేళ్ల క్రితం అది 2 లక్షల కోట్లు ఉంటే ఈ ఏడాది బడ్జెట్‌లో దాన్ని 12 లక్షల కోట్లకు పెంచారు. ఈ పెరుగుదలతో కొన్ని మౌలిక సదుపాయాల విస్తరణ, ఆస్తుల కల్పన జరుగుతున్నప్పటికీ అంతర్జాతీయ మార్కెట్‌లో నూటికి నూరుపాళ్లూ భారత్ ఉత్పత్తులివీ అని చెప్పుకొనే పరిస్థితి ఇంకా రాలేదు. అప్పటికే విదేశాల్లో అభివృద్ధై అందుబాటులో ఉన్న శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఉత్పత్తి చేస్తున్న వస్తువులే ఎక్కువ. సొంతంగా శాస్త్ర, సాంకేతిక ఆవిష్కరణలు లేకుండా స్వదేశంలో ఎన్ని వస్తువులను తయారుచేసినా, విడిభాగాల అమరికలో ఎంత నైపుణ్యాన్ని సాధించినా విశ్వగురువు స్థానాన్ని సంపాదించలేం. మొబైల్ ఫోన్ల తయారీలో ప్రపంచంలోనే మనం రెండో స్థానంలో ఉన్నాం. కానీ ఏ ఫోనునీ భారత్ ఆవిష్కరించిన సాంకేతిక పరిజ్ఞానంతో తయారైందని చెప్పుకోలేం.

ప్రపంచ ఆర్థికవ్యవస్థలో 1820 నాటికి ఉన్న అగ్రస్థానాన్ని చైనా తిరిగి సాధించటమే గాక, దాన్నింకా పెంచుకుని విస్తృతపరచుకుంటోంది. భారత్ ఆ దిశగా లక్ష్యాన్ని చేరాలంటే చేయాల్సింది చాలానే ఉంది. ఆ వైభవం అంత తేలికగా రాదు. రాజకీయ చతురతతో పాటు ఆర్థిక ప్రగతి ఫలాలను అందరికీ అందేలా చూడాలి. భిన్నమతాలు, భిన్న భాషలు, భిన్న సంస్కృతులను సమన్వయం చేసుకుంటూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటూ వ్యవహరించటం చాలా సంక్లిష్టతతో కూడినది. చైనాకు ఇన్ని సంక్లిష్టతలు లేవు. ఇంతగా సమన్వయతలను సాధించాల్సిన అవసరమూ లేదు. కేంద్రీకృతపాలన చుట్టూ చైనా చరిత్ర తిరిగింది. భారత చరిత్ర వికేంద్రీకరణ పాలన చుట్టూ తిరిగింది. ఆ వికేంద్రీకరణ వల్లే ఇన్ని భాషలూ, ఆ భాషలాధారిత సంస్కృతీ, సాహిత్యాలూ ఇక్కడ వెలుగొందాయి. దీన్ని గుర్తించకుండా కేంద్రీకృతంగా ఏది రుద్దినా సాధించేది తక్కువ.. నష్టపోయేది ఎక్కువ!

రాష్ట్రాలకు రావాల్సిన నిధులను రాకుండా చేయటం... కేంద్ర పథకాల్లో రాష్ట్రాల వాణిని తగ్గించటం మన చరిత్ర గతికే విరుద్ధం! సెస్సులు, సర్‌చార్జీల పేరుతో నిధులను పెంచుకుంటూ రాష్ట్రాలకు పంచాల్సిన పన్ను ఆదాయాల నుంచి వాటిని మినహాయించటం ఈ ఏడాది నుంచైనా పోతుందని అనుకుంటే అవి మరో అయిదేళ్లు కొనసాగనున్నాయి. 16వ ఆర్థిక సంఘం కూడా కేంద్రం కోరుకున్న విధంగానే ఆ విషయంలో సిఫార్సులు చేసింది. ఆ విధంగా వద్దని రాష్ట్రాలు చేసిన విజ్ఞప్తులను పట్టించుకోలేదు. కేంద్రం వసూలుచేసే ప్రతిరూపాయిలో 11 పైసలు సెస్‌లూ, సర్‌చార్జీల రూపేణా మరో అయిదేళ్లూ కొనసాగుతాయి. కేంద్రం వసూలు చేసే పన్నులో రాష్ట్రాల వాటా 45 నుంచి 50శాతానికి పెంచాలన్న డిమాండునూ పరిగణనలోకి తీసుకోలేదు.

చరిత్రలో ఒకనాటి ఉన్నత స్థానాన్ని అందుకోటానికి అన్ని దేశాలకు అవకాశం రాదు. చైనా, భారత్‌లకు ఈ శతాబ్దంలో అది లభించింది. దురాక్రమణలతో, స్థానిక జాతుల హననంతో, వలస దోపిడీలతో అవి ఒకనాడు ఆ స్థానాన్ని పొందలేదు. పాశ్చాత్య దేశాలు మాత్రం ఆ స్థానాన్ని అలాగే దక్కించుకున్నాయి. పూర్వవైభవం సాధించాలంటే హిందూత్వ ఆధిక్యతను, ఆధిపత్యాన్ని పదేపదే వల్లెవేయటం వల్ల ప్రయోజనం ఉండదు. సుదీర్ఘ చరిత్రలో మనకు బలాలుగా నిలబడ్డ వాటిపైనే ఆధారపడాలి. ఆధునిక ప్రపంచం అందించిన వైజ్ఞానిక దృష్టిని అలవర్చుకోవాలి. సొంత ఆవిష్కరణల్లోనూ ముందుకు వెళ్లాలి.

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

ద్రావిడ సమాజ ఉద్యమం అనివార్యం

మధ్య, దక్షిణ ద్రావిడ భాష కుటుంబానికి చెందిన తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషలు మాట్లాడే నైసర్గిక ప్రాంతమంతా అనేక మౌలిక సంక్షోభాలను ప్రస్తుతం ఎదుర్కొంటోంది. భారత రాజ్యాంగంలోని ఫెడరల్ కూర్పును పూర్తిగా మాయం చేస్తూ 'కేంద్రస్వామ్యం' ఏర్పాటు యత్నాలతో ద్రావిడ రాష్ట్రాల రాజకీయ ఉనికి ప్రశ్నార్థకమవుతోంది. దక్షిణాది కుత్తుకపై వేలాడుతున్న నియోజక వర్గాల పునర్వ్యవస్థీకరణ మరో ప్రమాదం. దేశ సమైక్యత పేరిట ఒకే భాష, తిండి, వేషధారణ ఒత్తిళ్ల వల్ల, మధ్య, దక్షిణ ద్రావిడ భాషలు మాట్లాడే ప్రాంతాల వైవిధ్య జీవనానికి పెను సవాళ్లు ఎదురవుతున్నాయి.

ద్రవిడ భాషలు మాట్లాడే నేలంతా, పర్వతప్రాంతాల మయం. ఇది వైవిధ్య జీవనానికి ఆలవాలం. మలయాళ భాషను పర్వత భాష అని కూడా పిలుస్తారు. ప్రస్తుతం ఈ పర్వత ప్రాంతాలన్నీ నూతన అభివృద్ధి నమూనాతో ప్రాజెక్టులు, గనుల తవ్వక కేంద్రాలుగా రూపొంది నిర్జీవంగా మారే ప్రమాదం పొంచి ఉంది. ఈ నేపథ్యంలో, రానున్న కాలంలో గిరిజన వలసలు అడ్డూ అదుపు లేకుండా పెరిగి, ద్రవిడ కుటుంబంలోని అనేక భాష మాండలికాల, సాంస్కృతిక, సామాజిక జీవనం అంతరించే ప్రమాదం ఉంది. తమిళనాడులో పెరియారు నిర్మించిన అస్తిత్వ ఉద్యమాన్ని అన్నాదురై నుంచి స్టాలిన్ వరకు ఎంతో కొంత కొనసాగించారు. చదువు చక్కానిగా ఎదిగిన కేరళ కూడా, అనేక సాంస్కృతిక, సాంఘిక సంక్షోభాలను ప్రస్తుతం ఎదుర్కొంటోంది. పరాయీకరణకు స్వతంత్ర భారతంలో నమూనాగా మారిన కన్నడ రాష్ట్రంలో స్థానీయ భాషా సంస్కృతుల పరిరక్షణ ప్రమాదకరంగా మారింది. సవర్ణ రాజకీయ ప్రయోగశాలగా మారిన కన్నడ దేశంలో బసవేశ్వరుడు ఎక్కడ, లింగాయత సంస్కృతి ఎక్కడ..! గౌరీ లంకేష్ అమరత్వం జాడలేవి..! దక్షిణాది వైవిధ్య జీవన సంస్కృతి శైలిపై ఏకశిల సాంస్కృతిక దాడి జరుగుతోంది.

ఆత్మగౌరవం స్ఫూర్తితో ఆంధ్ర రాష్ట్రంలో ఏర్పడ్డ ప్రాంతీయ పార్టీలు, 'జీ హుజూర్' వ్యవహారంతో నెట్టుకొస్తున్నాయి. పెరియార్ అస్తిత్వ ఉద్యమ నేపథ్యంలో తమిళ సినిమా చలనశీలతతో ముందడుగు వేస్తే, అక్కడే స్థిరపడిన తెలుగు సినిమా మాత్రం నవ్య భూస్వామ్య, వ్యాపార సినిమాలు నిర్మిస్తూ మార్కెట్ ఫార్ములా కథలతో ఒకనాడు నడిచింది. దక్షిణ భారత రాష్ట్రాలలో చలనశీల సాహితీ సాంస్కృతిక అస్తిత్వ ఉద్యమాలు ఇప్పటికే కొనసాగుతున్నా, మొత్తం ద్రవిడ నేలపై గుత్తాధిపత్యం కోసం ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు, ఈ రాష్ట్రాల సాంస్కృతిక, సాహిత్య సమూహాల మధ్య ఓ అనివార్య మైత్రి తక్షణావసరం. కచ్చితమైన తాత్విక పునాదిపై దక్షిణాత్య సాంస్కృతిక, సాహిత్య ఉద్యమం రూపొందితేనే, నిర్దిష్ట అస్తిత్వ లక్ష్యాల సాధన సమకూరుతుంది. అందుకు 'మీ పాటనై వస్తున్నానమ్మో' అంటూ అగ్రేసర గళాన్ని వినిపించాలి!

● జహా ఆరా
ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక (ప్ర.ర.వే)

("ద్రావిడ సమాజ సాహిత్యాలు (సారూప్యత–ఐక్యత–పోరాటం)" అంశం మీద ఫిబ్రవరి 7–8 తేదీలలో కర్నూలులోని కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్ర.ర.వే. మహాసభలు.)

ఉత్కంఠ రచనలకు మారుపేరు 'మంజరి'

సహృదయుడు, స్నేహశీలి, కథాప్రియుడు, కథానవలా రచయిత మంజరి (గంధం నాగేశ్వరరావు) ఇటీవల అస్తమించారు. ఆయనకు పురస్కారాల వెంపర్లాట లేదు. ధర్మాగ్రహం తప్ప నసుగుడు మాటల్లేవు. నిర్మొహమాటంగా అభిప్రాయం చెప్పడం తప్ప అనుగ్రహం కోసం పాకులాట లేదు. నిర్మాణాత్మక విమర్శ, కథంటే పిచ్చి ప్రేమ తప్ప, సాహిత్యపరంగా కోరుకునేది ఏమీలేదు. పాఠకుని ప్రశంసకు పొంగిపోయే అల్పసంతోషి. తనకు చేతనైన రచనలు చేసుకుంటూ పోతారు. అంతే.

మంజరి తనలోని అసంతృప్తిని అధిగమించడానికి అక్షరాన్ని ఆసరా చేసుకున్నానంటారు. అలాగే 150 పేజీల నవల రాయాలంటే 450 పేజీలు రాస్తానంటారు. సరిచేసుకుని తిరగరాసి గానీ బయటకు వదలరు. మంజరి బహుళ సంఘటనల్ని ఏకధారగా ముడిపెట్టి ఆనక వాటిని జాగ్రత్తగా విప్పడంలో సిద్ధహస్తుడు. ఒక నవల (టార్గెట్ నెంబరు టు) మాసపత్రికలో ప్రచురణ అయిన తర్వాత కన్నడం, సంస్కృతం భాషల్లోకి అనువాదం అయ్యింది. క్రైం నవల (డిటెక్టివ్ నవల కాదు) రాయడం కష్టం. సగటు పాఠకునికి ఎంతమాత్రం పరిచయం లేని, తెలియని ప్రపంచాన్ని చూపించే నవలలెన్నో మంజరి రాశారు. సామాజిక చరిత్రలోని అదృశ్యశక్తుల నడవడికను చూపించే నవలలు రాశారు.



పోలీసుశాఖలో ఉన్నతాధికారిగా పనిచేసిన మంజరికి నేరప్రవృత్తుల అవగాహన, ఆయుధాలు ఉపయోగించడంలోని మెలకువలు ఇంకా నేర పరిశోధనకు సంబంధించిన సాంకేతిక పారిభాషిక పదాలు ఆయనకు తెలుసు. అందుకే ఆయన ఉత్కంఠ కలిగించే, చదివించే గుణంతో రాయగలిగారు. అంతేకాదు మంజరి ఒక పక్క జీవితంలోని కొత్త అంశాల్ని చిత్రించే తాపత్రయంతో కథలు రాశారు. ఆయన కలం సామాజిక అంశాలు, సమకాలీన రాజకీయ సంఘటనలు, మానవ సంబంధాలు, కుటుంబ సంబంధాలు, మానవీయతతో కూడిన కథల్నీ సృజించింది.

ఇప్పటివరకు ఇరవై నవలలు, వందకు పైగా కథలు రాశారు. అనారోగ్యంతో బాధపడుతూ కూడా ఒక నవల రాస్తూ ముగింపు పేజీలో ఉన్నట్టు ఈ మధ్యే చెప్పారు. 1954లో జన్మించిన 'మంజరి' మరణం సాహితీలోకానికి తీరని లోటే. ఆయనకు శ్రద్ధాంజలి.

○ దాట్ల దేవదానం రాజు
కవి, కథకుడు

సంఘటిత పోరాటాన్ని తప్పనిసరి చేస్తున్న లేబర్ కోడ్లు!

మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ల ద్వారా కార్మికులకు మేలు చేస్తుంటే కమ్యూనిస్టులు కార్మికులను రెచ్చగొడుతున్నారని కొందరు బీజేపీ నాయకులు చేస్తున్న ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయి. ఈ లేబర్ కోడ్‌లలోని కార్మిక వ్యతిరేక అంశాలను కమ్యూనిస్టులు మాత్రమే వ్యతిరేకించటం లేదు. కాంగ్రెస్ అనుబంధ ఐఎన్టీయూసీ, తదితర సంఘాలు కూడా వ్యతిరేకిస్తున్నాయి. ఆరెస్సెస్ కార్మిక విభాగం అయిన భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) కూడా ఈ కోడ్లలో రెండింటిని, "కార్మికులకు వ్యతిరేకమూ, యాజమాన్యాలకు అనుకూలమూ" అని వ్యతిరేకించింది. వీటిలో "యూనియన్లను మొత్తంగా తుడిచిపెట్టే అంశాలు వున్నాయి" అని 2025 ఫిబ్రవరి 12న తీర్మానించింది.

వలస పాలన కాలం నాటి కార్మిక చట్టాలను మార్చామని బీజేపీ పాలకులు జబ్బలు చరుచుకుంటున్నారు. కానీ కొత్త లేబర్ కోడ్లలో కూడా తేడా ఏమీ లేదు. పైగా కార్మికుల ట్రేడ్ యూనియన్ హక్కుకు, సమ్మె హక్కుకు మరిన్ని సంకెళ్ళు వేసారు. యాజమాన్యాలపై ప్రభుత్వ పర్యవేక్షణను మరింత బలహీనం చేసారు. గతంలో కొన్ని షెడ్యూల్ పరిశ్రమల్లో మాత్రమే వర్తించే 'కనీస వేతనాలను' ఇప్పుడు కార్మికులందరికీ వర్తింపచేసాం అని కేంద్ర ప్రభుత్వం గొప్పలు పోతోంది. నిజమే. అయితే ప్రస్తుత చట్టం ప్రకారం కూడా కనీస వేతనాలను అనేక యాజమాన్యాలు అమలుచేయటం లేదు. అమలుకు ప్రభుత్వాలూ సరైన చర్యలు తీసుకోవటం లేదు. ఈ కనీస వేతనాల్లో మూల వేతనాన్ని ప్రభుత్వం కనీసం అయిదేళ్లకు ఒకసారి పెంచాలి. ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని పరిశ్రమల్లో 2007, మరికొన్ని పరిశ్రమల్లో 2011 తరువాత నేటికీ వీటిని ప్రభుత్వాలు సవరించలేదు. ఇక ఈ కనీస వేతనాలు నిర్ణయించడానికి సంబంధించి అనేక సమస్యలున్నాయి. ఉదాహరణకు ఈ రోజు ఉద్యోగంలో చేరినవారికీ, రేపు రిటైర్ అయ్యేవారికీ ఒకటే కనీస వేతనం! ఇటువంటి అనేక సమస్యలకు కొత్త లేబర్ కోడ్‌లలో కూడా ఎలాంటి పరిష్కారమూ లేదు.

> **వలస పాలనకాలం నాటి కార్మిక చట్టాలను మార్చామని బీజేపీ పాలకులు జబ్బలు చరుచుకుంటున్నారు. కానీ కొత్త లేబర్ కోడ్లలో కూడా తేడా ఏమీ లేదు. పైగా కార్మికుల ట్రేడ్ యూనియన్ హక్కుకు, సమ్మె హక్కుకు మరిన్ని సంకెళ్ళు వేసారు. ప్రభుత్వ పర్యవేక్షణను మరింత బలహీనం చేసారు.**



ఇక గిగ్, ప్లాట్‌ఫాం తదితర అసంఘటితరంగ కార్మికులకు కొత్త కోడ్‌లలో కల్పించామన్న 'సామాజిక భద్రత' సంగతి కూడా ఇంతే. పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్ చట్టాలు ఇప్పటికే లక్షలాది కార్మికులకు అమలు కావటం లేదు. వీటిలోని వివిధ సీలింగులను కొనసాగించడంవల్ల అవి చాలా శాతం కార్మికులకు వర్తించవు. ఇక ఈ 'సామాజిక భద్రత' గతి ఎలా వుంటుందో ఊహించవచ్చు. ఒక సంవత్సరం పని చేస్తే గ్రాట్యుటీ చెల్లించే విధంగా చట్టాన్ని మార్చామని అంటున్నారు. ఇది కార్మికులందరికీ వర్తించదు. కేవలం 'ఫిక్స్‌డ్ టర్మ్' కార్మికులకు మాత్రమే వర్తిస్తుంది. ఈ గ్రాట్యుటీ చక్కెరపూతతో 'ఫిక్స్‌డ్ టర్మ్' చేదు మాత్రను మింగిస్తున్నారు. నిజానికి చాలా కాలంగానే అనేక యాజమాన్యాలు ఈ పద్ధతిని అమలు చేస్తున్నాయి. ప్రభుత్వ యాజమాన్యంలోని ఏపీఎస్‌ఆర్టీసీలో కూడా దీన్ని అమలు చేసారు. ఇప్పుడు ఈ పద్ధతికి మరింత గట్టి చట్టబద్ధతను కల్పించారు. కార్మికులకు ఎలాంటి ఉద్యోగ భద్రతా లేకుండా చేసే మార్పు ఇది.


కొత్త కోడ్‌లలో 'కోర్' (కీలక) విభాగాల్లో కాంట్రాక్టు కార్మికుల నియామకాన్ని నిషేధించామని అంటున్నారు. ఈ 'కోర్' విభాగాలేమిటో చట్టంలో చెప్పలేదు. వీటిని మళ్ళీ ఆయా ప్రభుత్వాలు నిర్ణయించాలి. కాగా, సంవత్సరమంతా కొనసాగే లోడింగ్, అన్‌లోడింగ్, శానిటేషన్ వగైరా ముఖ్య విభాగాలు 'కోర్' విభాగాలు కాదని లేబర్ కోడ్‌లలో ప్రకటించేసి, ఆ పనుల్లో కాంట్రాక్టు కార్మిక విధానాన్ని చట్టబద్ధం చేసేసారు. వందమందికి పైగా ఉన్న పరిశ్రమలను మూత పెట్టడానికి పాతచట్టం ప్రకారం ప్రభుత్వ అనుమతి కావాలి. ఈ సంఖ్యను 300 చేసారు. దీంతో అత్యధిక శాతం పరిశ్రమల్లో కార్మికులు దీని పరిధిలోకి రారు. యాజమాన్యం పరిశ్రమ మూసివేతకు అనుమతి కోసం దరఖాస్తు చేసిన 90 రోజుల తర్వాత ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోయినా ఇచ్చినట్లే భావించాలని అదే చట్టంలో పేర్కొన్నారు. అనుమతి లేకుండా వేలాది పరిశ్రమలు మూతపెట్టబడి, చట్టం ప్రకారం పరిహారం దక్కక, దశాబ్దాలుగా కోర్టుల చుట్టూ తిరిగే కార్మికుల కథలకు కొదవలేదు. పరిహారం ఇవ్వకుండా కార్మికులను తొలగించడానికి పెద్ద పెద్ద ఐటీ కంపెనీలతో సహా అనేక యాజమాన్యాలు కార్మికులనే రాజీనామాలు చెయ్యాలని ఒత్తిడి చేస్తున్నాయి. బ్యాంకు బకాయిలు తీర్చలేక దివాలా తీసిన పరిశ్రమల్లో కార్మికుల బకాయిల వసూలు అసాధ్యం అయ్యేలా కొత్త దివాలా చట్టాలు, నిబంధనలు తెచ్చారు. పాత, కొత్త కార్మిక చట్టాల్లో కార్మికుల హక్కుల గురించిన వాస్తవ పరిస్థితికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఈ కారణంగానే కార్మిక సంఘాలు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా పోరాడవలసివస్తోంది.

ఎనిమిది గంటల పనిదినం, శ్రమకు తగిన న్యాయమైన వేతనం, భద్రతగల పనిపరిస్థితులు, న్యాయబద్ధమైన సర్వీసు రూల్స్, రిటైర్మెంట్ తర్వాత తగిన కనీస పెన్షన్ వగైరాలు వేటినీ చట్టాలు, నిబంధనలు లోగడ గ్యారంటీ చేయలేదు; రేపూ చేయలేవు. కార్మికుల, ప్రజల ప్రయోజనాలు మాత్రమే లక్ష్యంగా పనిచేసే నిజమైన ప్రజాస్వామిక రాజకీయవ్యవస్థ మాత్రమే వాటిని గ్యారంటీ చేయగలుగుతుంది. అటువంటి వ్యవస్థకోసం రైతాంగం, గ్రామీణ పేదలు, తదితర కోట్లాది శ్రమజీవులతో భుజం భుజం కలిపి పోరాడటం తప్ప కార్మికవర్గానికి మరో ప్రత్యామ్నాయం లేదు.

■ సిహెచ్.ఎస్.ఎన్.మూర్తి
ప్రధాన కార్యదర్శి, ఎఫ్.ఐ.టి.యు



- కళాశాల హాస్టల్లో నగదు వసూళ్లకు ప్రత్యేక పద్ధతి
- శ్రీకాకుళం ఘటనతో అంతర్గతంగా ఏసీబీ విచారణ



- విజయవంతంగా సాగునీటి సంఘాల సదస్సు
- దిశా నిర్దేశం చేసిన సీఎం చంద్రబాబునాయుడు
- వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన అధ్యక్ష, ఉపాధ్యక్షులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు.. ఆకట్టుకున్న స్టాళ్లు



సాగు నీటి సంఘాల సభ్యుల నుంచి అర్జీలు తీసుకుంటున్న సీఎం చంద్రబాబు

రాజధానిలో సాగు సందడి

తుళ్లూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వర్షపు నీటిని ఒడిసిపట్టాలి.. భూగర్భ జలాలను పెంపొందించాలి.. భూమిని ఓ జలాశయంగా మార్చాలి.. 50 శాతం పచ్చదనంతో నింపాలి.. ప్రకృతి సేద్యంతో నాణ్యమైన ఆహారం అందించాలి.. అని సాగునీటి సంఘాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేయగా.. రాష్ట్ర స్థాయిలో సాగు సదస్సు రాజధాని అమరావతిలోని హైకోర్టుకు వెళ్లే మార్గంలోని పరేడ్‌గ్రౌండ్‌లో గురువారం సందడిగా సాగింది. వివిధ జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు తరలిరావడంతో విజయవంతంగా సదస్సు జరిగింది. మధ్యాహ్నం ప్రారంభమైన సద స్సు సాయంత్రం 6 గంటల వరకు జరిగింది. సాంస్కృతి కార్యక్రమాలు, గేయాలు ఆహూతు లను అలరించాయి. భూగర్భ జలాలను అంచ నా వేసే పరికరాలు, వ్యవసాయానికి వినియోగించే డ్రోన్ స్టాళ్లు, సాగు నీటి ప్రాజెక్టుల పనులకు సంబంధించి ఏర్పాటు చేసిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. తొలుత ఆయా జిల్లాలకు కేటాయించిన కౌంటర్లలో పేర్లు నమోదు చేసుకున్న అనంతరం సభ్యులకు అధికారులు ఆకు పచ్చ కండువాలను అందజేశారు. ముఖ్యమంత్రి మధ్యాహం 3.40 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. పోలవరం, హంద్రీనీవా, గాలేరు ప్రాజెక్టుల పనులకు సంబంధించి వీడియోలను వేదిక మీద ఉన్న స్క్రీన్‌పై ప్రదర్శించారు. స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, మంత్రులు కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, పలు జిల్లాల డీసీసీలు ప్రసంగిం చారు. 150 అడుగుల ర్యాంప్‌పై నడుస్తూ సంఘాల సభ్యుల నుంచి ముఖ్యమంత్రి అర్జీలను స్వీకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 60 వేలమంది సాగు నీటి సంఘాల సభ్యుల సైన్యం ఉందని, వారు తలచుకుంటే ఏదైనా సాధించగలరనే నమ్మకం ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు.



సదస్సుకు హాజరైన నీటిసంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు

మెనూలో కోత అధికారుల మేత

- సాంఘిక సంక్షేమశాఖలో వసూళ్లు
- ఒక్కో విద్యార్థికి రూ.25 ఇవ్వాల్సిందే
- నెలకు ఒకసారి హెచ్‌డబ్ల్యూఓ అందజేయాలి

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లో విద్యార్థులకు మెనూ అమలు అంతంతే. అర్థాకలితో అనేక మంది విద్యార్థులు అల్లాడుతుంటారు. తల్లిదండ్రులకు దూరంగా సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులకు మరింత మెరుగ్గా ఆహారం అందించేందుకు కృషి చేయాల్సిన అధికారులు అవినీతికి తెరలేపారు. అధికారులకు మామూళ్లు సమర్పించేందుకు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు(వార్డెన్లు) పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థుల మెనూలో భారీగా కోత విధిస్తున్నట్లు సమాచారం. విద్యార్థుల మెనూలో కోత విధించి అధికారులకు మేతగా వేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో పాఠశాల, కళాశాల స్థాయిల్లోని విద్యార్థినీ విద్యార్థులకు వేర్వేరుగా సాంఘిక సంక్షేమ బీసీ, గిరిజన హాస్టళ్లు ఉన్నాయి. ఆయా వసతిగృహాల్లో మూడో తరగతి నుంచి పది వరకు, ఇంటర్ నుంచి డిగ్రీ, పీజీ వరకు విద్యార్థులు వసతి పొందుతూ చదువుకుంటున్నారు. మెనూ కోసం నెలకు 3 నుంచి ఐదో తరగతి విద్యార్థులకు రూ.1,200, 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.1400, ఇంటర్ నుంచి డిగ్రీ, పీజీ స్థాయి విద్యార్థులకు రూ.1600 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. ఇందులో ఉదయం అల్పాహా రంతో పాటు సాయంత్రం (పాఠశాలలో మ ధ్యాహ్నం భోజనం), సెలవు దినాల్లో భోజనం అందించాలి. విద్యార్థులకు మెనూ ప్రకారం వారంలో ఆరుసార్లు గుడ్లు, మూడు సార్లు చికెన్, వారంలో ఒకసారి స్వీట్, ప్రత్యేక సందర్భాల్లో ప్రత్యేక మెనూ అందజేయాలి. అయితే అనేక హాస్టళ్లలో మెనూ సక్రమంగా అమలు కావడం లేదని ఆరోపణలు ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం ఒక్కో విద్యార్థికి నెలకు రూ.25 చొప్పున లెక్కించి ఉన్నతాధికారులకు ముడుపుల రూపంలో చెల్లించాల్సి రావడమేనని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు వాపోతున్నారు. ఈ కారణంగా కొన్నిసార్లు గుడ్లు, చికెన్, పండ్లు సరిగా పంపిణీ చేయడం లేదు. ఇంకొన్ని సార్లు కూరగాయలు లేకుండానే మెనూ అమలు చేస్తున్నట్లు ఫిర్యాదులు (మిగతా 8లో)



ఇస్తే సరి.. లేకుంటే ఇబ్బందులు

గుంటూరు జిల్లాలోని పాఠశాల, కళాశాల స్థాయి వసతిగృహాల నుంచి నెలకు రూ.1.50 లక్షలకుపైగా వసూలు అవుతున్నట్లు సమాచారం. బాపట్ల జిల్లాలో రూ.లక్ష, పల్నాడు జిల్లాలో రూ.లక్ష వసూలు చేసి ఉన్నతాధికారులకు ఇవ్వాల్సిన బాధ్యత సంబంధిత వార్డెన్లదేనని సమాచారం. ఇందులో ఎక్కడైనా తేడా జరిగితే ఉన్నతాధికారులు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లపై తీవ్రస్థాయిలో వేధింపులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. కొందరు వార్డెన్లు ఉన్నతాధికారులకు అని చెప్పి మెనూలో కోత పెట్టి జేబులు నింపుకున్నట్లు సమాచారం.

క్వాంటంవ్యాలీ శంకుస్థాపనకు భారీ ఏర్పాట్లు

- రేపు ఉద్దండరాయునిపాలెంలో సభ.. హాజరుకానున్న సీఎం
- కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ తమీమ్‌అన్సారియా




క్వాంటం వ్యాలీ భూమి పూజ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోశ్ శ్రీవాస్తవ

మంగళగిరి(గుంటూరు), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో అత్యాధునికమైన క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణానికి శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేయనున్నారు. దేశంలోనే తొట్టతొలి క్వాంటంవ్యాలీ ఉద్దండరాయునిపాలెంలో కొలువుదీరనున్న నేపథ్యంలో శంకుస్థాపన కార్యక్రమానికి అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. క్వాంటంవ్యాలీకి ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం మధ్యాహ్నం భూమిపూజ చేయనున్నారు. అనంతరం రాజధాని రైతులు, విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడనున్నారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంగణంలో భారీ సభ ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. పనులను గురువారం కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోశ్ శ్రీవాస్తవ ఆర్డీఓ కే శ్రీనివాసరావు పరిశీలించారు.

సిలికాన్ వ్యాలీని తలపించేలా..

అమెరికాలోని సిలికాన్‌వ్యాలీని తలపించేలా రాజధానికి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ తలమానికం కానున్నది. ఈ క్వాంటంవ్యాలీ నిర్మాణానికి సీడ్ యాక్సిస్ రోడ్డుకు పక్కనే, సీఆర్డీఏ కారాలయానికి సమీపంలో ఉద్దండరాయునిపాలెంలో 50 ఎకరాలను కేటాయించగా దాదాపు రూ.100 కోట్లతో నిర్మించనున్నారు. ఐబీఎం, టీసీఎస్ వంటి దిగ్గజ సంస్థల సహకారంతో ఏర్పాటు కానున్న ఈ క్వాంటం వ్యాలీ అత్యాధునిక సాంకేతికత, ఆవిష్కరణలకు వేదిక కానున్నది. ఈ ఏడాది మార్చికి ఐబీఎం, 2027 జనవరి నాటికి మూడు క్వాంటం కంప్యూటర్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

8



నేటికీ చెక్కు చెదరకుండా ఉన్న చుక్కలకొండ బురుజు

7, 8న ఘనంగా కొండవీడు ఉత్సవాలు

శతృదుర్భేద్యం.. రాచరికానికి అద్దం

- ప్రతిష్ఠాత్మకంగా ప్రభుత్వం ఏర్పాట్లు
- సాహసికులకు, సందర్శకులకు అద్భుత అవకాశం
- చేద్దామా.. కొండవీడు కోట విహారం

క్లీన్ అండ్ గ్రీన్

సిటీగా గుంటూరు

- 57 డివిజన్లలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు
- స్థాయి సంఘ సమావేశంలో మేయర్ కోవెలమూడి



స్థాయి సంఘ సమావేశంలో ప్రసంగిస్తున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర, హాజరైన కమిషనర్, సభ్యులు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా చేయడమే లక్ష్యమని నగర పాలక సంస్థ మేయర్, స్టాండింగ్ కమిటీ చైర్మన్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. మేయర్ ఛాంబర్‌లో గురువారం స్థాయి సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 57 డివిజన్లలో రోజువారీ ప్రాతిపదికన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు సభ్యులు ఆమోదం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిపాదించిన 11 అంశాలకు సంబంధించిన అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. 57 డివిజన్లలో సిల్ట్, డెబ్రిస్, చెట్లకొమ్మలు, వ్యర్థాలతో పాటు రహదారులపై ఉన్న పోస్టర్లు, బ్యానర్లు తొలగించాలన్నారు. రాత్రిళ్లు పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు కూలీల అవసరం ఉన్నందున ప్రజారోగ్య అధికారుల సిఫార్సు మేరకు తాత్కాలిక పద్ధతిన కార్మికులను తీసుకునేందుకు ఆమోదం తెలిపినట్లు మేయర్ తెలిపారు. ఎన్టీఆర్ స్టేడియం దుకాణ సముదాయంలో ఖాళీగా ఉన్న షాపులకు వేలం నిర్వహించాలని నిర్ణయించామన్నారు. నగర పాలక సంస్థ ఉద్యోగుల పదోన్నతులకు ఆమోదం తెలిపామన్నారు. అభివృద్ధి పనుల నిర్వహణ, మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు ఆమోదించా మన్నారు. ప్రాధాన్య క్రమంలో సీసీరోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణా లకు ఆమోదం తెలిపామన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ కె.మ యూర్ అశోక్, సభ్యులు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, కొమ్మినేని కోటేశ్వరరావు, నూకవరపు బాలాజీ, దాసరి లక్ష్మి దుర్గ, ముప్పవరపు భారతి, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, ఎస్ఈ జి.వెంకటేశ్వర రావు, సీఎంవోహెచ్ డాక్టర్ శాంతికళ తదితరులు పాల్గొన్నారు.

9, 10 తేదీల్లో నీటి సరఫరాకు అంతరాయం

ప్రధాన పైప్‌లైన్ లీకులకు మరమ్మతులు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని తక్కెళ్ళపాడు హెడ్‌వాటర్ వర్క్స్ నుంచి నీటి పంపింగ్ చేసే ప్రధాన లైను లీకులకు మరమ్మతులు కారణంగా సోమ, మంగళవారాల్లో రెండు రోజులు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని కమిషనర్ కె.మయూర్ అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన పైపులైనుకు సీతానగర్ వద్ద లీకు ఏర్పడి తాగునీరు వృథా అవుతున్నది. ఈ క్రమంలో ఆ లీకుకు మరమ్మతులకు నగరపాలక సంస్థ అధికారులు నిర్ణయిం చారు. సోమ, మంగళవారాల్లో పనులు చేసేందుకు ఇంజనీ రింగ్ అధికారులు కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. ఈ క్ర మంలో సోమవారం ఉదయం 6 గంటల నుంచి తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్ ఫిల్టరేషన్ ప్లాంట్ పూర్తిగా నిలిపివేస్తామ న్నారు. ఈ కారణంగా ఆ రెండు రోజులు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని కమిషనర్ తెలిపారు. దీంతో నెహ్రూనగర్, శారదకాలనీ, వసంతరాయపురం, రాజీవ్‌గాంధీనగర్, హనుమయ్యనగర్, స్తంబాలగ రువు, శ్యామలానగర్, గుజ్జనగుండ్ల, కోర్టు కాంపౌండ్, ఏటిఅగ్రహారం, తారకరామ నగర్ రిజర్వాయర్ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. 11వ తేదీ ఉదయం నుంచి యథావిధిగా నీటి సరఫరా జరుగుతుం దన్నారు. ఆ ప్రాంత ప్రజలు అధికారులకు సహకరించి ముందుగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

గుంటూరులో 31 బార్లకు లాటరీ

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బార్లకు రీనోటిఫికేషన్ ద్వారా టెండర్లు ఆహ్వానించగా జిల్లాలో 31 బార్లకు లాటరీ ప్రక్రియ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శ్రీవాస్తవ బార్ల నిర్వాహకులను ఎంపిక చేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న 42 బార్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. కాగా 31 బార్లకు దర ఖాస్తులు వచ్చాయి. కాగా లాటరీ ద్వారా దరఖాస్తు దారులను ఎంపిక చేశారు. జిల్లాలో 11 బార్లకు ఎవరూ దరఖాస్తు చేయలేదు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డీసీ డాక్టర్ కే శ్రీనివాసులు జిల్లా అధికారి అరుణకుమారి, ఏఈఎస్ మారయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.



మద్యం బార్‌లకు లాటరీ తీస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీవాస్తవ



బ్రహ్మోత్సవాల గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్, అధికారులు

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సమీక్షలో ఎమ్మెల్యే నరేంద్ర

పెదకాకాని, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా పెదకాకాని మల్లే శ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరు గైన సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే ధూళి పాళ్ల నరేంద్రకుమార్ అధికారులను ఆదేశించారు. పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులు ఇబ్బంది పడకుండా అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. తొలుత మల్లేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు జరిపించారు. బ్రహ్మోత్సవాల గోడపత్రిక, ఆహ్వానపత్రికలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అంతకముందు అధికారులతో కలిసి పార్కింగ్ ప్రదేశాలు, చెరువు కట్ట రోడ్డు, దేవస్థాన ప్రాంగణాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు.రెడ్డివారి బావి సెంటర్‌లో రూ.60 లక్షలతో ముఖద్వార నిర్మాణానికి ముందుకు వచ్చిన కుంచనపల్లికి చెందిన తెనేటి మహేష్‌రెడ్డి తండ్రి వెంకటేశ్వరరెడ్డిలను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వలివేటి మురళీ కృష్ణ, ఆలయ ఉపకమిషనరు గోగినేని లీలా కుమార్, తహసీల్దారు కృష్ణకాంత్, ఎంపీడీవో శ్రీనివాసరావు, డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ నారాయణస్వామి, కార్యదర్శి ప్రసాదు, అధికారులు పాల్గొన్నారు.

12 జూనియర్ కళాశాలలకు ఆమోదం

- ఉత్తర్వులు జారీచేసిన ఇంటర్ బోర్డు

6

వైసీపీ నేతలపై క్రిమినల్ కేసులు

- 30 పోలీస్ యాక్ట్ ఉల్లంఘనపై 5 కేసులు

8

ప్రోత్సాహంతోనే విద్యార్థుల్లో.. సృజనాత్మక నైపుణ్యాలు వెలుగులోకి

- నేపథ్యగాయకుడు, సంగీత దర్శకులు డాక్టర్ కొమండూరి రామాచారి
- ఉల్లాసంగా ఉత్సాహంగా విజ్ఞాన్స్ మహోత్సవ్



విజ్ఞాన్స్ మహోత్సవ్‌లో మాట్లాడుతున్న డాక్టర్ లావు రత్తయ్య

వివరాలు 8లో

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	147, 156, 167
చికెన్ విత్ స్కిన్(కిలో)	284.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	294.00

ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా కొండవీడు

● సీఎం ఆశయమూ ఇదే
● చిలకలూరిపేటలో 2కె రన్‌లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి
● ఉత్సవాల్లో హెలికాప్టర్ రైడ్, బోటింగ్: కలెక్టర్ కృతికా శుక్లా
● కొండవీడు ఫెస్ట్ జయప్రదం చేయాలని పిలుపు



కొండవీడు ఉత్సవాల ప్రచార స్టిక్కర్లతో ఎమ్మెల్యే ప్రత్తిపాటి, కలెక్టర్ కృతికా శుక్లా, తదితరులు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రెడ్డిరాజుల విజయకేతనం, చారిత్రక వారసత్వ సంపద అయిన కొండవీడు కోటను ప్రపంచ ప్రసిద్ధ పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయమని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం అన్నారు. కొండవీడు ఫెస్ట్ - 2026 ప్రచార కార్యక్రమంలో భాగంగా పట్టణంలో నిర్వహించిన 2కె రన్‌లో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్ బుల్లెట్ మోటార్ సైకిళ్లను నడిపి విద్యార్థులు, యువతలో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం విలేకరులతో ప్రత్తిపాటి మాట్లాడుతూ పర్యాటకుల కోసం కొండపైన, దిగువన ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, పల్నాడు జిల్లా కీర్తిని దశదిశలా చాటేలా ఈ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు కేంద్ర, రాష్ట్ర స్థాయి ప్రముఖులు భారీగా హాజరుకానున్నారని తెలిపారు. 7వ తేదీన జరిగే ప్రారంభ వేడుకలకు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ముఖ్య అతిథులుగా రానున్నారని, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు పాల్గొంటారని వివరించారు. 8వ తేదీన జరిగే ముగింపు వేడుకలకు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మంత్రులు కందుల దుర్గేష్, బీసీ జనార్దన్ రెడ్డి, అనగాని సత్యప్రసాద్, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు తదితరులు విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ సీఆర్డీఏ పరిధిలో కొండవీడు కోట ఒక అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా నిలవబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉత్సవాల్లో పర్యాటకుల కోసం హెలికాప్టర్ రైడ్, బోటింగ్, హార్స్ రైడింగ్, కయాకింగ్, ఫ్లవర్ షో వంటి వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. 2కె రన్ ప్రారంభానికి ముందు ఎమ్మెల్యే, కలెక్టర్, పలువురు ఇతర అధికారులు ఉత్సవాల ప్రచార స్టిక్కర్లు, గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ కృష్ణప్రియ, ఆర్డీఓ మధురిమ, కమిషనర్ పి శ్రీహరిబాబు, మునిసిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ షేక్ కరిముల్లా, పిల్లి కోటి, డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, తెళ్ల సుబ్బారావు, డాక్టర్ కొమ్మినేని వీరంకరరావు, పఠాన్ సమద్ ఖాన్, మునిసిపల్ డీఈ అబ్దుల్ రహీం, మున్సిపల్ కౌన్సిలర్లు, భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

● కొండవీడుపై ప్రత్యేక గీతం

యడ్లపాడు: కొండవీడుకోట చరిత్రపై ప్రత్యేకంగా రూపొందించిన పాటను ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించనున్నారు. యడ్లపాడు నారాయణ ఐఐ గ్రీన్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ చెరుకూరి సృజన సమర్పణలో రూపొందించిన ఈ గీతాన్ని వైజాక్ మోహనరావు రచించగా, ప్రముఖ గాయకుడు పీవీ రమణ గానం చేశారు. కొండవీడు ఉత్సవాల సందర్భంగా గీతాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ గీతానికి అదే పాఠశాలకు చెందిన విద్యార్థినులు నృత్యాభి నయం చేయనున్నారు.

నేటి నుంచి అంతర్జాతీయ నాటక మహోత్సవం

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వెంకటేశ్వర విజ్ఞానమందిరంలో శుక్రవారం నుంచి 10వ తేది వరకు భారత్‌రంగ్ అంతర్జాతీయ నాటక మహోత్సవం నిర్వహిస్తున్నట్లు నాటక వేదిక అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళన సంఘం వేదిక (యడ్లపాడు), నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా-ఢిల్లీ వేదిక (ఎన్ఎస్ఈ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఉత్సవం జరుగుతుందన్నారు.

మిర్చియార్డు సమాచారం

(గురువారం ధరలు)



వచ్చిన బస్తాలు	98,275
అమ్మకాలు	96,075
నిల్వ	24,666

నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	23000
నెంబరు. 5	13500	23500
273	14000	21000
341	14000	26000
4884	----	----
సూపర్ 10	----	---

నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	20500
షార్క్-1	-----	----
బ్యాడిగి	14000	25000
దేవనూరు డీలక్స్	15500	27000
ఆర్మూరు	12500	17500

ఏసీ కామన్ వెరైటీ		
334	13500	21500
నెంబరు. 5	13000	21500
273	----	----
341	14000	23000
4884	----	----
సూపర్ 10	----	----

ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	19000
బ్యాడిగి 355	14000	24500
దేవనూరు డీలక్స్	----	----
తాలుకాయలు	7200	12000

12 కొత్త జూనియర్ కళాశాలలు

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో 12 నూతన జూనియర్ కళాశాల ఏర్పాటుకు ఇంటర్ బోర్డు అవకాశమిచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిర్దేశించిన నిబంధనల ప్రకారం ప్రైవేట్ యాజమాన్యాలు కళాశాలల్ని ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. మండల స్థాయిలో పదో తరగతిలో ఉత్తీర్ణత వివరాలు, పట్టణ ప్రాంతంలో జనాభా ప్రాతిపదికన కళాశాలకు అనుమతి ఇవ్వనున్నట్లు అధికారులు చెప్పారు. గుంటూరు జిల్లాలో మంగళగిరి తాడేపల్లి మున్సిపాలిటీల పరిధిలో నాలుగు, మేడికొండూరు మండల పరిధిలో మూడు, పల్నాడు జిల్లా క్రోసూరులో మూడు, యడ్లపాడులో ఒకటి, బాపట్ల జిల్లా సంతమాగులూరులో ఒక కళాశాల ఏర్పాటుకు అవకాశం ఉందని ప్రకటించారు. ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు కళాశాలలకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు.

షూరిటీ లేకుండా వ్యాపార రుణాలు

తెనాలి అర్బన్: చిరు వ్యాపారులకు షూరిటీ లేకుండా రుణం ఇస్తున్నట్లు తెనాలి డివిజన్ తపాలా శాఖ సూపరింటెండెంట్ కె.విద్యావతి తెలిపారు. ఇండియా పోస్టు పేమెంట్స్ బ్యాంకు, ముత్తూట్ ఫిన్‌కాప్ భాగస్వామ్యంతో సరికొత్త రుణ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. వివరాలకు సమీప పోస్టాఫీసులో సందర్శించాలన్నారు.

ఇదేం పరామర్శ జగన్

● ఏనాడైనా ప్రజా సమస్యలపై స్పందించారా: ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడు పరదాలు కట్టుకొని ప్రజలను కలవకుండా దాక్కున్న పులివెందుల ఎమ్మెల్యే జగన్, ఇప్పుడు అంబటి పరామర్శ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ శ్రేణులను గుంటూరుకు తరలించి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించి జాతర చేయమేమిటని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ప్రశ్నించారు. స్థానిక తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జగన్ రెండేళ్ల కాలంలో ఏ రోజయినా ప్రజల కోసం బయటికి వచ్చారా అంటూ ప్రశ్నించారు. తాడేపల్లి నుంచి గుంటూరుకు కేవలం 35 నిమిషాల సమయం పడుతుందని, అలాంటిది ఆయన సుమారు ఏడు గంటలపాటు యాత్ర చేయడమేమిటని నిలదీశారు. అంబులెన్స్‌లకు కూడా దారి ఇవ్వాలనే ఇంగితజ్ఞానం మరిచి యాత్ర చేశారని అన్నారు. తిరుపతి లడ్డూ తయారీలో కల్తీ విషయాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఇలాంటి జాతరలకు తెరతీశారని ఆరోపించారు.

రాజధానిలో పనులను పరిశీలించిన మంత్రి నారాయణ

మంగళగిరి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాజదానిలో పలు ప్రాజెక్టుల నిర్మాణ పనులను రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ గురువారం పరిశీలించారు. సీడ్ యాక్సిస్ రోడ్డును పాత హైవేకు కలిపే ఉండవల్లి లోని స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనుల పురోగతిని ఆయన పరిశీలించారు. గుంటూరు చానల్‌పై సీడ్ యాక్సిస్ రోడ్డుకు అనుసంధానించే బ్రిడ్జి పనులపై ఆయన ప్రాజెక్టు ఇంజనీర్లతో ఆరా తీశారు. రెండు బ్రిడ్జిల పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులకు ఆదేశించారు. విజయవాడ పశ్చిమ బైపాస్ నిర్మాణ పనులను కూడా మంత్రి నారాయణ పరిశీలించారు. వెస్ట్ బైపాస్‌పై ఒకవైపు వాహనాలకు అనుమతిచ్చిన నేపథ్యంలో పరిస్థితిపై అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. వెస్ట్ బైపాస్ రోడ్డు రెండు వైపులా అనుమతిస్తే గుంటూరు, విశాఖపట్నం నుంచి నేరుగా రాజధానిలోకి వెళ్లే అవకాశం ఉంటుందని మంత్రి నారాయణ తెలిపారు.

సచివాలయానికి మిర్చియార్డు పాలకవర్గం ఫైలు

గుంటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మిర్చియార్డు పాలకవర్గం నియామకానికి సంబంధించిన ఫైలు రాష్ట్ర సచివాలయానికి చేరుకుంది. ముఖ్యమంత్రి కార్యాలయం సూచించిన కమిటీలోని అందరి వద్ద డాక్యుమెంట్లను తెప్పించుకొని ఏఎంసీ అధికారులు ఫైలు తయారు చేసి సెక్రెటేరియట్‌కు పంపారు. అక్కడ క్లియరెన్స్ అయిన తర్వాతనే ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అవుతాయి. ఇందుకు నాలుగైదు రోజుల సమయం పట్టొచ్చని మార్కెటింగ్ వర్గాలు తెలిపాయి. సచివాలయం అధికారులకు శని, ఆదివారాలు సెలవుదినాలు కావడంతో మిర్చియార్డు కమిటీ నియామక జీవో వచ్చే వారం విడుదల కావొచ్చని అధికారులు భావిస్తున్నారు.

స్నేహితురాలిని నమ్మించి మోసం

తెనాలి అర్బన్: స్నేహితురాలిన మోసం చేసిన మహిళపై పోలీసులు కేసు నమోదు చేశారు. సుల్తానాబాద్‌కు చెందిన కనుమూరి కృష్ణవేణి, గుంటూరుకు చెందిన వాసిరెడ్డి ప్రసన్న రాధిక స్నేహితులు. రాధిక కుటుంబ అవసరాల కోసమని కృష్ణవేణి వద్ద బంగారు నగలు, వెండి వస్తువులు, రూ. 23లక్షల నగదు బదులు తీసుకుంది. అయితే వాటిని తిరిగి ఇవ్వకుండా మోసం చేసిందని తెనాలి త్రీటౌన్ పోలీసులకు గురువారం కృష్ణవేణి ఫిర్యాదు చేశారు. రాధికను కోర్టులో హాజరు పర్చగా రిమాండు విధించినట్లు పోలీసులు తెలిపారు. ఆమె ఇదే తరహాలో పలువురిని మోసం చేసిందని పోలీసులు తెలియజేశారు.

గుంటూరు సిటీ వార్తలు

• గుంటూరు తూర్పు • పశ్చిమ


మాట్లాడుతున్న బోనబోయిన, గాదె తదితరులు

లడ్డూ కల్తీ వ్యవహారంలో జగన్ పాత్రపై విచారణ జరపాలి

● జనసేన నాయకుల డిమాండ్

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంలో నాటి సీఎం జగన్‌మోహన్ రెడ్డి సూత్రధారిగా ఉన్నారనే ఆరోపణలపై కూటమి ప్రభుత్వం విచారణ జరిపించాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ కోరారు. అమరావతి రోడ్డులోని జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. లడ్డూ కల్తీ వ్యవహారంలో రూ.233 కోట్లు జగన్‌మోహన్‌రెడ్డికి వెళ్లినట్లు బోనబోయిన ఆరోపించారు. కోట్లాది మంది హిందూ భక్తుల మనోభావాలను దెబ్బతినే విధంగా జరి గిన ఈ లడ్డూ స్కామ్‌లో జగన్ పాత్రపై విచారణ జరిపించాలని బోన బోయిన శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. జనసేన పార్టీ జిల్లా అధ్య క్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తాడేపల్లి నుంచి గుంటూరు రావడానికి తొమ్మిది గంటల సమయం తీసుకున్న జగన్ ఎన్నికల బల ప్రదర్శనకు వచ్చినట్లుందని, పరామర్శకు వ చ్చినట్లు లేదని ఆయన ఎద్దేవా చేశారు. సమావేశంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాయబ్ కమాల్ తదితరులు పాల్గొన్నారు.

లడ్డూలో కల్తీ జరగలేదని చెప్పే ధైర్యం జగన్‌కు ఉందా?

● నిలదీసిన మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పవిత్రమైన తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ జరగలేదని చెప్పే ధైర్యం మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ఉందా? అని జనసేన పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య ప్రశ్నించారు. కృష్ణనగర్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు ఆ పార్టీ నేత అంబటి రాంబాబును బలి పశువును చేశారని రోశయ్య విమర్శించారు. పేరుకు అంబటి జిల్లా వైసీపీ అధ్యక్షుడైనా, ఆ పార్టీని నడిపేది మరొకరని ఆయన ఆరోపించారు. కాపులకు ఆ పార్టీలో సరైన ప్రాధాన్యత లేదని, సత్తెనపల్లిలో అంబటిని వేధించారని తెలిపారు. కాపు సామాజిక వర్గానికి చెందిన తనకు కూడా వైసీపీలో అన్యాయం జరిగిందని కిలారి రోశయ్య ఆరోపించారు. కాపు కార్డు వాడేందుకు వైసీపీకి సిగ్గుండాలన్నారు.

పేటీఎం మూకలతో జగన్ బలప్రదర్శన

● డీసీఎంఎస్ చైర్మన్ హరిబాబు


వడ్రాణం హరిబాబు

గుంటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : గుంటూరులో తనబలాన్ని చూపించాలి అన్నట్లుగా తన పేటియం మూకలతో కేకలు, కేరింతలు కొట్టించుకుంటూ రోడ్ల మీద సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ జగన్ బలప్రదర్శన చేశారని డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు విమర్శించారు. అంబటి ఇంటికి వెళ్లి తెలుగుదేశం ప్రభుత్వం మీద విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్ ఎప్పుడు బూతులు తిట్టే వారిని, స్కాములు చేసే వారిని, స్మగ్లర్లను, అరాచకాలు అవినీతి చేసే వాళ్ళని మాత్రమే ఇష్టపడతారన్నారు. వాళ్ళకే అండగా ఉంటారన్నారు. వాళ్ళ సాయంతోనే జగన్ అడ్డదారుల్లో 2019లో సీఎం అయ్యారన్నారు. మరలా అంబటి, జోగి లాంటి వాళ్ళ సాయంతోనే అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంలో అరాచకాలు, కుల రాజకీయాలు చేసి అధికారంలోకి రావాలని కుట్రలు పన్నుతున్నారన్నారు. రాష్ట్రంలో కాపులు, బీసీలను రెచ్చకొడుతూ జగన్ మాట్లాడుతున్నా రన్నారు. ఇక జగన్ పన్నాగాలు సాగవని, రాష్ట్ర ప్రజలు జగన్‌కు ఇప్పటికే శాశ్వతంగా రాజకీయ సమాధి కట్టారని హరిబాబు తేల్చి చెప్పారు.

ఆరోగ్యానికి హాని కలిగించే ప్యాకేజ్ ఫుడ్‌ను నియంత్రించాలి


కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్‌ను సత్కరిస్తున్న డాక్టర్ ఉమాశంకర్

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లల ఆరోగ్యానికి హాని కలిగించే ఆహార పదా ర్థాల్లో హానికర రసాయనా లను ప్రాసెసింగ్‌లోనే తొల గించే విధంగా ఆహార నాణ్య త ప్రమాణాలు నిర్ధేశించా లని బీజేపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, సెంట్రల్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ మినిస్టర్ చిరాగ్ పాశ్వాన్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో పాశ్వాన్‌ను కలసి వినతిపత్రం అందజే శారు. చిన్న పిల్లల కోసం తయారు చేసే తినుబండా రాల్లో రసాయనాలు లేకుండా, ఆరోగ్యానికి సంబంధించిన పోషక పదా ర్థాలు ఉండేలా తగిన నాణ్యత ప్రమాణాలు అమలు చేయాలని సూచిం చారు. వికసిత్ భారత్ సాధించాలంటే ముందుగా ఆరోగ్య భారత్‌ను సాధించాలని ఆయన తెలిపారు. ఆరోగ్యానికి ముఖ్యమైనది ఆహారమని, ప్యాకేజీ ఫుడ్, హానికరమైన రసాయనాలు వాడే ఆహార పదార్థాలను మార్కెట్‌లోకి రాకుండా నియంత్రించే కీలక బాధ్యత కేంద్ర మంత్రిపై ఉందని మంత్రి చిరాగ్ పాశ్వాన్‌కు డాక్టర్ ఉమాశంకర్ వివరించారు. మంచి ఆహారం అందించే దిశగా మంత్రిత్వ శాఖ ద్వారా చర్యలు తీసుకోవాలన్నారు.



క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

ప్రాంగణ ఎంపికలో ఆర్‌వీఆర్ జేసీ విద్యార్థులకు ఉద్యోగాలు

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగాలు సాధించారని కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 92 మంది విద్యార్థులు రూ.4 లక్షల నుంచి రూ.6.75 లక్షల ప్యాకేజీలతో ఉద్యోగాలు సాధించారని వివరించారు. ప్రముఖ ఐటీ సంస్థ కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్, జన్ సి నెక్స్ట్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో ఉద్యోగాలు సాధించినట్లు వివరించారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్‌డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్‌వీ శ్రీనివాసరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, డాక్టర్ కె.సురేష్‌బాబు తదితరులు అభినందించారు.

7, 8 తేదీల్లో మూట్ కోర్టు పోటీలు

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రింగ్‌రోడ్డులోని జాగర్లమూడి చంద్రమౌళి న్యాయ కళాశాలలో ఈనెల 7, 8 తేదీలలో 5వ జాతీయస్థాయి మూట్ కోర్టు పోటీలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి వేమన కుప్పు స్వామి తెలిపారు. పోటీలకు సంబంధించిన కరపత్రాన్ని ఆయన కళాశాల ఆవరణలో గురువారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ సుధాకర్ బాబుతో కలిసి ఆవిష్కరించారు. జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ పోటీలకు దేశవ్యాప్తంగా 9 రాష్ట్రాల నుంచి 32 కళాశాల జట్లు పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. పోటీలకు న్యాయమూర్తులు, న్యాయవాదులు న్యాయ నిర్ణేతలుగా ఉంటారన్నారు.

విజిలెన్స్ ఏవో బదిలీ

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ గుంటూరు ప్రాంతీయ కార్యాలయంలో పనిచేస్తున్న ఏవో ఆదినారాయణ (వ్యవసాయ అధికారి) బదిలీ అయ్యారు. వ్యవసాయ శాఖకు చెందిన ఏవో ఆదినారాయణ గత ఏడాది డిప్యూటేషన్‌పై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు వచ్చారు. డిప్యూటేషన్ వ్యవధి ముగియటంతో ఆయనను మాతృ శాఖకు పంపించారు.

ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలి

● కమిషనర్ కే మయూర్ అశోక్


సమావేశంలో ప్రసంగిస్తున్న కమిషనర్ కే మయూర్ అశోక్

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ లే అవుట్లలో ఇళ్ల నిర్మాణం పూర్తైన ప్రాంతాల్లో ప్రజలు నివాసానికి ఇబ్బంది లేకుండా మౌలిక వసతుల కల్పనకు జీఎంసీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. లే అవుట్లలో ఇళ్ల నిర్మాణం, వసతుల కల్పనపై గురువారం జీఎంసీ, హౌసింగ్ అధికారులతో సంయుక్త సమావేశం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ లే అవుట్లలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా జరిగేలా జీఎంసీ నోడల్ అధికారులు, హౌసింగ్ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం లే అవుట్ల వారీగా నిర్మాణం అయిన ఇళ్లు, నివాసం ఉంటున్న ఇళ్లు తదితర అంశాలతో సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. అలాగే ప్రజలు నివాసం ఉండే ప్రాంతాల్లో అప్రోచ్ రోడ్లు, తాగునీరు, జంగి ల్ క్లియర్ చేయడానికి అంచనాలు సిద్ధం చేయాలన్నారు. లబ్ధిదారులకు పీఎంఏవై నిధులు అందేలా ఇంటి నిర్మాణ స్థాయిలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ ప్రసాద్, జీఎంసీ ఎస్ఈ వెంకటేశ్వరరావు, నోడల్, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లను రెగ్యులర్ చేసుకోవాలి

నగరంలో అనధికార లే అవుట్ల యజమానులు ఎల్‌ఆర్‌ఎస్ స్కీం ద్వారా రెగ్యులరైజ్ చేసుకోవాలని, గడువు అనంతరం సదరు లే అవుట్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, గుర్తించిన లే అవుట్ల వారికి దరఖాస్తు చేసుకోవాలని తెలియజేయాలని పట్టణ ప్రణాళిక కార్యదర్శులు, అధికారులకు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ స్కీంకు అందిన దరఖాస్తులను పెదపలకలూరు, ఇన్నర్ రింగ్ రోడ్, గోరంట్ల తదితర ప్రాంతాల్లో గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించి, తదుపరి అనుమతులపై పట్టణ ప్రణాళిక అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ వార్డు సచివాలయాల వారీగా అనధికార లే అవుట్స్ ఉండడానికి వీలులేదన్నారు. కార్యదర్శులు ప్రతి లే అవుట్‌ని పరిశీలించి, అనుమతులు లేని వాటికి ప్రభుత్వం ప్రకటించిన ఎల్‌ఆర్‌ఎస్ స్కీం గురించి, వినియోగం వలన ఉపయోగాలు, లేకుంటే కలిగే నష్టాలను వివరించాలన్నారు. పర్యటనలో సీపీ రాంబాబు, డీసీపీ సూరజ్, ఏసీపీ రెహ్మాన్, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పాలకులు ముందుకు రావాలి

● తోట వెంకట్రామయ్య

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ఉద్యోగుల దీర్ఘకాల సమస్యల పరిష్కారానికి పాలకులు ముందుకు రావాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్‌ల ఐక్యవేదిక నాయకుడు తోట వెంకట్రామయ్య కోరారు. స్థానిక శ్యామల నగర్‌లోని సహకార కార్యాలయం ఎదుట ఉద్యోగులు చేపట్టిన నిరసనలు గురువారం నాటికి ఎనిమిదో రోజుకు చేరుకున్నారు. వంట-వార్పు చేసి ఉద్యోగులు తమ నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ జీవో నెం 36ను అమలు చేసి ఉద్యోగులందరికి ప్రొసిడింగ్ ఇచ్చి డీఎల్ఎస్ఎఫ్ ఏర్పాటు చేసి జీతభత్యాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వ రరావు మాట్లాడుతూ ఈ నెల 13న తలపెట్టిన కార్యాలయాల ముట్టడిలో ప్రతి ఒక్క ఉద్యోగి పాల్గొనాలని కోరారు. ఈ నిరసనల్లో తూర్పు గోదావరి జిల్లా నాయకులు కేవీవీ సత్యనారాయణ, సీహెచ్ వెంకటేశ్వరరావు, జీ.రామకృష్ణ, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు నిరుత్సాహం కలిగించిన బడ్జెట్

● మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

గుంటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ రంగానికి ఉత్సాహం, సామాన్యులకు నిరుత్సాహం కలిగించేలా ఉందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షతన కేంద్ర బడ్జెట్‌పై అరండల్‌పేటలోని కార్యాలయంలో గురువారం జరిగిన విశ్లేషణ సభలో విశ్లేషకులు, ఆర్థిక వేత్తలు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ జనాకర్షణల జోలికి పోకుండా ఆచితూచి వేసిన అంచనాలతో రూపొందించిన 2026-27 కేంద్ర బడ్జెట్‌తో కార్పొరేట్ కుబేరులు సంతోషంతో ఉన్నారని, మిగతా అన్ని రంగాల వారు నిరాశకు గురయ్యారని విశ్లేషించారు. సీనియర్ ఆర్థికవేత్త డాక్టర్ అబ్బరాజు రాజశేఖర్ మాట్లాడుతూ ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన కొత్త బడ్జెట్ ఎలాంటి మెరుపులు, ఆశ్చర్యపరిచే ప్రకటనలు లేకుండా సాగిపోయిందన్నారు. హిందూ కళాశాల అర్థశాస్త్ర శాఖాధిపతి డాక్టర్ పి వేణుగోపాల్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ తాత్కాలికంగా ప్రజలను ఆకట్టుకునే హామీలకు బదులు దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం, క్రమ శిక్షణ, అభివృద్ధిపై దృష్టి సారించిందని చెప్పుకోవచ్చన్నారు. ఆడిటర్ కె శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ పన్నుల చెల్లింపులో సరళత్వం, అనవసర కేసులు తగ్గించటం వంటి చర్యలు పెట్టుబడుదారులకి నమ్మకం కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో రాజ్యాంగ చర్చావేదిక కార్యదర్శి అవధానుల హరి, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, జన విజ్ఞాన వేదిక మాజీ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వేణుగోపాలరావు తదితరులున్నారు.

ఘనంగా జనరంజక కవి ప్రతిభా పురస్కారాల ప్రదానం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళా వేదికపై గురువారం రావి రంగారావు సాహిత్య పీఠం ఆధ్వర్యంలో జరిగిన జన రంజక కవి ప్రతిభా పురస్కారాలు 2025 కార్యక్రమం వేడుకగా సాగింది. తొలుత కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు చిటిపోతు మస్తానయ్య ప్రారంభించారు. అనంతరం పద్య ప్రక్రియ 'శతకాలు' పుస్తకానికి ఇళ్ల మురళీధరరావు (విశాఖపట్నం), వచన కవిత సంపుటాలు 'చిగురించే పేజీలు' కవయిత్రి నాగ జ్యోతి శేఖర్ (కోనసీమ)ను, 'పావు కోళ్ళు' కవి రాధేయ (అనంతపురం)ను, 'జస్ట్ ఎ హౌజ్ వైఫ్' కవయిత్రి కుందుర్తి కవిత (సింగపూర్) ప్రతినిధి వెంకట నారాయణకు ఒక్కొక్కరికి మూడు వేల రూపాయలతో పాటు శాలువా, ప్రశంసా పత్రం జ్ఞాపికలతో, పూల మాలలతో పీఠం పక్షాన అతిథులు ఘనంగా సత్కరించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి అధ్యక్షత వహించిన సభలో డాక్టర్ పాపినేని శివశంకర్, అబ్దుల్ రజా హుస్సేన్, ప్రముఖ సాహితీవేత్త సత్యాజీ మాట్లాడారు. పురస్కారాల నేపథ్యం గురించి డాక్టర్ రావి రంగారావు ప్రస్తావిస్తూ పోటీలకు అందిన 91 పుస్తకాలలో నాలుగు పుస్తకాలు ఎంపికైనట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాహిత్య పీఠం డైరెక్టర్లు నర్రా ప్రభావతి, పింగళి భాగ్యలక్ష్మి, గడల శివప్రసాద్, కొల్లూరి నాగేంద్రం, కనకదుర్గ ప్రభృతులు కూడా పాల్గొన్నారు.

రమేష్ మాదిగ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గత ఐదు రోజుల క్రితం కర్నూలు జిల్లా, తుగ్గలి మండలం, బొందిమడుగుల గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు టిఎం రమేష్ మాదిగ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) రాష్ట్ర కన్వీనర్ ఏటుకూరి విజయ్‌కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. రమేష్ మాదిగ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలంటూ గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టరేట్‌లో డీఆర్వో ఖాజావలీకి వినతి పత్రం అందజేశారు. ఈ నిరసనల్లో కారుమూరు బెర్నార్డ్ మాదిగ, సౌపాటి ప్రసాదరావు, కే.వీరబాబు, ధర్మారావు, శ్రీధర్, మీరయ్య, నాగరాజు, భూషణం, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు మిర్చి యార్డు డైరెక్టర్లుగా నియమితులైన మేళం సైదయ్య, షేక్ ఖాదర్ బీ, బత్తుల జాన్ సైదా, దర్శనపు విజయమ్మ, చంద్రగిరిబాబు, కటకంశెట్టి విజయలక్ష్మి తదితరులు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవిని గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకొని, తమ నియామకానికి కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. నూతనంగా నియమితులైన పాలకవర్గ సభ్యులకు ఎమ్మెల్యే మాధవి శుభాకాంక్షలు తెలిపారు. - గుంటూరు.


దండోరా ర్యాలీలో పాల్గొన్న పోతుల బాలకోటయ్య, నసీర్ అహ్మద్ తదితరులు

డ్రగ్స్‌పై సామాజిక దండోరా మోగిద్దాం

● సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలలో భాగంగా ఏపీని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చేసేందుకు సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో సామాజిక దండోరా యాత్రలు నిర్వహిస్తున్నట్లు సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య స్పష్టం చేశారు. నగరంలో గురువారం కలెక్టరేట్ వద్ద వసతి గృహ విద్యార్థులతో ఏర్పాటు చేసిన దండోరా ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకోటయ్య మాట్లాడుతూ డ్రగ్స్‌తో రాష్ట్రంలో 48.3 శాతం ఆత్మహత్యలు నమోదవుతున్నాయన్నారు. దొంగతనాలు, హింసకు గంజాయి వంటి పదార్థాలు కారణమవుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సామాజిక దండోరా నిర్వహించి, యువతను చైతన్యపరుస్తామని చెప్పారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమంలో సాంఘీక సంక్షేమ విద్యార్థులు పాల్గొనటం హర్షణీయమన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం కలెక్టరేట్ నుంచి నగరంపాలెం, గుర్రం జాషువా విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ఎఎస్‌డబ్ల్యూవో కల్పన, వార్డెన్లు రామారావు, రమాదేవి, సీతామహాలక్ష్మి, శ్రీదేవి, సామాజిక ఉద్యమకారులు వేములపల్లి విఠల్ తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి మరింత చొరవ చూపాలి

● ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన


కమిషనర్ మయూర్ అశోక్‌కు అభినందనలు తెలియజేస్తున్న కేసన శంకరరావు, నాగమల్లేశ్వరరావు

గుంటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన మయూర్ అశోక్ నగరాభివృద్ధికి మరింత చొరవ చూపాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్‌ను కేసన శంకరరావు, ఆ సంఘం నాయకుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావులు గురువారం చాంబర్‌లో కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. రాజధాని జిల్లా కేంద్రం గుంటూరులో సరికొత్త ప్రణాళికలతో అభివృద్ధి చేయాలని, నగరాభివృద్ధిలో తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

అలరించిన భక్తి సంగీత విభావరి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లచెరువు, కోదండ రామాలయంలో స్వరరాగ సుధా ఆధ్వర్యంలో జరిగిన భక్తి సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకులు కేవీ సాయిబాబా శర్మ, పీఎల్ నరసింహారావు పలు భక్తి గీతాలు శ్రావ్యంగా ఆలపించారు. కీ బోర్డుపై రామకృష్ణ, తబలపై షణ్ముఖశర్మ వాయిద్య సహకారం అందించారు. అనంతరం కళాకారులను ఆలయ కమిటీ నిర్వాహకులు పుల్లారావు ఘనంగా సత్కరించారు.

నివాసాల మధ్య బార్ వద్దని స్థానికుల ధర్నా

గుంటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఇళ్లు, విద్యాసంస్థల నడుమ బార్ ఎలా పెడతారని పలకలూరు రోడ్డు వాసులు ప్రశ్నిస్తున్నారు. కృష్ణబాబు కాలనీ, కళ్యాణి నగర్, సాయిబాబా కాలనీ తదితర ప్రాంతాలకు చెందిన మహిళలు స్థానికులు పెద్ద సంఖ్యలో కృష్ణ బాబు కాలనీ వద్ద నడిరోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పట్టాభిపురం సిఐ గంగా వెంకటేశ్వర్లు సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో చర్చించారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి బార్ ఏర్పాటు చేయకుండా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో 39వ డివిజన్ తెలుగుదేశం పార్టీ కార్యదర్శి నాగరాజు తో పాటు పెద్ద సంఖ్యలో స్థానికులు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రిక్షా తిరగబడి వ్యక్తి మృతి

గుంటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నల్లచెరువు నాలుగో లైన్ కు చెందిన కొలగాని గురవయ్య (65) రిక్షా తిరగబడడంతో జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. గురవయ్య పట్నం బజార్లో తన బల్ల రిక్షా పై పురుగుల మందులు షాపుల్లో కూలీగా పనిచేస్తుంటాడు. ఈ నెల 2న రాత్రి సుమారు పదిన్నర గంటల సమయంలో తన రిక్షాపై పురుగుమందు డబ్బాల పార్సిల్ తీసుకువెళుతుండగా కుక్క అడ్డు వచ్చి రిక్షా తిరగబడింది. ఈ ప్రమాదంలో గాయపడిన గురవయ్యను వెంటనే చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురవయ్య గురువారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు రామకోటేశ్వరరావు వచ్చిన ఫిర్యాదు మేరకు లాలాపేట ఎస్సై రోజా లత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో ఈతకు దిగి ఫార్మా కంపెనీ మేనేజర్ మృతి

గుంటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంగళాయపాలెం వద్ద కాలువలో ఈతకు దిగి ఫార్మా కంపెనీ మేనేజర్ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు నగరంపాలెంలోని మస్తాన్ దర్గా వెనుక ప్రాంతంలో నివాసం ఉండే ఆకుల సాయికుమార్ (37) ఓ ఫార్మా కంపెనీలో మేనేజర్ గా పనిచేస్తుంటాడు. ఈ నెల 4న ఉద్యోగ నిర్వహణ నిమిత్తం ఒంగోలు వెళ్లి ఇంటికి వస్తూ మార్గమధ్యలో తన స్నేహితులైన లోకేష్, నవీన్, శ్రీకాంత్‌లతో కలిసి వెంగళాయపాలెం సమీపంలోని కైలాసగిరి వద్ద కాలువలో ఈతకు దిగారు. నీరు ఉధృతంగా ఉండడంతో ఈత రాకపోవడంతో సాయికుమార్ నీట మునిగిపోయాడు. భార్య స్వరూపరాణి గురువారం నల్లపాడు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

మనస్పర్ధలతో భర్త అదృశ్యం

భార్య భర్తల మధ్య ఫలితం మనస్పర్ధలు కారణంగా భర్త అదృశమయ్యాడు. లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీ నగర్ కి చెందిన అబ్దుల్ బాషిత్‌కు, భార్య రిజ్వానాతో మనస్పర్థలు ఉన్నాయి. దీంతో ఈ నెల ఐదున అబ్దుల్ బాసిత్ ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న పిల్లి మాణిక్యరావు, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

మదమెక్కి మాట్లాడుతున్న జగన్‌రెడ్డి

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు

గుంటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అంబటి, జోగి కామంతో కళ్ళు నెత్తికెక్కి మాట్లాడుతుంటే.. అధికార దాహంతో మదమెక్కి జగన్ రెడ్డి మాట్లాడుతున్నాడని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్యరావు మాట్లాడుతూ గుంటూరు జగన్ ఓదార్పు యాత్ర నిరుత్సాహంగా జరిగిందని, ఒక్క శవం కూడా అయనకు దొరకలేద ని, అందుకనే ఆలస్యంగా పర్యటన జరిగిందని ఎద్దేవా చేశారు. అంబటి కుటుంబాన్ని పరామర్శించడానికి జగన్ రెడ్డి ర్యాలీ పెట్టడమే సిగ్గుమాలిన చర్యగా ఆయన అభివర్ణించారు. అంబటి మాటల్లో తప్పులేదని, అంబటి మాట్లాడిన బూతులను జగన్ రెడ్డి సమర్థించడం అంతకంటే సిగ్గుమాలిన చర్యని అన్నారు. అంబటిపై ఇంకా కఠినమైన సెక్షన్లు పెట్టాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ జగన్ రెడ్డి పరామర్శ యాత్ర పేరుతో జాతర మాదిరిగా మంది మార్బలంతో వచ్చి హడావిడి సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశాడన్నారు. నాడు జగన్ పర్యటనలో మృతి చెందిన సింగయ్య కుటుంబాన్ని మాత్రం పరామర్శించలేదుగానీ, రాజకీయంగా పబ్బం గడుపుకోవడానికి అంబటి ఇంటికి జాతర చేస్తూ వెళ్లారన్నారు. సమావేశంలో కంచర్ల శివరామయ్య, కల్లూరి శ్రీనివాసరావు, రాచకొండ నాగేశ్వరరావు, ఇమ్మడి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

దిగజారుడు రాజకీయానికి కేరాఫ్ అంబటి

● డాక్టర్ కత్తెర సురేష్ కుమార్


డాక్టర్ కత్తెర సురేష్ కుమార్

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : దిగజారుడు రాజకీయానికి కేరాఫ్ అంబటి రాంబాబు అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్య దర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ అన్నారు. రాజకీ యాలలో నైతిక విలువలు దిగజార్చిన అంబటి రాంబాబును వెనకేసుకొచ్చిన వైసీపీ నాయకులు సమాజానికి ఏమి చెబుతున్నారని ప్రశ్నించారు. ఆయన గురువారం మాట్లాడుతూ అసభ్యకర వ్యాఖ్య లు చేసిన అంబటి రాంబాబును సమర్థిస్తూ ఆ పార్టీ నాయకులు, అధినాయకుడు చేసిన ప్రకటనలు ఆశ్చ ర్యాన్ని కలిగిస్తున్నాయన్నారు. తప్పు చేసిన వాడిని వెనకేసుకురావటమే కాకుండా ప్రజలను తప్పుతోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఇటువంటి నాయకుల వలన సమాజంలో రాజకీయాలంటే చుల కన భావన కలుగుతుందని అన్నారు. అంబటి రాంబాబు ఇంటి వద్దకు నిరసన తెలియజేయడానికి తెలుగుదేశం శ్రేణులు వెళ్లాయని, అయితే అక్కడ రాంబాబు డౌన్ డౌన్, రాంబాబు క్షమాపణ చెప్పాలని నినాదాలు చేశారని చెప్పారు. అయితే కొందరు రాంబాబు వ్యాఖ్యలకు ఆవేశపడ్డారని దానికి రకరకాల రంగులు పులిమి శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా మహిళల చేత ప్రెస్‌మీట్‌లు పెట్టించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. తప్పు చేసిన వాడు శిక్షకు అర్హుడే కదా అని కత్తెర సురేష్ అన్నారు. రాజకీయాల్లో విలువ లు ముఖ్యమని ఆయన సూచించారు.

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 6, 7, 8, 9, 10వ తరగతులలో ఉన్న ఖాళీలకు అర్హులైన బాలురు, బాలికలందరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 19 లోగా దరఖాస్తులు ఆన్‌లైన్లో పంపాలని సూచించారు. ఇతర వివరాలకు ప్రిన్సిపాల్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాల (బాలురు), అడవి తక్కెళ్ళపాడు, గుంటూరు (9490729129)లో సంప్రదించాలని సూచించారు.

● సాహసీకులకు, సందర్శకులకు అద్భుత అవకాశం
● చేద్దామా.. కొండవీడు కోట విహారం
● ఉత్సవానికి ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం ఏర్పాట్లు



శత్రుదుర్భేద్యం.. రాచరికానికి అద్దం

కొండవీడు ఉత్సవాలు.. ప్రత్యేక కథనం

శత్రుదుర్భేద్యం.. భిన్న పరిపాలనకు దర్పణం కొండవీడు. తెలుగు సాహితీ సాంస్కృతిక ప్రాభవానికి, రాజుల పౌరుషానికి, ఆధ్యాత్మిక చింతనకు ప్రసిద్ధి. ఎత్తయిన కొండలు, ఉషోదయ మంచు తెరలు, పరిమళ పూల మొక్కలు.. పరుచుకున్న పచ్చదనం.. పాములా మెలికలు తిరిగిన ఘాట్ రోడ్డు.. ఇలా ప్రకృతి ప్రేమికులకు స్వర్గధామం. కొండవీడు కోట చరిత్ర, ప్రాశస్త్యం భావితరాలకు తెలిసేలా ఈ శని, ఆదివారాల్లో అత్యంత వైభవంగా కొండవీడు ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహించనుంది.

యడ్లపాడు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సుమారు 1,231 హెక్టార్ల అటవీ విస్తీర్ణం కలిగి యడ్లపాడు, ఫిరంగిపురం మండలాల పరిధిలో కొండవీడు విస్తరించి ఉంది. 2018లో కోటలో బయల్పడిన అవశేషాల ఆధారంగా క్రీ.శ 2, 3 శతాబ్దాల్లో బౌద్ధులు ఇక్కడ ఆవాసం ఉన్నట్లు తెలుస్తోంది. 14వ శతాబ్దం వరకు కొండవీడు గురించి సాహిత్య, శాసనాల్లో ఎక్కడా ప్రస్తావించలేదు. కాకతీయుల సామ్రాజ్యం ముగిశాక 1325లో అద్దంకిని రాజధానిగా చేసుకుని రెడ్డి రాజుల్లో ప్రథముడైన ప్రోలయ వేమారెడ్డి స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు. శత్రుమూకలు దాడులతో.. కొండవీడును రెండో రాజధానిగా చేసుకుని పాలన సాగించాడు. ఆయన కుమారుడు అనపోతారెడ్డి రాజధానిని అద్దంకి నుంచి కొండవీడుకు మార్చాడు. అనపోతారెడ్డి తమ్ముడు అనవేమారెడ్డి విశాఖ వరకు రాజ్యవిస్తరణ గావించాడు. 1402 నుంచి 1420 వరకు పాలించిన అనవేమారెడ్డి కుమారుడు పెదకోమటి వేమారెడ్డి పరిపాలనా కాలంలో సాహిత్యానికి, కళలకు స్వర్ణయుగం అని చెప్పవచ్చు. శ్రీనాథ కవి ఈయన ఆస్థానంలో విద్యాధికారిగా పని చేశారు. చివరి వాడైన రాచ వేమారెడ్డి 1420-1424 వరకు పాలన సాగించాడు. అసమర్థుడు కావడంతో రెడ్డిరాజుల పతనం అంతమైంది. అనంతరం ఒడిశా గజపతులు, విజయనగర రాజులు, కుతుబ్ షాహీలు, ఫ్రెంచివారు, చివరగా ఇంగ్లీషువారు ఆక్రమించారు.

సందర్శించాల్సిన ప్రదేశాలు


గిరి దుర్గం చుట్టూ ఉన్న ప్రాకారం ప్రధాన ఆకర్షణ. ప్రతి కొండ శిఖరం నుంచి మరో కొండ శిఖరాన్ని తాకుతూ మధ్యలో 24 బురుజులతో.. 20 కిలో మీటర్ల ప్రాకారం నిర్మించారు. (ప్రస్తుతం చాలా వరకు శిథిలమైంది), శత్రువులు చొరబడకుండా రెండు కొండల నడుమ(కొత్తపాలెం వైపు)నిర్మించిన 50 అడుగుల మట్టికట్ట, కొండ దిగువన (కోట గ్రామం వైపు) తవ్విన భారీ కందకం, ప్రాకారం మధ్యన నిర్మించిన పలు అద్భుత కట్టడాలు ఆనాటి నిర్మాణ శైలిని, రక్షణ వ్యూహాన్ని తెలియజేస్తాయి. తారాబురుజు, మహాద్వారం, జెట్టి బురుజు, నెమళ్ల బురుజు, సజ్జామహల్, మిరియాల చట్టు బురుజు, కొండలపైన రాజ మందిరాలు, ధాన్యాగారం, వజ్రాగారం, కారాగారం, అశ్వ, గజ శాలలు, నేతికొట్టు, తీర్పుల మందిరం, గొలుసుకట్టు చెరువులు వీక్షించదగినవి. కొండలపైన బొల్లుమోర వెంకటేశ్వరస్వామి ఆలయం, కొండ దిగువన కోట గ్రామంలోని కత్తుల బావి, చెంఘీజ్‌ఖాన్‌పేటలోని వెన్నముద్దల బాలకృష్ణుడు, అమీనాబాద్‌లోని మూలాంకురేశ్వరి, కొత్తపాలెంలోని వీరభద్రస్వామి ఆలయాలు, ఇస్కాన్ రాధాకృష్ణ మందిరం సందర్శకులను ఆధ్యాత్మిక చింతనకు గురిచేస్తాయి.

కొండవీడుకు పూర్వ వైభవం..

కొండవీడును ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు 2007లో ఘాట్‌రోడ్డు నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 2014లో టీడీపీ ప్రభుత్వం వచ్చేంత వరకు ఈ ప్రాంతం నిర్లక్ష్యానికి గురైంది. 2015లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చొరవ తీసుకుని రూ.31 కోట్లతో 5.1 కిలోమీటర్ల ఘాట్‌రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. కోట గ్రామం నుంచి కొండలపైకి మెట్ల మార్గాన్ని రూ.1.5 కోట్లతో, కొండపైన లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని రూ.60 లక్షలతో పునర్నిర్మించారు. గొలుసుకట్టు ముత్యాలమ్మ, పుట్టాలమ్మ, వెదుళ్ల చెరువులకు మరమ్మతులు చేపట్టారు. కొండవీడు ఘాట్ రోడ్డును కలుపుతూ బోయపాలెం, ఫిరంగిపురం రోడ్లను ఏర్పాటు చేశారు. కొండపైన పురాతన కట్టడాల పునరుద్ధరణ, మ్యూజియం, రిసార్ట్స్, చిల్డ్రన్ పార్కుతోపాటు పర్యాటకులను ఆకర్షించేలా అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. 2019లో టీడీపీ అధికారం కోల్పోవడంతో ప్రణాళికలు పట్టాలెక్కలేదు.

అద్భుత శిల్ప సంపద

కొండవీడు శిల్ప సంపదకు నెలవు. రెడ్డిరాజులు నిర్మించిన గోపినాథ స్వామి ఆలయం(దీనినే కత్తులబావి, చీకటి కోనేరు)ఎంతో కళాత్మకంగా తీర్చిదిద్దారు. వెన్నముద్దల బాలకృష్ణుడి విగ్రహం తొలిసారి ప్రతిష్ఠించింది ఈ ఆలయంలోనే. కొండల పరిసర గ్రామాల్లోని పొలాల్లో ఎన్నో దేవతా, నంది విగ్రహాలు వెలుగు చూశాయి. నేటికీ చారిత్రక ఆనవాళ్లు లభిస్తూనే ఉన్నాయి.



అంగరంగ వైభవంగా ఉత్సవాలు

కొండవీడు కోటను ప్రపంచ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషిచేస్తోంది. ఈ ప్రాంత ప్రాశస్త్యం ప్రపంచానికి తెలిపేలా ఈ నెల 7, 8 తేదీల్లో కొండవీడు ఉత్సవాలు-2026ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టింది. దీనిలో భాగంగా రెండు రోజుల పాటు పలు సాహస, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. శనివారం ఉదయం యోగా అనంతరం 10 గంటలకు ఉత్సవాలు ప్రారంభవుతాయి. హెలీరైడ్, రాక్ క్లైంబింగ్, హార్స్ రైడింగ్, బోటింగ్ వంటి సాహస కృత్యాలతోపాటు, మినీ ఫ్లవర్ షో, శాండ్ ఆర్ట్, ఫైర్ క్రాకర్ షోలు ప్రధాన అకర్షణగా నిలవనున్నాయి. చిన్నారుల కోసం నృత్య, క్రీడా పోటీలు, ఫుడ్ కోర్టులు నిర్వహించనున్నారు. ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, జిల్లా అధికార యంత్రాంగం నిమగ్నమైంది.

ఆశాజనకంగా ఉల్లికాడల సాగు

బాపట్ల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బాపట్ల ప్రాంతంలో ఉల్లికాడల సాగు ఆశాజనకంగా ఉంది. ఆశించిన దిగుబడితోపాటు గణనీయమైన ఆదాయం కూడా రైతులు గడిస్తున్నారు. మంచి రుచితోపాటు ఆరోగ్య ప్రక్రియలో ఉల్లికాడలు ఎంతో ఉపయోగం. వివిధ రకాల వంటకాల్లో వీటి ప్రాధాన్యం పెరుగుతోంది. ధర కూడా అంతే స్థాయిలో ఉంటోంది. నేరుగా రైతు నుంచి 6 ఉల్లికాడల కట్ట రూ.15కు కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌కు వచ్చేసరికి ధర రెట్టింపవుతోంది. అద్భుత ఔషధ గుణాలున్న ఉల్లికాడ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.

ప్రతి వంటలో ఉల్లి తప్పనిసరిగా ఉంటుంది. ఉల్లితోపాటు వాటి కాడల వల్ల కూడా ఎన్నో ఉపయోగాలున్నాయి. ఉల్లికాడలలో అనేక విటమిన్లతోపాటు రోగనిరోధక శక్తిని పెంచే లక్షణాలున్నాయి. ఫైబర్, ఏబీసీ విటమిన్‌లు, పోటాషియం, ఐరన్, మెగ్నీషియం వంటి లక్షణాలు అధికంగా ఉంటాయి. ఉల్లికాడలు సలాడ్స్, సూప్‌లలో కాకుండా కూరగా వండినా రుచిగానే ఉంటుంది. శరీరానికి సూక్ష్మపోషకాలను అందిస్తుంది. మధుమేహంతో బాధపడే వారికి ఉల్లికాడలు మంచి ఔషధంగా పనిచేస్తాయని చెబుతున్నారు. ఉల్లిపొరలోని సల్ఫర్ రక్త పీడనాన్ని తగ్గించి ఇన్సూలెన్ ఉత్పత్తి పెంచి రక్తంలో చక్కెర నిల్వలు పెరగకుండా చేస్తుంది. క్యాన్సర్ కణాలను ఉత్పత్తి చేసే ఎంజైంల విడుదలను నిలిపివేస్తుంది. ఎముకలను ధృడంగా మారుస్తాయి. జలుబు, దగ్గును నివారించడమేకాకుండా కంటి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. జీర్ణ వ్యవస్థ సజావుగా ఉండేలా చేస్తుంది. వీటిని స్ప్రింగ్ అనియన్స్ లేదా ఉల్లి ఆకు అని కూడా పిలుస్తారు. ఇన్ని ఉపయోగాలున్న ఉల్లికాడల సాగును బాపట్లప్రాంతంలో పలుచోట్ల చేపట్టారు.


మచ్చావారిపాలెంలో ఉల్లికాడల సాగు చేసిన పొలం

దిగుబడి బాగుంది



ఉల్లికాడల సాగు బాగుంది. ఆశించిన దిగుబడులతోపాటు ధర కూడా లభిస్తోంది. మచ్చావారిపాలెం, మరుప్రోలువారిపాలెం, దరివాద కొత్తపాలెం, ఆసోదివారిపాలెం పరిసరప్రాంతాల్లో సాగు చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే రైతులు సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

- మున్నం బుజ్జిరెడ్డి, రైతు, మచ్చావారిపాలెం

మురుగు సమస్యకు చెక్..!

● పుర కాలువలకు మ్యాపింగ్
● ప్రతి రోజూ చెత్త తొలగింపునకు చర్యలు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మురుగు కాలువల్లో చెత్తాచెదారం నిండి నీరు ముందుకు కదలక దుర్వాసన వెదజల్లుతుంటాయి. దాంతో పలు పాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అయితే ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పురపాలక సంఘాల్లోని కాలువలను మ్యాపింగ్ చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఈ విధానం ద్వారా ప్రతి రోజూ కాలువల్లో చెత్తను తొలగించటంతో పాటు వాటి ఫోటోలను పట్టణ అభివృద్ధిశాఖ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే దీనికి సంబంధించి విధి విధానాలు మునిసిపాలిటీలకు చేరాయి. కాలువలు మొత్తం ఎన్ని కిలోమీటర్లు ఉన్నాయి, ఇందులో ఎంత మేరకు చెత్త వస్తుంది, పెద్ద కాలువలెన్ని, మధ్య, చిన్న కాలువలెన్ని, వాటి పని తీరు ఏ విధంగా ఉంది, కాలువల నిర్వాహణ, నాణ్యంగా ఉందా, లేదా అనే నివేదిక ఇవ్వాలని రాష్ట్ర పట్టణాభివృద్ధి సంస్థ పురపాలక సంఘాలను కోరింది. ఈ మేరకు మునిసిపాలిటీలు చర్యలు చేపడుతున్నాయి. ఇక నుంచి ప్రతి మురుగు కాలువను మ్యాపింగ్ చేసి నిర్దిష్ట షెడ్యూల్ ప్రకారం శుభ్రం చేయటానికి పురపాలక సంఘాలు చర్యలు ప్రారంభించాయి.

కాలువలను విభజించి మ్యాపింగ్

కాలువలను పెద్ద, మధ్య, చిన్న తరహాగా విభజించి మ్యాపింగ్ చేస్తారు. చిన్న కాలువలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఇందులో చెత్తను బయటకు తీసి మురుగు నీరు సులభంగా వెళ్ళటానికి మార్గం కల్పిస్తారు. మధ్యంతర కాలువల్లో చెత్తను తీయటంతో పాటు పెద్ద కాలువల్లో నీరు మరలించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. దీన్ని నిరంతరం పారిశుధ్య కార్మికులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షిస్తారు. పెద్ద కాలువలను ప్రతి మూడు రోజులకోసారి పరిశీలించడంతో పాటు అందులో చెత్తను ఎత్తి వేసి శుభ్రం చేయాలి. ఇలా మూడు రకాల కాలువల్లో పనులు చేపడుతూ ఎప్పటికప్పుడూ వాటిని మ్యాపింగ్ చేయాల్సి ఉంటుంది. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఈ పనులు చేపట్టడానికి పట్టణాభివృద్ధిశాఖ తగు ఆదేశాలు జారీ చేసింది. ఇందు కోసం సమగ్ర స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్‌ను అమలు చేయాలని సూచించింది. తద్వారా దీర్ఘకాలిక నీటి ముంపు సమస్యలు, వరద ప్రమాదాలను తగ్గించటం, పారిశుధ్య ప్రమాణాలు మెరుగు పరచటంతో పాటు కార్మికుల భద్రతను లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం కాలువల నిర్వాహణ బాధ్యత అంతా కమిషనర్లే చూసుకోవాలి. యంత్రాల వినియోగం, కార్మికుల భద్రత తప్పనిసరిగా పాటించాలి.


పట్టణంలోని మురుగు కాలువ

కసరత్తు ప్రారంభించాం

కాలువల నిర్వాహణ మ్యాపింగ్‌పై ప్రభుత్వం నుంచి ఉత్తర్వులొచ్చాయి. దీనిపై కసరత్తు ప్రారంభించాం. మునిసిపాలిటీలో కాలువల పరిధి ఎంతవరకు ఉందో వివరాలు సేకరించాం. వీటిని మూడు రకాలుగా విడదీసి మ్యాంపింగ్ చేస్తాం. ఈ ప్రక్రియ ప్రారంభమైతే పారిశుధ్యం మరింత మెరుగు పడుతుంది. **- ఎన్ ఆనంద్ కుమార్, మునిసిపల్ కమిషనర్, సత్తెనపల్లి**

మెనూలో కోత.. అధికారుల మేత

(5వ పేజీ తరువాయి)

వస్తున్నాయి. విద్యార్థుల సంఖ్యను ఆధారం చేసుకుని నగదు వసూలు చేసే బాధ్యతను నెలకు ఒక హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌కు అప్పగిస్తున్నారు. ఇక కళాశాల స్థాయి హాస్టళ్లలో వసూళ్ల పర్వం భిన్నంగా ఉంది. జిల్లా కేంద్రంలో అయితే ఒక్కో హాస్టల్ నుంచి నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు, నియోజకవర్గ స్థాయిలో అయితే రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి.

బిల్లుల్లోనూ పర్సంటేజీలు..

విద్యార్థుల మెనూతో సరిపెట్టని ఉన్నతాధికారులు హాస్టళ్ల బిల్లులో కూడా పర్సంటేజీలు ఇవ్వాలని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లపై ఒత్తిడి తెస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఈ మొత్తాలను పైనుంచి ఏఎస్‌డబ్ల్యూఓ(అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్) స్థాయి వరకు వాటాలు వేసుకుని పంచుకుంటున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి.

ఏసీబీ దృష్టికి వసూళ్ల పర్వం

ఇటీవల శ్రీకాకుళం జిల్లాలో సంక్షేమ శాఖకు చెందిన ఓ ఎస్‌డబ్ల్యూఓ ఒక్క విద్యార్థికి రూ.15 చొప్పున వసూలు చేయించారు. ఇలా వచ్చిన దాదాపు రూ.1.50 లక్షలు నెలాఖరులో ఓ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ నుంచి తీసుకుంటూ ఏసీబీకి దొరికిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో కూడా ఇటువంటి పరిస్థితి ఉండటంతో ఏసీబీ అధికారులు రహస్యంగా విచారణ చేస్తున్నట్లు సమాచారం. డబ్బులు వసూలు చేసే అధికారుల గురించి సమాచారం ఇవ్వాలని అంతర్గతంగా హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లకు సూచించినట్లు తెలుస్తోంది.

వైభవంగా మల్లికార్జునుడి కల్యాణోత్సవం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం రాత్రి భ్రమరాంబ, మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీశైలం దేవస్థానం బోర్డు సభ్యుడు బోడేపూడి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. స్టేడియంలో నిర్మించిన మండపంలో కల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రజలు కుటుంబ సమేతంగా సాంప్రదాయ వస్త్రాలతో విచ్చేసి కల్యాణాన్ని తిలకించి, స్వామి వారి ఆశీస్సులు పొందారు. వేద పండితులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కల్యాణ మహోత్సవానికి ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు దంపతులు, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, గల్లా మాధవి దంపతులు, మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఏపీ టీఎస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ, రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఏపిఐడీఎస్ ఛైర్మన్ డేగల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు రథంలో ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించారు. ప్రముఖ ప్రవచనకర్త హయగ్రీవచారి, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, భాష్యం ప్రవీణ్, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త బొల్లేపల్లి సత్యనారాయణ, శ్రీ అవధూత శబరి స్వామి పాల్గొన్నారు.


కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

ప్రోత్సాహంతోనే విద్యార్థుల్లో..

సృజనాత్మక నైపుణ్యాలు వెలుగులోకి

● నేపథ్యగాయకుడు, సంగీత దర్శకులు డాక్టర్ కొమండూరి రామాచారి
● ఉల్లాసంగా ఉత్సాహంగా విజ్ఞాన్స్ మహోత్సవ్

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అంతర్లీనంగా కళా నైపుణ్యాలు దాగి ఉంటాయని, వాటిని గుర్తించి ప్రోత్సహించాలనిక నీనీ నేపథ్య గాయకులు, సంగీత దర్శకులు, లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు డాక్టర్ కొమండూరి రామాచారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సూచించారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న "విజ్ఞాన్ మహోత్సవం" గురువారం వైభవంగా ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ కొమండూరి రామాచారి మాట్లాడుతూ సైన్స్, ఫైన్ ఆర్ట్స్, స్పోర్ట్స్ మూడింటి కలయికే ఒక వ్యక్తిని సమాజంలో తిరుగులేని నాయకుడిగా నిలబెడుతుందని పేర్కొన్నారు. కేవలం పుస్తక పఠనం, సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే విద్యార్థిని ఉన్నతుడిగా తీర్చిదిద్దలేవని, సైన్స్ టెక్నాలజీతో పాటు లలిత కళలు, క్రీడలలో ప్రావీణ్యం ఉన్నప్పుడే ఒక విద్యార్థి పరిపూర్ణ వ్యక్తిగా ఎదుగుతాడు' అని ఉద్ఘాటించారు.

క్రీడాకారులకు గెలుపు ఒక వాక్యం, ఓటమి అనేది ఒక పాఠశాల లాంటిదని విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. ఆటలో గెలిచిన వారికి శుభాకాంక్షలు చెప్పడం సహజమని, కానీ ఓడిన వారినీ అభినందించడం చాలా ముఖ్యమన్నారు. ఎందుకంటే వారు ధైర్యంగా బరిలో నిలబడ్డారు, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు. క్రీడలో గెలిచినా, ఓడినా ఇద్దరికీ చప్పట్లు కొట్టాలి. అదే నిజమైన స్పోర్ట్స్ స్పిరిట్ అని తెలియజేసారు.


బెలూన్స్ ఎగురువేసి మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

మహోత్సవ్ లాంటి కార్యక్రమాల్లో గెలుపు మాత్రమే ముఖ్యమైంది కాదు, పాల్గొనడమే అసలైన విజయమని విజ్ఞాన్స్ వర్సిటీ సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి అన్నారు. విద్యార్థుల్లో పోటీ స్ఫూర్తి పాటు స్నేహ భావం కూడా పెంపొందాలనేది మా ఉద్దేశమని తెలిపారు. ఈ వేడుకల్లో 80కి పైగా పోటీలు, వినోద కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి విద్యార్థి ఈ అనుభవాలను మధుర జ్ఞాపకాలుగా తీసుకెళ్లాలని, ఇతర కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులతో మాట్లాడి, పరస్పరం పరిచయాలు పెంచుకుని, వారిని స్నేహితులుగా మార్చుకోవాలన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహిస్తామన్నారు.

విజ్ఞాన్స్ వర్సిటీ ఇంచార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్ మాట్లాడుతూ జీవితంలో ఏదైనా కొత్తవి నేర్చుకోవడానికి ఆలస్యం చేయరాదని జీవితంలో ప్రతి విద్యార్థి కూడా ఏదో ఒకటి సాధించేలా ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహోత్సవ్‌లో మొత్తం 80 ఈవెంట్లను నిర్వహించారు. తొలుత నిర్వహించిన స్పోర్ట్స్ ఫీట్ విభాగంలో పారా స్పోర్ట్స్, ట్రాక్‌అండ్ ఫీల్డ్, యోగా, పారా క్రికెట్, టెన్నికాయిట్, తైక్వాండో, ఫుట్‌బాల్, ఖో-ఖో, హాకీ, వాలీబాల్, బాస్కెట్‌బీ, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, చెస్, అథ్లెటిక్స్, త్రోబాల్‌తదితర క్రీడాంశాల్లో జాతీయ స్థాయిలో పోటీలు ప్రారంభించారు. అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీఎంవీ రావు, అడ్వైజర్, మాజీ డీజీపీ మాలకొండయ్య, విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.ఫణీంద్రకుమార్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ.శ్రీనివాసబాబు, మహోత్సవ్ 2కే26 కన్వీనర్లు, కో-కన్వీనర్లు, కోఆర్డినేటర్లు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు


మాట్లాడుతున్న డాక్టర్ కొమండూరి రామాచారి


సాంస్కృతిక ప్రదర్శనలు


విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్

ఉల్లంఘన.. క్రిమినల్ కేసులు

గుంటూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 30 పోలీస్ యాక్టు ఉల్లంఘించి వైఎస్ జగన్ ర్యాలీలో పాల్గొన్న వైసీపీ నేతలపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. పోలీస్ హెచ్చరికలు బేఖాతరు చేసి నిషేధాజ్ఞలను పట్టించుకోకుండా జగన్ తాడేపల్లి నుంచి గుంటూరు వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. సీఎంను అసభ్య పదజాలంతో దూషించిన కేసులో అరెస్టయిన అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శించారు. తాడేపల్లి నుంచి మంది మార్బలంతో వాహనాలతో హడావిడి చేసి తొమ్మిది గంటల పాటు రోడ్లలో సామాన్య ప్రజలకు చుక్కలు చూపించారు. ర్యాలీ నిర్వహించడంతో జాతీయ రహదారి, నగరంలోని రోడ్లలో ట్రాఫిక్‌కు కారణమయ్యారు. సామాన్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు 30 పోలీస్ యాక్ట్ ఉల్లంఘనలపై ఐదు కేసులు నమోదు చేశారు. తాడేపల్లి పోలీస్ స్టేషన్లో మంగళగిరి నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి దొంతిరెడ్డి వేమారెడ్డి, నూనె ఉమామహేశ్వర్ రెడ్డి, నగరంపాలెం పోలీస్ స్టేషన్లో తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి నూరి ఫాతిమా, పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో అంబటి రాంబాబు సోదరుడు అంబటి మురళి, నల్లపాడు పోలీస్‌స్టేషన్లో ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బాలసాని కిరణ్, పోతిన మహేష్, మాజీ ఎంపీ నందిగం సురేష్‌పై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిసింది. ర్యాలీలో పాల్గొని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదయ్యాయి.

ఆ తాళం తెరుద్దాం

ప్రతిరోజూ ఆసుపత్రుల్లో ఒక నిశ్శబ్దమైన సత్యాన్ని మేము గమనిస్తున్నాం. చాలామంది రోగులు బాధపడుతున్నది వారికి మందులు సరిపడక కాదు, క్రమశిక్షణ వారి జీవితాల్లోంచి నెమ్మదిగా నిష్క్రమించడం వల్ల. ఆధునికమైన అనారోగ్యాలు చాలావరకూ హఠాత్తుగా సంభవించిన ప్రమాదాలు కావు. అవి క్రమరాహిత్యమైన జీవనం, ఒత్తిడిని నిర్వహించుకోకపోవడం, భావోద్వేగపరమైన అసమతుల్యత, అంతర్గత శ్రేయస్సును నిర్లక్ష్యం చెయ్యడం లాంటి వాటివల్ల క్రమంగా సంభవించిన పరిణామాలు. వైద్య శాస్త్రం అపారంగా పురోగమించినప్పటికీ, మానవుల జీవన నాణ్యతని నిర్ణయించే ఒక శాశ్వత సూత్రం ఎప్పటికీ కొనసాగుతుంది - అదే క్రమశిక్షణ.

గుండె నేర్పే పాఠం

క్రమశిక్షణను తరచుగా శిక్షగానో, నియంత్రణగానో, కఠినమైన జీవన నియమాలుగానో అపోహపడుతూ ఉంటారు. వాస్తవానికి, క్రమశిక్షణ స్వీయ సంరక్షణకు ఒక రూపం. అది మనల్ని బలహీనపరిచేవాటికి బదులు బలపరిచేవాటిని ఎంపిక చేసుకొనే సామర్థ్యం. క్రమశిక్షణ భారం కాదనీ, దీర్ఘకాలిక ఆరోగ్యాన్ని, ఆనందాన్ని అందించే రహస్యమైన తాళం చెవి అనీ కార్డియాలజిస్టుగా, 'హార్ట్‌ఫుల్‌నెస్' ధ్యాన అభ్యాసకుడిగా నా అనుభవం ద్వారా గ్రహించాను. మనిషి గుండె రోజూ విరామం లేకుండా, విసుక్కోకుండా అద్భుతమైన కచ్చితత్వంతో రోజుకు దాదాపు లక్షసార్లు కొట్టుకుంటుంది. పరిపూర్ణమైన లయ ప్రాణాల్ని నిలబెడుతుంది. ఆ లయలో చిన్న అంతరాయం కలిగినా మనుగడకి ముప్పు కలుగుతుంది. గుండె మనకు ఒక ముఖ్యమైన పాఠాన్ని నిశ్శబ్దంగా నేర్పుతోంది - ఎక్కడ లయ, క్రమశిక్షణ ఉంటాయో అక్కడ జీవితం వర్ధిల్లుతుంది.

సహజ సమతుల్యత కోసం

దురదృష్టవశాత్తూ ఆధునిక జీవన శైలి సహజసిద్ధమైన లయకు దూరమయ్యాయి. వేళాపాళాలేని నిద్ర, అనారోగ్యమైన ఆహార అలవాట్లు, నిశ్చలమైన జీవితం, తీవ్రమైన ఒత్తిడి లాంటివి రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బుల్లాంటి జీవనశైలి వ్యాధుల మహమ్మారిని సృష్టిస్తున్నాయి. సహజసిద్ధమైన సమతుల్యతను పునరుద్ధరించుకోవడానికి 'హార్ట్‌ఫుల్‌నెస్' ధ్యానం సాయపడుతుంది. ధ్యానం ఒత్తిడిని తగ్గిస్తుందని, గుండె లయను స్థిరపరుస్తుందని, సమగ్ర శ్రేయస్సును ప్రోత్సహిస్తుందని పరిశోధన, వైద్యపరమైన పరిశీలనలు చెబుతున్నాయి. మనం మన జీవనశైలిని క్రమబద్ధీకరించుకుంటే శరీరం, మనస్సు సహజంగా సామరస్యానికి తిరిగి వస్తాయని 'హార్ట్‌ఫుల్‌నెస్' రచనలు స్పష్టం చేస్తున్నాయి. ఈ రోజుల్లో మనిషి మెదడు నిరంతరం అతి ప్రేరేపణకు గురి అవుతోంది. సోషల్ మీడియా,



పోటీ, ఉరుకుల పరుగుల జీవనం మెదడును నిరంతర ఆందోళన స్థితిలో ఉంచుతున్నాయి. ఒత్తిడి, ఆందోళన, నిస్పృహ, అలసట నిత్యజీవిత వాస్తవాలుగా మారాయి.

'క్లీనింగ్'తో స్పష్టత, స్వచ్ఛత

'హార్ట్‌ఫుల్‌నెస్' ఒక సున్నితమైన మార్గాన్ని మనకు అందిస్తోంది. క్రమం తప్పకుండా ధ్యానం చేయడం ద్వారా... సహజసిద్ధంగా స్థిరపడడాన్ని మనసు క్రమంగా నేర్చుకుంటుంది. ఆలోచనలు స్పష్టంగా మారుతాయి, భావోద్వేగాలు సమతుల్యం అవుతాయి, నిర్ణయ సామర్థ్యం మెరుగుపడుతుంది. మనసుకు నిజమైన క్రమశిక్షణ బలవంతపు నియంత్రణ ద్వారా కాదు, సరైన దిశానిర్దేశం ద్వారా వస్తుందని షాజహాన్‌పూర్‌కు చెందిన శ్రీ రామ్‌చంద్ర చెప్పారు. మానవ సంబంధాలు ఎక్కువగా భావోద్వేగ సమతుల్యత మీద ఆధారపడతాయి. 'క్లీనింగ్' అనే సరళమైన అభ్యాసాన్ని 'హార్ట్‌ఫుల్‌నెస్' ప్రవేశపెట్టింది, ఇది పేరుకుపోయిన భావోద్వేగ ముద్రలను, మానసిక భారాన్ని తొలగించడానికి ఇది సాయపడుతుంది. హృదయం అనే అద్దం మీద పేరుకుపోయిన దుమ్మును 'క్లీనింగ్' తొలగిస్తుందని, స్పష్టత, స్వచ్ఛత ఉద్భవించడానికి దోహదపడుతుందని 'హార్ట్‌ఫుల్‌నెస్' గైడ్ దాజీ వివరించారు. శారీరకమైన, భావోద్వేగపరమైన అభివృద్ధికి మాత్రమే కాదు, ఆధ్యాత్మికమైన ఎదుగుదలకు కూడా క్రమశిక్షణ దోహదం చేస్తుంది. వ్యక్తులు తమ అంతరాత్మతో అనుసంధానం కావడానికి 'హార్ట్‌ఫుల్‌నెస్' ధ్యానం సాయపడుతుంది, అందులో శాంతి, సంతృప్తి సహజంగానే ఉంటాయి. స్వీయ అభివృద్ధి కోసం ప్రేమలోంచి పుట్టిన క్రమశిక్షణ శ్రమలేనిదిగా, ఆనందదాయకంగా మారుతుంది.

స్థిరమైన దశలతో...

మార్పు అనేది రోజువారీ ధ్యానం, క్రమబద్ధంగా నిద్రపోయే అలవాట్లు, శారీరక శ్రమ, భావోద్వేగ శుద్ధి, స్వీయ పర్యావలోచన లాంటి సరళమైన, స్థిరమైన చర్యలతో ప్రారంభమవుతుంది. క్రమశిక్షణ నిర్మాణం ఒక రోజులో జరిగిపోదు, అది నిత్యం కొనసాగుతుంది. ఆధునిక సమాజం వేగాన్ని, విజయాన్ని ఆనందిస్తోంది. అయితే, క్రమశిక్షణ లేకపోతే ఈ ప్రగతి ఒత్తిడికి, అనారోగ్యానికి దారితీస్తుంది. క్రమశిక్షణ... చికిత్స అవసరం కావడానికి ఎంతో ముందుగానే బాధలను నివారిస్తుంది. క్రమశిక్షణ తరచుగా నియంత్రణలా కనిపిస్తుంది, కానీ నిజానికి అది స్వేచ్ఛను... వ్యాధుల నుంచి, భావోద్వేగపరమైన కల్లోలం నుంచి, అంతర్గత ఘర్షణ నుంచి స్వేచ్ఛను సృష్టిస్తుంది. 'హార్ట్‌ఫుల్‌నెస్' అభ్యాసాల ద్వారా క్రమశిక్షణాయుతమైన జీవనాన్ని అనుసరిస్తే... ఆరోగ్యాన్ని, ఆనందాన్ని అందించే రహస్యమైన తాళాన్ని వ్యక్తులు తెరవగలుగుతారు.


డాక్టర్ శరత్‌రెడ్డి, కార్డియాలజిస్ట్,
ట్రైనర్, హార్ట్‌ఫుల్‌నెస్. 9440087532

తెలుసుకుందాం

మాఘమాసాన్ని సూర్యుడికి ఇష్టమైన మాసంగా పూర్వులు పేర్కొన్నారు. ఈ మాసంలో, ప్రధానంగా ఆదివారం సూర్యభగవానుణ్ణి ఆరాధిస్తే ఆరోగ్యం, ఐశ్వర్యం కలుగుతాయనే విశ్వాసం ఉంది. సూర్యుడికి పన్నెండు పేర్లు ఉన్నాయి. అవి: ధాత, అర్యమా, మిత్ర, అరుణ, ఇంద్ర, వివస్వాన్, త్వష్టా, విష్ణు, అంశు, భగ, పూషా, పర్జన్య. ఒక్కొక్క మాసంలో ఒక్కొక్క పేరుతో... 'ద్వాదశాదిత్యులు'గా ఆయన సంచరిస్తాడు.



కర్మసాక్షికి మాసానికో పేరు

ద్వాదశాదిత్యులను ఏయే మాసంలో ఎలా ధ్యానించాలో వివరించిన శ్లోకాలు శైవాగమంలో ఉన్నాయి.

ధాత: ధాతా కృతస్థలీహేతిర్వాసుకీరథకృన్మనే, పులస్త్యస్తుంబురురితి మధుమాసం నయంత్యమీ, ధాతా శుభస్య మే దాతా భూయో భూయోపి భూయసామ్, రశ్మిజాలసమాశిష్టస్తమస్తోమవినాశనః

భావం: "ధాత, కృతస్థలి, హేతి, వాసుకి, రథకృత్, పులస్త్య, తుంబురులు అనే ఏడుగురు 'మధు' అనే పేరున్న మేష మాసాన్ని ముందుకు తీసుకొని వెళ్తారు. కోటి కిరణాల సమూహంతో... చిమ్మ చీకట్ల గుంపులను నాశనం చేసే ధాతృ నామధేయుడైన సూర్యుడు నాకు మళ్ళీ మళ్ళీ అధికమైన శుభాన్ని ఇచ్చుగాక" అని చైత్ర మాసంలో సూర్యుణ్ణి ధ్యానించాలి.

అర్యమా: అర్యమా పులహోథోర్జో ప్రహేతిః పుంజకస్థలీ, నారదః కచ్ఛనీరశ్చ నయంత్యేతే స్మ మాధవం, మేరుశృంగాంతరచరః కమలాకరబాంధవః, అర్యమాస్తు సదా భూత్యై భూయస్యై ప్రణతస్య చ

భావం: "అర్యమ, పులహ, ఊర్జ, ప్రహేతి, పుంజకస్థలి, నారద, కచ్ఛనీరులనే ఏడుగురు 'మాధవ మాసం' అనే పేరున్న వృషభ మాసాన్ని ముందుకు తీసుకువెళ్తారు. మేరు పర్వత శిఖరాగ్రంపై సంచరించే, కమలాల బంధువైన అర్యముడనే సూర్యునికి తలవంచి నమస్కరిస్తున్న నాకు అత్యధికమైన సంపదలు లభించుగాక" అని వైశాఖ మాసంలో సూర్యుణ్ణి ధ్యానించాలి.

మిత్ర: మిత్రోత్రిః పౌరుషేయోథ తక్షకో మేనకా హాహాః, రథస్వన ఇతి హ్యేతే శుక్లమాసం నయంత్యమీ, నిశానివారణపటురుదయాద్రికృతాశ్రయః మిత్రోస్తు మమ మోదాయ తమస్తోమవినాశనః

భావం: మిత్ర, అత్రి, పౌరుషేయ, తక్షక, మేనక, హాహా, రథస్వనులనే వారు 'శుక్ల' అనే పేరున్న మిథున మాసాన్ని ముందుకు తీసుకువెళ్తారు. రాత్రిని దూరం చేస్తూ, వెలుగొందుతున్న దేహంతో చీకట్ల సమూహాన్ని నాశనం చేస్తూ ఉదయ పర్వతాన్ని ఆశ్రయించి ఉదయిస్తున్న మిత్రుడనే పేరున్న సూర్యుడు నాకు సంతోషాన్ని ఇచ్చుగాక" అని జ్యేష్ఠ మాసంలో సూర్యుణ్ణి ధ్యానించాలి.

అరుణ: వసిష్ఠో హ్యరుణో రంభా సహజన్యస్తథా హూహూః, శుకశ్చిత్రస్వనశ్చైవ శుచిమాసం నయంత్యమీ, సూర్యస్యందనమారూఢ అర్చిర్మాలీ ప్రతాపవాన్, కాలభూతః కామరూపో హ్యరుణస్సేవ్యతే మయా

భావం: "వశిష్ఠ, అరుణ, రంభ, సహజన్య, హూహూ, శుక, చిత్రస్వనులనే వారు 'శుచి మాసం' అనే పేరు గల కర్కాటక మాసాన్ని ముందుకు తీసుకువెళ్తారు. రథంపై కూర్చొని, కిరణాల మాలతో ప్రతాపశాలియైన, కాలభూతుడు, కాలస్వరూపుడు అయిన అరుణుడనే సూర్యుణ్ణి నేను సేవిస్తున్నాను" అని ఆషాఢ మాసంలో ఈ సూర్యుణ్ణి ధ్యానించాలి.

ఇంద్ర: ఇంద్రో విశ్వావసుశ్శ్రోతా ఇలాపుత్రస్తథాంగిరాః, ప్రమ్లోచా రాక్షసశ్శర్యో నభోమాసం నయంత్యమీ, సహస్రరశ్మిసంవీతమింద్రం వరదమాశ్రయే, శిరసా ప్రణమామ్యద్య శ్రేయోవృద్ధిప్రదాయకం

భావం: "ఇంద్ర, విశ్వావసు, శ్రోతా, ఇలాపుత్ర, అంగీరస్, ప్రమ్లోచా, రాక్షస, శర్యులనే వారు 'నభస్' అనే సింహ మాసాన్ని ముందుకు తీసుకువెళ్తారు. వేయి కిరణాలతో కూడిన వరప్రదాయకుడైన ఇంద్రుడనే సూర్యుణ్ణి ఆశ్రయిస్తున్నాను. నాకు శ్రేయస్సును కలిగించే సూర్యుడికి తలవంచి నమస్కరిస్తున్నాను" అని శ్రావణ మాసంలో సూర్యుణ్ణి ధ్యానించాలి.

వివస్వాన్: వివస్వానుగ్రసేనశ్చ వ్యాఘ్ర ఆసారణో భృగుః. అనుమ్లోచా శంఖపాలో నభస్యాఖ్యం నయంత్యమీ, జగన్నిర్మాణకర్తారం సర్వదిగ్వ్యాప్తతేజసమ్, నభోగృహమహాదీపం వివస్వంతం నమామ్యహమ్

భావం: "వివస్వాన్, ఉగ్రసేన, వ్యాఘ్ర, ఆసారణ, భృగు, అనుమ్లోచా, శంఖపాలులనే వారు 'నభస్య' అనే పేరున్న కన్యా మాసాన్ని ముందుకు తీసుకువెళ్తారు. జగన్నిర్మాణకర్తగా అన్ని దిక్కులా తన తేజస్సును పంచుతూ, ఆకాశమనే ఇంటిలో పెద్ద దీపమై నిలిచిన వివస్వాన్ సూర్యుడికి నేను నమస్కరిస్తున్నాను" అని భాద్రపద మాసంలో సూర్యుణ్ణి ధ్యానించాలి.

త్వష్ట: త్వష్టా ఋచీకో రక్షశ్చ కంబలాఖ్యస్తిలోత్తమా, బ్రహ్మరాతోథ శతజిద్ధృతరాష్ట్ర ఇషంబరః, త్వష్టా శుభాయ మే భూయాచ్ఛిష్టావలినిషేవితః, నానాశిల్పకరో నానాధాతురూపః ప్రభాకరః

భావం: "త్వష్ట, ఋచీక, రక్షస్, కంబల, తిలోత్తమ, బ్రహ్మరాత, శతజిత్, ధృతరాష్ట్ర, ఇషంబరులనే వారు తులా మాసాన్ని ముందుకు తీసుకువెళ్తారు. వీరు మనకు సుఖాన్ని ఇచ్చుగాక. సజ్జన సమూహం సేవలు అందుకుంటూ, అనేక రకాల శిల్పనిర్మాణకర్త అయిన, నానావిధ ధాతు రూపమై ప్రభను కలిగించే త్వష్ట సూర్యుడు నా శుభానికి కారణం అవుగాక" అని ఆశ్వయుజ మాసంలో సూర్యుణ్ణి ధ్యానించాలి.

విష్ణు: విష్ణురశ్వతరో రంభా సూర్యవర్చాశ్చ సత్యజిత్, విశ్వామిత్ర మహాప్రేత ఊర్జమాసం నయంత్యమీ, భానుమండలమధ్యస్థం వేదత్రయనిషేవితమ్, గాయత్రీప్రతిపాద్యం తం విష్ణుం భక్త్యా నమామ్యహమ్

భావం: "విష్ణు, అశ్వతర, రంభ, సూర్యవర్చస్, సత్యజిత్, విశ్వామిత్ర, మహాప్రేతలనే వారు 'ఊర్జ మాసం' అనే పేరు గల వృశ్చికమాసాన్ని ముందుకు తీసుకువెళ్తారు. సూర్య మండలం మధ్యలో ఉండి, ఋగ్యజుస్సామములనే మూడు వేదాలతో సేవలందుకుంటూ, గాయత్రీ మంత్రంతో వ్యక్తమవుతున్న విష్ణు సూర్యునికి నేను భక్తితో నమస్కరిస్తున్నాను" అని కార్తిక మాసంలో సూర్యుణ్ణి ధ్యానించాలి.

అంశు: అథాంశః కశ్యపస్తార్క్ష్యః ఋతుసేనస్తతోర్వశీ, విద్యుచ్ఛత్రుర్మహాశంఖస్సహోమాసం నయంత్యమీ, సదా విద్రావణరథో జగన్మంగళదీపకః, మునీంద్రనివహస్తుత్యో భూతిదోంశుర్భవేన్మమ

భావం: "అంశ, కాశ్యప, తార్క్ష్య, ఋతుసేన, ఊర్వశి, విద్యుచ్ఛత్రు, మహాశంఖులనే వారు 'సహస్' అనే పేరున్న ధనుర్మాసాన్ని ముందుకు తీసుకువెళ్తారు. ఎల్లప్పుడూ రథాన్ని నడుపుతూ, జగత్తుకు మంగళకరమైన దీపాన్నిస్తూ, ఋషిశ్రేష్ఠుల సమూహం నుంచి స్తుతులను అందుకొనే అంశ సూర్యుడు నాకు సంపదలను ఇచ్చుగాక" అని మార్గశిర మాసంలో సూర్యుణ్ణి ధ్యానించాలి.

భగ: భగస్స్ఫూర్జోరిష్టనేమిరూర్ణ ఆయుశ్చ పంచమః, కర్కోటకః పూర్వచిత్తిః పౌషమాసం నయంత్యమీ, తిథిమాసృతూనాం చ వత్సరాయనయోరపి, ఘటికానాం చ యః కర్తా భగో భాగ్యప్రదోస్తుమే

భావం: భగ, స్ఫూర్జ, అరిష్టనేమి, ఊర్ణ, ఆయుస్, కర్కోటక, పూర్వ చిత్తులనే వీరు 'పౌష మాసం' అనే పేరున్న మకర మాసాన్ని ముందుకు తీసుకువెళ్తారు. తిథి, మాస, ఋతు, వర్ష, అయన, ఘటికాలనే వాటికి కారకుడైన భగ సూర్యుడు నాకు భాగ్యాలను ఇచ్చుగాక" అని పుష్య మాసంలో సూర్యుణ్ణి ధ్యానించాలి..

పూష: పూషా ధనంజయో ధాతా సుషేణస్సురుచిస్తథా, ఘృతాచీ గౌతమశ్చేతి తపోమాసం నయంత్యమీ, పూషా తోషాయ మే భూయాత్సర్వపాపాపనుత్తయే, సహస్రకరసంవీతస్సమస్తాశాంతరాంతరః

భావం: పూషా, ధనంజయ, ధాత, సుషేణ, సురుచి, ఘృతాచి, గౌతములనే వారు 'తపో మాసం' అనే కుంభ మాసాన్ని ముందుకు తీసుకువెళ్తారు. సహస్ర కిరణాలతో అన్ని దిక్కులా వ్యాపించిన పూషా సూర్యుడు మన పాపాలన్నిటినీ దూరం చేసి, సంతోషాన్ని ఇచ్చుగాక" అని మాఘ మాసంలో సూర్యుణ్ణి ధ్యానించాలి.

పర్జన్య: క్రతుర్వర్చా భరద్వాజః పర్జన్యస్సేనచిత్తథా, విశ్వశ్చైరావతశ్చైవ తపస్యాఖ్యం నయంత్యమీ, ప్రపంచం ప్రతపన్ భూయో వృష్టిభిర్హ్లాదయన్పునః, జగదానందజనకః పర్జన్యః పూజ్యతే మయా

భావం: క్రతు, వర్చస్, భరద్వాజ, పర్జన్య, సేనచిత్, విశ్వ, ఐరావతులనే వారు 'తపస్య' అనే పేరున్న మీన మాసాన్ని ముందుకు తీసుకువెళ్తారు. తన కిరణాలతో ప్రపంచాన్ని కాలుస్తూ, అధిక వర్షాలు కురిపించి లోకాన్ని సంతోషపరుస్తూ, జగత్తుకు ఆనందాన్ని ఇచ్చే పర్జన్య సూర్యుణ్ణి నేను పూజిస్తున్నాను" అని ఫాల్గుణ మాసంలో సూర్యుణ్ణి ధ్యానించాలి.


డి.యన్.వి. ప్రసాద్,
స్థపతి, 9440525788

భక్తి మార్గదర్శి

వేదాలు, ఉపనిషత్తులు, స్మృతుల ఆధారంగా తత్త్వాన్ని నిరూపించిన శ్రీ మధ్వాచార్యుల ద్వైత సిద్ధాంతం... తత్త్వవాదంగా ప్రసిద్ధి చెందింది. సదా శ్రీహరి సేవలో తరించే శ్రీవాయుదేవుల మూడో అవతారమే శ్రీ మధ్వాచార్యులు. ఋగ్వేద సూక్తం అయిన 'బళిత్థా సూత్రం', 'కూర్మపురాణం' లోని ప్రమాణాలు దీన్ని స్పష్టం చేస్తాయి. 1238లో విజయదశమినాడు... పాజక అనే గ్రామంలో శ్రీమధ్వాచార్యులు జన్మించారు. పరశురామ పవిత్ర క్షేత్రాల్లో అదొకటి.

బాలుడు కాదు... లోకేశ్వరుడు

మగ సంతానాన్ని కోరుకుంటూ మధ్యగేహభట్టు, వేదవతి దంపతులు ఉడిపిలోని అనంతేశ్వరస్వామిని సేవించారు. వారికి మగబిడ్డ జన్మించాడు. అతనికి 'వాసుదేవ' అని నామకరణం చేశారు. వాసుదేవుడు నెలల బిడ్డగా ఉన్నప్పుడు... అతని తల్లిదండ్రులు ఉడిపిలో అనంతేశ్వరుడి సంక్రమణోత్సవం ముగించుకొని, తోటి గ్రామస్తులతో కలిసి అడవిలోంచి ప్రయాణిస్తున్నారు. వాళ్ళు ఆలస్యంగా బయలుదేరారు. అర్ధరాత్రి అయింది. దట్టమైన అడవి, క్రూర జంతువుల శబ్దాలు భయం కలిగిస్తున్నాయి. ఉన్నట్టుండి ఆ గుంపులో ఒకరు ఆర్తనాదం చేస్తూ... రక్తం కక్కుకొని కింద పడ్డారు. అది భూతం చేష్ట అని వాళ్ళకు అర్థమైంది. అవి సాధారణంగా శిశువులను పీడిస్తాయని వాళ్ళకి తెలుసు. కానీ బాలుడైన వాసుదేవుడు సురక్షితంగా ఉన్నాడు. 'ఈ రోజు మా పుణ్యం బాగుంది' అని వాళ్ళు అనుకున్నంతలో... రక్తం కక్కుకొని పడిపోయిన వ్యక్తిలో ప్రవేశించిన భూతం "ఈ అడవి మాది. ఈ సమయంలో మేము తిరుగుతూ ఉంటామని తెలిసీ ఇంతటి సాహసం ఎందుకు చేశారు? మీకు ప్రాణహాని చేయలేదంటే



దానికి కారణం ఈ బాలకుడి సామర్థ్యం. ఇతడు సామాన్యుడు కాదు, లోకేశ్వరుడు" అని చెప్పి, తొలగిపోయింది. అప్పుడు వారికి అర్థమయింది... 'ఈ బిడ్డ బతికింది మా వల్ల కాదు, మేము జీవించి ఉండడానికి కారణం ఈ బిడ్డే' అని. ఇది బాల మధ్వుల మహిమ.

తండ్రిని మించిన తనయుడు

ఒకసారి మధ్యగేహభట్టు ఒక పురాణ శ్లోకాన్ని వివరించే క్రమంలో... కొన్ని వందల వృక్షాల పేర్లను వివరించాడు. శ్రోతల్లో ఒకరైన వాసుదేవుడు... మరొకసారి వివరించాలని తండ్రిని ప్రార్థించాడు. మధ్యగేహుడు మళ్ళీ చక్కగా వివరించాడు. అప్పుడు బాలుడైన వాసుదేవుడు "తండ్రీ! ఈసారి కూడా మీరు మూల శ్లోకంలో ఉన్న 'లికుచ' అనే శబ్దాన్ని వివరించలేదు" అని అడిగాడు. నిజానికి మధ్యగేహభట్టుకు ఆ పదానికి అర్థం తెలుసు. కానీ ఎలా వివరించాలో తెలీదు. తప్పుగా వివరిస్తే గ్రంథాపచారం అవుతుందని బుద్ధి పూర్వకంగానే దాన్ని వదిలేశాడు. అప్పుడు అక్కడ ఉన్నవారు వాసుదేవుణ్ణి దాని అర్థం చెప్పాలని కోరగా, అతను దాన్ని వివరించి, అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తాడు. కుమారుడి అసాధారణ ప్రతిభను గమనించిన మధ్యగేహ భట్టు... అతణ్ణి తిల్లాయ అనే గురువు దగ్గరకు విద్యాభ్యాసం కోసం పంపించాడు. కానీ అతను గురుకులంలో చాలా తక్కువగా కనిపించేవాడు. ఎక్కువగా ఆటపాటలతో గడిపేవాడు. ఒకసారి గురువు అతణ్ణి పిలిచి... సరిగ్గా అధ్యయనం ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. అన్నీ నేర్చుకుంటున్నానని వాసుదేవుడు చిరునవ్వుతో చెప్పాడు. అంతకుముందు చెప్పిన పాఠాలు అప్పజెప్పాలని గురువు అడిగితే... వాటినే కాదు, తనకు ఆయన నేర్పని మహానారాయణోపనిషత్తును కూడా స్వరయుక్తంగా, ముగ్ధమనోహరంగా చెప్పాడు. ఆ శిష్యుడు సామాన్యబాలుడు కాదని గురువుకు అర్థమయింది.

సర్వమూల గ్రంథాలు

పదకొండేళ్ళ వయసులో... ఉడిపిలో వాసుదేవుడికి శ్రీ అచ్యుత ప్రేక్షకులు సన్యాస ఆశ్రమాన్ని ప్రసాదించి, 'పూర్ణప్రజ్ఞ' అని నామకరణం చేశారు. పూర్ణప్రజ్ఞులు గంగా స్నానం చేయాలని అనుకుంటే.... గంగాదేవే అక్కడికి వచ్చింది. ఆ జలాశయమే ఉడిపిలో ఇప్పటికీ ఉన్న మధ్వసరోవరం. ఆ తరువాత కొద్దికాలంలోనే పూర్ణప్రజ్ఞులకు శ్రీఅచ్యుత ప్రేక్షకులు పీఠాధిపత్యాన్ని ఇచ్చి, 'ఆనంద తీర్థులు' అనే నామాన్ని ప్రసాదించారు. గురువు ఆదేశం ప్రకారం పలు ప్రాంతాల్లో ఆనందతీర్థులు సంచరించి, దుర్వాదులను ఓడించి, దిగ్విజయ యాత్ర చేశారు. తన గ్రంథాల్లో మొదటిదైన 'గీతాభాష్యా'న్ని బదరీనారాయణుడికి సమర్పించారు. శ్రీమధ్వాచార్యులుగా ప్రసిద్ధులయ్యారు. ఆయన రాసిన 37 గ్రంథాలు సర్వమూల గ్రంథాలుగా పేరు గాంచాయి. 'శ్రీహరే సర్వోత్తముడు', 'జగత్తు సత్యం' తదితర అంశాలు ప్రధానంగా ద్వైత సిద్ధాంతాన్ని స్థాపించారు. పద్మనాభ తీర్థులు, నరహరి తీర్థులు, అక్షోభ్య తీర్థులు, మాధవ తీర్థులు అనే నలుగురు శిష్యులతో ఆయన ప్రారంభించిన మధ్వ సిద్ధాంత పరంపర అనే మణిహారంలో శ్రీ జయతీర్థులు, శ్రీ వ్యాసరాయలు , శ్రీ వాదిరాజులు, శ్రీ రాఘవేంద్ర స్వామి లాంటి ఎందరో మహాయతులు, విద్వన్మణులు ప్రకాశించారు. ఆయన స్థాపించిన ఉడిపి అష్టమఠాలు, తదనంతరం ఏర్పడిన శ్రీ ఉత్తరాదిమఠం, శ్రీ వ్యాసరాయమఠం, శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం లాంటివి శ్రీమధ్వాచార్యుల వారు ప్రతిపాదించిన భక్తి మార్గాన్ని వారి బోధనలకు అనుగుణంగా సమాజానికి అందజేసి, సనాతన ధర్మ పరిరక్షణలో చేస్తున్నాయి. 'భగవంతుని యందు మాహాత్మ్య జ్ఞానంతో చేసే స్నేహమే భక్తి' అని శ్రీమధ్వాచార్యులు తెలిపారు. అటువంటి భక్తిని దైవం పైన, గురువుల పట్ల చూపిస్తే... వారి అనుగ్రహానికి పాత్రులం కాగలం.

• శ్రీ మధ్వ ప్రచార పరిషత్

సందేశం

కష్టంలోనే సుఖం

మంచి జీవితం గురించి, ఉన్నతమైన జీవితం గురించి అందరూ కలలు కంటారు. వాటిని నెరవేర్చుకోవడానికి ఒక్కొక్కరిదీ ఒక్కొక్క దారి. కొందరు ఎదుటి వ్యక్తిని నమ్మించి, మభ్యపెట్టి సంపాదించడానికి పాట్లు పడతారు. లాభం కోసం వ్యాపారాల్లో మోసం చేస్తారు. 'ఎలాగైనా సంపాదించాలి' అనుకొనేవారికి ఎన్నో అడ్డదారులు ఉన్నాయి. కానీ అవన్నీ చివరికి మనశ్శాంతిని దూరం చేస్తాయి.



కలలను నెరవేర్చుకోవడానికి కష్టపడాలి. దానికోసం దృఢసంకల్పం ఉండాలి. వేర్లు భూమిలో గట్టిగా పాతుకుపోయిన వృక్షానికి ఉన్నంత దృఢత్వాన్ని కలిగి ఉండాలి. "సంపాదన విషయంలో ధర్మాన్ని అనుసరించేవారే నా సంప్రదాయాన్ని పాటించేవారు. తన వల్ల చెడు జరగకుండా, ప్రజలను కాపాడే వ్యక్తి స్వర్గంలో తప్పకుండా ప్రవేశిస్తాడు" అని మహా ప్రవక్త మహమ్మద్ చెప్పారు. "కష్టపడి, ధర్మమైన సంపాదనతో చేసే భోజనమే ఉత్తమమైన భోజనం" అని స్పష్టం చేశారు. మహనీయుడైన ప్రవక్త దావూద్ స్వయంగా శ్రమించి తన ఆహారాన్ని సంపాదించుకొనేవారు.

ఒక సందర్భంలో ఒక పేద సహచరుడు దైవప్రవక్త దగ్గరకు సాయం కోసం వచ్చాడు. అప్పుడు ఆయన తన దగ్గర ఉన్న వస్తువులను వేలం వేసి ఒక గొడ్డలి కొన్నారు. ఆ గొడ్డలికి కర్రను తన స్వహస్తాలతో తయారు చేసి, ఆ వ్యక్తికి ఇచ్చారు. అడవికి వెళ్ళి, కట్టెలు కొట్టి, అమ్ముకొని జీవించాలని సలహా ఇచ్చారు. ఆ తరువాత కొన్నాళ్ళకు... మహాప్రవక్త దగ్గరకు ఆ వ్యక్తి మళ్ళీ వచ్చి, తన ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందని చెప్పాడు. ఆ మాటలకు దైవప్రవక్త ఎంతో సంతోషించారు. "ఇతరుల సహాయం కోరడం కన్నా కష్టపడి సంపాదించడం గొప్పపని" అని చెప్పారు. "మరణించి, పరలోకగతుడైన ప్రతి వ్యక్తికి తన ఇహలోక జీవితం పట్ల పశ్చాత్తాపం, ఆందోళన తప్పకుండా కలుగుతాయి. మరణించిన వ్యక్తి మంచివాడు, సచ్చరితుడు అయితే... మరిన్ని మంచి కార్యాలు చేసి ఇంకా ఎక్కువ పుణ్యం సంపాదించుకోలేకపోయానని పశ్చాత్తాపపడతాడు. చెడ్డవాడయితే... దుష్కార్యాలకు, పాపాలకు ఎందుకు దూరంగా ఉండలేకపోయానని పశ్చాత్తాపపడతాడు" అని ఆయన వెల్లడించారు. కష్టంలోనే సుఖం ఉంది. "ఇహలోక సంపాదన చేస్తూనే పరలోక సంపద కోసం కష్టపడే వ్యక్తులు సదాచార పరాయణులు, వారు మరణానంతరం ఉత్తమ స్థానాన్ని పొందుతారు" అని ఇస్లాం ధర్మం చెబుతోంది.

• మహమ్మద్ వహీదుద్దీన్

దైవమార్గం

జగతి ప్రగతి కోసం



సామాన్య ప్రజల కోసం ప్రభువు ఎన్నో బోధనలు చేశాడు. ఆయన ప్రసంగాలు కొత్త కొత్త భాష్యాలతో, నూతన వివరణలతో సాగాయి. పాత నిబంధనలోని పది ఆజ్ఞల అమృతాన్ని జనావళికి పంచాయి. నాటి సమాజాన్ని పట్టి పీడిస్తున్న అనాచారాలను, అన్యాయాలను చూసి ప్రభువు స్పందించాడు. సందర్భాలకు తగిన విధంగా ఆయన బోధనలు సాగాయి. అవి కొన్నిసార్లు మాటల రూపంలో వెలువడ్డాయి. మరికొన్నిసార్లు తన ఆచరణ ద్వారా ప్రజలకు ఆయన చూపించాడు. సమాంతరంగా సాగిన రెండూ జగతి ప్రగతికి దోహదం చేశాయి. లోకంలోని చీకటిని ఆయన కళ్ళారా చూశాడు. ఆయన వాక్కులు ఆ చీకటిని తొలగించే వెలుతురు కిరణాలయ్యాయి.

ఎన్నో తప్పులు చేసి, 'ఇక జీవించడం వ్యర్థం' అని నిరాశతో కుంగిపోయేవారిని ప్రభువు చూశాడు. పరులతో నిందలు పడుతున్న వారిని చూశాడు. బలవంతుల అణచివేతకు గురవుతున్న వారిని చూశాడు. జీవితలక్ష్యం ఏమిటో తెలియక, ఎందుకు బతుకుతున్నామో, ఎవరికోసం బతుకుతున్నామో తెలియని అమాయకులను కూడా చూశాడు. వారి దగ్గరకు వెళ్ళాడు. కావలసినంత ధైర్యాన్ని ఇచ్చాడు. ఆయన పిలుపు అందరినీ చల్లగా పలకరించింది. దుఃఖితులను ఓదార్చింది. బాధితులు అయినప్పటికీ నీతిగా బతికేవారికీ, ధర్మం కోసం హింసను భరిస్తున్నవారికీ ఊరటనిచ్చింది. హృదయ శుద్ధితోనే మీ జన్మ ధన్యం అవుతుందనీ, ఆహారంలో ఉప్పులా విలువైన జీవితంతో, వెలిగించిన దివ్వెల్లా దారిచూపే బతుకులతో లోకానికి ఆదర్శంగా ఉంటూ దేవుణ్ణి మెప్పించాలని చెప్పాడు. అర్థరహితమైన మూఢనమ్మకాలను ఖండించాడు. శత్రుభావాన్ని తుంచుకోవాలని, ప్రేమభావాన్ని పెంచుకోవాలని, అప్పుడే మీరు చేసే పనికి దేవుడు ఆనందిస్తాడని, కాబట్టి శత్రువును ద్వేషించకుండా ప్రేమించాలని సందేశం ఇచ్చాడు. సత్యం, దయ, అహింస, ప్రేమ, విశ్వాసం, పశ్చాత్తాపం, క్షమ, ప్రార్థన లాంటి పదాలకు అసలైన అర్థాలు చెప్పాడు. దైవారాధన, సాటి మానవుల పట్ల ప్రేమ... ఈ రెండూ సమతూకంతో సాగాలని కొండ కోనల్లో తనచుట్టూ గుమిగూడిన ప్రజానీకానికి సరికొత్త వివరణ ఇచ్చాడు. ప్రజలకు తన బాటలో సాగే మనోధైర్యాన్ని అందించాడు. ఆయన బోధలు విశ్వమానవ ప్రేమ సూత్రాలు.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024



ఆరో టైటిల్ వేటలో భారత్
నేడు ఇంగ్లండ్‌తో ఫైనల్

కుర్రాళ్లూ.. ఈసారి వదలొద్దు

అండర్-19 వరల్డ్‌కప్

హరారే: అండర్-19 ప్రపంచకప్ ఆఖరి అంకానికి చేరింది. అంచనాలకు తగ్గట్టుగానే భారత యువ ఆటగాళ్లు తమ ప్రదర్శనతో అదరగొట్టారు. ఆయుష్ మాత్రే బృందం ఒక్క మ్యాచ్ కూడా ఓడకుండా తుది పోరుకు అర్హత సాధించడం విశేషం. ఇక శుక్రవారం ఇంగ్లండ్‌తో జరిగే ఫైనల్లోనూ ఎలాంటి అలక్ష్యానికి తావీయకుండా చెలరేగాలని భావిస్తోంది. అదే జరిగితే భారత్ ఖాతాలో ఆరో టైటిల్ చేరుతుంది. 2022లో మన కుర్రాళ్లు చివరిసారి ఇంగ్లండ్ జట్టుపైనే గెలిచి కప్ సాధించారు. కానీ 2024లోనూ కప్ కోసం పోరాడినా ఆసీస్ చేతిలో ఓడి రన్నరప్‌తో సంతృప్తి పడాల్సి వచ్చింది. దీనికి ముందు జరిగిన 15 టోర్నమెంట్లలో యువ భారత్ తొమ్మిది సార్లు ఫైనల్‌కు చేరి, ఐదుసార్లు విశ్వవిజేతగా నిలవడం జట్టు ఆధిపత్యాన్ని సూచిస్తోంది. మహ్మద్ కైఫ్, విరాట్ కోహ్లీ, ఉన్ముక్త్ చంద్, పృథ్వీ షా, యష్ ధుల్ సారథ్యంలో భారత్‌కు ట్రోఫీలు లభించాయి. మరోవైపు ఇంగ్లండ్‌కిది మూడో ఫైనల్ కాగా 1998 తర్వాత మరోసారి విజేతగా నిలవాలని ఆరాటపడుతోంది. భారత్‌లాగే ఈ జట్టు ఖాతాలోనూ ఒక్క ఓటమి లేకపోవడం గమనార్హం. పైగా సెమీస్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆసీస్‌ను ఓడించి ఊపు మీదుంది. దీంతో ఫైనల్ సమరం అత్యంత ఆసక్తికరంగా సాగుతుందనడంలో సందేహం లేదు.

ఫేవరెట్‌గా..

టైటిల్ పోరుకు ముందే భారత బ్యాటింగ్ ఆర్డర్ మరింత పటిష్టంగా మారడం జట్టుకు సానుకూలాంశం కానుంది. ఇక ఓపెనర్ వైభవ్ విధ్వంసకర ఆటతీరు తెలిసిందే. విహాన్, వేదాంత్ మిడిలార్డర్‌లో ఆదుకుంటున్నారు. బౌలింగ్‌లో అంబరీష్, హెనిల్, ఖిలన్‌లతో పాటు ఆయుష్ సైతం వికెట్లను పడగొడుతున్నాడు.

సెమీస్‌పై ఆంధ్ర గురి

- క్వార్టర్స్‌లో బెంగాల్‌తో ఢీ
- రంజీ ట్రోఫీ

కోల్‌కతా: లీగ్ దశలో ఓటమి ఎరుగని ఆంధ్ర.. రంజీ ట్రోఫీ సెమీస్ బెర్త్‌పై గురిపెట్టింది. శుక్రవారం నుంచి జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో బెంగాల్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. టీమిండియా ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్, సౌరభ్ కుమార్, కెప్టెన్ రికీ భుయ్, రషీద్‌లపై టీమ్ బ్యాటింగ్ ఎక్కువగా ఆధారపడింది. కాగా, సొంతగడ్డపై ఆడుతుండడం బెంగాల్‌కు లాభించే అంశం. పేసర్ షమిపై ఆ టీమ్ ఎంతో ఆధారపడింది.

భారత జట్ల ఓటమి

కింగ్డావో (చైనా): ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఇప్పటికే క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరిన భారత జట్లు చివరి గ్రూపు మ్యాచ్‌లలో పరాజయం చవిచూశాయి. మహిళల గ్రూప్ 'వై' పోరులో భారత్ 2-3తో థాయ్‌లాండ్ చేతిలో ఓడింది. దాంతో గ్రూపులో రెండో స్థానంలో నిలిచింది. గ్రూప్ 'సీ'లో భారత పురుషులు కూడా 2-3తో జపాన్ చేతిలో ఓటమి పాలై రెండో స్థానంలో నిలిచారు. శుక్రవారం జరిగే క్వార్టర్‌ఫైనల్లో చైనాతో మహిళలు, కొరియాతో పురుషులు తలపడతారు.

టీ20 ప్రపంచ కప్

రేపటి నుంచే

మేం కొలంబో వెళ్తున్నాం



టిక్కెట్లు బుక్ అయ్యాయి
భారత్ కెప్టెన్ సూర్యకుమార్

కొలంబో/ఇస్లామాబాద్: పాకిస్థాన్‌తో ఈనెల 15న జరిగే టీ20 ప్రపంచ కప్ మ్యాచ్ కోసం తాము కొలంబో వెళ్తున్నట్టు టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ గురువారం స్పష్టంజేశాడు. కారణాలు చెప్పకుండా..భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్టు పాకిస్థాన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకుంటే పాకిస్థాన్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని ఐసీసీ హెచ్చరించింది కూడా. అయినా పాకిస్థాన్ తన నిర్ణయానికే మొగ్గు చూపుతోంది. 'పాకిస్థాన్ నిర్ణయం నా నియంత్రణలో లేదు. 15న కొలంబోలో మేం పాకిస్థాన్‌తో ఆడాలని చెప్పారు. మా మైండ్ సెట్ చాలా స్పష్టంగా ఉంది. పాకిస్థాన్‌తో ఆడబోమని మేం చెప్పలేదు. కొలంబోకు మా టిక్కెట్లు రిజర్వ్ అయ్యాయి' అని వెల్లడించాడు.

మా చేతుల్లో లేదు: ఆఘా

భారత్‌తో ఆడరాదన్న తమ బోర్డు నిర్ణయాన్ని పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ ఆఘా సమర్థించాడు. అది ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమని, తమ చేతుల్లో ఏమీ లేదని అన్నాడు. దానిని తాము గౌరవించాలన్నాడు. భారత్‌తో నాకౌట్‌లో తలపడాల్సి వస్తే అన్న ప్రశ్నకు..అప్పుడూ ప్రభుత్వ నిర్ణయమే తమకు శిరోధార్యమన్నాడు.



మేం బంగ్లాదేశ్ వెంటే

పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్

భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తూ తాము తీసుకున్న నిర్ణయం సరైనదేనని పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్ అన్నారు. 'మేం ఎంతో ఆలోచించి..స్పష్టమైన వైఖరితోనే భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తూ నిర్ణయం తీసుకున్నాం. బంగ్లాకు పూర్తిగా అండగా ఉంటాం' అని వ్యాఖ్యానించారు.

పాకిస్థాన్‌కు థ్యాంక్స్: బంగ్లా

భారత్‌కు వ్యతిరేకంగా బంగ్లాదేశ్, పాకిస్థాన్ ఒక్కటయ్యాయని వెల్లడైంది. బంగ్లాదేశ్ ప్రభుత్వ క్రీడా సలహాదారు అసిఫ్ నజ్రుల్ చేసిన పోస్ట్‌తో ఈ విషయం బహిర్గతమైంది. టీ20 వరల్డ్ కప్‌లో తమకు మద్దతుగా నిలిచిన పాకిస్థాన్‌కు నజ్రుల్ ఫేస్‌బుక్ వేదికగా కృతజ్ఞతలు తెలిపాడు.

ఐసీసీదే తప్పు: నాసిర్

ఐసీసీ తీసుకున్న నిర్ణయాన్ని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ నాసిర్ హుస్సేన్ తప్పుబట్టాడు. 'మరో దేశంతో భారత్ ఆడేందుకు నిరాకరిస్తే ఆ జట్టుపైనా ఐసీసీ అలాంటి నిర్ణయమే ప్రకటిస్తుందా' అని ప్రశ్నించాడు.

ఆర్‌సీబీ అద్వితీయం

రెండోసారి డబ్ల్యూపీఎల్ విజేతగా బెంగళూరు



- లీగ్‌లో రికార్డు ఛేదన
- ఫైనల్లో పోరాడి ఓడిన ఢిల్లీ

మంధాన మెరిసింది.. బెంగళూరు మరోసారి మురిసింది. భారీ స్కోరు.. చివరి ఓవర్ వరకూ హోరాహోరీగా సాగిన టైటిల్ ఫైట్‌లో.. ఉత్కంఠ విజయాన్ని అందుకొన్న ఆర్‌సీబీ.. రెండోసారి డబ్ల్యూపీఎల్ టైటిల్‌తో అదరహో అనిపించింది. వరుసగా నాలుగోసారి ఫైనల్‌చేరుకొన్న ఢిల్లీ క్యాపిటల్స్.. మరోసారి రన్నరప్ గానే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

వడోదర: డాషింగ్ బ్యాటర్ స్మృతి మంధాన (41 బంతుల్లో 12 ఫోర్లు, 3 సిక్స్‌లతో 87), జార్జియా వోల్ (79) ధనాధన్ అర్ధ శతకాలతో.. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) రెండోసారి మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టైటిల్‌ను సొంతం చేసుకొంది. గురువారం జరిగిన ఫైనల్లో రికార్డు లక్ష్య ఛేదనలో బెంగళూరు 6 వికెట్లతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను చిత్తు చేసింది. దీంతో వరుసగా నాలుగోసారి కూడా ఢిల్లీకి తుది మెట్టుపై నిరాశే ఎదురైంది. తొలుత ఢిల్లీ 20 ఓవర్లలో 203/4 స్కోరు చేసింది. సారథి జెమీమా రోడ్రిగ్స్ (37 బంతుల్లో 8 ఫోర్లతో 57), లారా వోల్వార్ట్ (44), లిజెల్లీ లీ (37), చినెల్లీ హెన్రీ (35 నాటౌట్) పోరాటాలు వృథా అయ్యాయి. ఛేదనలో బెంగళూరు 19.4 ఓవర్లలో 204/4 స్కోరు చేసి గెలిచింది. హెన్రీ 2 వికెట్లు పడగొట్టింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా స్మృతి మంధాన నిలిచింది.



దూకుడుగా ఆడుతూ: ఛేదనలో ఓపెనర్ గ్రేస్ హ్యారిస్ (9) స్వల్ప స్కోరుకే వెనుదిరిగినా.. స్మృతి, వన్‌డౌన్ బ్యాటర్ వోల్ జట్టును ఆదుకొన్నారు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 92 బంతుల్లో 165 రన్స్ జోడించారు. బెంగళూరు పవర్‌ప్లేలో 59, పదో ఓవర్‌కు 100 రన్స్‌ను చేరింది. ఇక వోల్, మంధాన వరుస ఓవర్లలో అర్ధ శతకాలు పూర్తి చేసుకోవడంతో.. ఆర్‌సీబీ గెలుపు దిశగా సాగింది. చివరి 30 బంతుల్లో 42 రన్స్ అవసరమవగా.. 17వ ఓవర్‌లో వోల్‌ను మణి క్యాచవుట్ చేసింది. తర్వాత వచ్చిన రిచా (6)ను నందని వెనక్కిపంపింది. విజయానికి మరో 13 పరుగుల దూరంలో మంధానను హెన్రీ బౌల్డ్ చేయడంతో కొంత ఉత్కంఠ రేగింది. కానీ, డి క్లెర్క్ (7 నాటౌట్), రాధా యాదవ్ (12 నాటౌట్) రెండు బంతులు ఉండగానే జట్టును గెలిపించారు.

రాణించిన బ్యాటర్లు: జెమీమాతోపాటు టాపార్డర్ బ్యాటర్లు రాణించడంతో.. ఢిల్లీ పోరాడగలిగే స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన క్యాపిటల్స్‌కు ఓపెనర్లు లి, షఫాలీ తొలి వికెట్‌కు 49 పరుగుల భాగస్వామ్యంతో నిలకడైన ఆరంభాన్నిచ్చారు. అయితే, అరుంధతి బౌలింగ్‌లో రెండు బౌండ్రీలు బాదిన వర్మ.. మరో భారీషాట్ ఆడే ప్రయత్నంలో క్యాచవుట్ అయింది. దీంతో పవర్‌ప్లేను ఢిల్లీ 53/1తో ముగించింది. తర్వాతి ఓవర్‌లో లీ 19 రన్స్ రాబట్టింది. అయితే, లిజెల్లీని డి క్లెర్క్ అవుట్ చేసింది. ఈ దశలో లారాతో కలసి జెమీమా స్కోరుబోర్డును పరుగులు పెట్టించింది. రోడ్రిగ్స్.. 15వ ఓవర్‌లో సింగిల్‌తో ఫిఫ్టీ పూర్తి చేసుకోవడంతో ఢిల్లీ 140/2తో నిలిచింది. కానీ, ఆ వెంటనే జెమీమాను సయాలీ క్యాచవుట్ చేయడంతో.. మూడో వికెట్‌కు 76 రన్స్ భాగస్వామ్యం ముగిసింది. డెత్ ఓవర్లలో లారా, హెన్రీ నాలుగో వికెట్‌కు 24 బంతుల్లోనే 55 రన్స్ జోడించడంతో.. టీమ్ స్కోరు 200 మార్క్ దాటింది. 19వ ఓవర్‌లో డి క్లెర్క్ బౌలింగ్‌లో హెన్రీ 4 ఫోర్లు, సిక్స్‌తో 24 రన్స్ రాబట్టింది.

1 డబ్ల్యూపీఎల్ చరిత్రలోనే ఇది అత్యధిక ఛేదన. గతేడాది గుజరాత్ నిర్దేశించిన 202 పరుగుల లక్ష్యాన్ని కూడా బెంగళూరు అధిగమించింది.

4 ఫైనల్లో వరుసగా నాలుగోసారి ఓడిన ఢిల్లీ.

స్కోరుబోర్డు

ఢిల్లీ: లిజెల్లీ లీ (సి) హ్యారిస్ (బి) డి క్లెర్క్ 37, షఫాలీ (సి) రిచా (బి) అరుంధతి 20, లారా (రనౌట్) 44, జెమీమా (సి) డి క్లెర్క్ (బి) సయాలి 57, హెన్రీ (నాటౌట్) 35; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 203/4; వికెట్ల పతనం:** 1-49, 2-72, 3-148, 4-203; **బౌలింగ్:** బెల్ 4-0-19-0, సయాలి 4-0-46-1, అరుంధతి 4-0-40-1, శ్రేయాంక 2-0-32-0, డి క్లెర్క్ 4-0-48-1, రాధా యాదవ్ 2-0-18-0.

బెంగళూరు: గ్రేస్ హ్యారిస్ (బి) హెన్రీ 9, మంధాన (బి) హెన్రీ 87, జార్జియా వోల్ (సి) షఫాలీ (బి) మణి 79, రిచా (సి) మణి (బి) నందని 6, డి క్లెర్క్ (నాటౌట్) 7, రాధ (నాటౌట్) 12; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 19.4 ఓవర్లలో 204/4; వికెట్ల పతనం:** 1-9, 2-174, 3-181, 4-191; **బౌలింగ్:** కాప్ 4-0-38-0, హెన్రీ 4-0-34-2, నందని 4-0-41-1, చరణి 3.4-0-46-0, షఫాలీ 1-0-9-0, మిన్నూ మణి 2-0-19-1, స్నేహ్ రాణా 1-0-15-0.

బిజినెస్

హైదరాబాద్‌లో యాపిల్ స్టోర్

- సిబ్బంది నియామకాల ప్రక్రియ షురూ

హైదరాబాద్: ఐఫోన్ల తయారీ దిగ్గజం యాపిల్.. హైదరాబాద్‌లోనూ రిటైల్ విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతోంది. ఈ స్టోర్‌లో పనిచేసేందుకు అవసరమైన సిబ్బంది నియామక ప్రక్రియను ప్రారంభించింది. ఇందుకోసం కంపెనీ తాజాగా జాబ్ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. టెక్నికల్ స్పెషలిస్టులు, బిజినెస్ ఎక్స్‌పర్ట్స్, ఆపరేషన్ ఎక్స్‌పర్ట్స్‌తో పాటు ఫుల్ టైం, పార్ట్ టైం మరియు టెంపరరీ ఎక్స్‌పర్ట్స్, మేనేజర్స్‌గా పనిచేసేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. యాపిల్.. భారత్‌లో తొలి రిటైల్ స్టోర్‌ను 2023లో ముంబైలో ప్రారంభించింది.

తగ్గిన ఎన్‌సీసీ లాభం

ఎన్‌సీసీ లిమిటెడ్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.4,900 కోట్ల టర్నోవర్‌పై రూ.122.46 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో టర్నోవర్ రూ.5,382.86 కోట్లుగా ఉండగా లాభం రూ.193.18 కోట్లుగా ఉంది. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన నికర లాభం రూ.185.27 కోట్ల నుంచి రూ.82.01 కోట్లకు తగ్గింది. మొత్తం టర్నోవర్ రూ.4,719.87 కోట్ల నుంచి రూ.4,082.27 కోట్లకు తగ్గింది.

స్టాండర్డ్ ఇంజనీరింగ్ లాభంలో 28% వృద్ధి

స్టాండర్డ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ లిమిటెడ్ (గతంలో స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్).. డిసెంబరుతో ముగిసిన త్రైమాసిక నికర లాభం 28.3 శాతం వృద్ధి చెంది రూ.20 కోట్లుగా నమోదైంది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా 37.1 శాతం వృద్ధితో రూ.196 కోట్లకు చేరుకుంది. ఈ కాలంలో గ్లాస్ లైనింగ్ వ్యాపారం పెరగటంతో పాటు ఆశించిన స్థాయిలో వృద్ధిని కనబరచటం కలిసి వచ్చిందని పేర్కొంది.

నవ లిమిటెడ్ ఆదాయం రూ.1,061 కోట్లు

నవ లిమిటెడ్ డిసెంబరుతో ముగిసిన త్రైమాసింలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,061.50 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.325.70 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం 7.8 శాతం (రూ.353.30 కోట్లు) క్షీణించగా ఆదాయం మాత్రం 20.9 శాతం (రూ.878.10 కోట్లు) వృద్ధి చెందింది. స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన కంపెనీ రూ.499.70 కోట్ల రెవెన్యూపై రూ.135.30 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది.

రూ.100 కోట్ల టర్నోవర్ లక్ష్యం: అభి ఎగ్స్

అభి ఫుడ్స్ ఎగ్ బ్రాండ్.. అభి ఎగ్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గడచిన ఆర్థిక సంవత్సరం (2024-25)లో కంపెనీ టర్నోవర్ రూ.47.47 కోట్లుగా ఉందని కార్యకలాపాల విస్తరణ, కొత్త మార్కెట్లలోకి ప్రవేశించటం ద్వారా నిర్దేశిత లక్ష్యాన్ని అందుకోవచ్చని భావిస్తున్నట్లు అభి ఎగ్స్ సహ వ్యవస్థాపకుడు ఎస్‌వీవీ దొరా రెడ్డి తెలిపారు. అలాగే పశ్చిమాసియా, ఆగ్నేయాసియా దేశాలకు కార్యకాపాలను విస్తరించాలని చూస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని రావులపాలెంలోని పౌల్ట్రీ ఫామ్స్‌లో ప్రత్యేక పోషక విలువలున్న గుడ్లను ఉత్పత్తి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం కంపెనీ రోజువారీ గుడ్ల ఉత్పత్తి సామర్థ్యం 18-20 లక్షలుగా ఉందని వివరించారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్)

ఈ ఏడాది వేతన పెంపు 12 శాతం!



- కోలుకుంటున్న ఉద్యోగ మార్కెట్
- ప్రారంభమైన 'జీతాల' స్థిరీకరణ
- మైఖేల్ పేజ్ ఇండియా నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో కొలువుల మార్కెట్ క్రమంగా కోలుకుంటోంది. దీంతో ఉద్యోగాల జీతాల్లోనూ స్థిరీకరణ ప్రారంభమైంది. ఈ సంవత్సరం అన్ని రంగాల్లో ఉద్యోగుల జీతాల పెంపు సగటున 8 నుంచి 12 శాతం వరకు ఉండే అవకాశం ఉందని కంపెనీలకు నియామకాల సేవలందించే మైఖేల్ పేజ్ ఇండియా ఒక నివేదికలో తెలిపింది. సరికొత్త నైపుణ్యాలు ఉన్న వృత్తి నిపుణులు, టెకీలు ఉద్యోగాలు మారితే కొత్త కంపెనీలు 30 శాతం వరకు అధిక జీతాలు ఆఫర్ చేస్తున్నట్టు 'ది శాలరీ గైడ్- 2026' పేరుతో విడుదల చేసిన ఒక నివేదికలో తెలిపింది. సరికొత్త టెక్ నైపుణ్యాలతో పాటు నాయకత్వ స్థానాల్లో ఉన్న చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్లు (సీఎఫ్‌ఓ), చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్లు (సీటీఓ), హెడ్స్ ఆఫ్ ఇంజనీరింగ్ ఉద్యోగులను కంపెనీలు ప్రస్తుతం ఎగరేసుకుపోతున్నాయని పేర్కొంది.

ట్రెండ్ మార్చిన కంపెనీలు

కంపెనీలు గతంలోలా మూకుమ్మడి నియామకాలపై ఆసక్తి చూపడం లేదు. తమ వృద్ధికి బాటలు వేసే సామర్థ్యం ఉన్న నైపుణ్యాలు ఉన్న ఉద్యోగులను మాత్రమే ఏరికోరి తీసుకుంటున్నాయి. ఇందుకోసం అభ్యర్థుల్లో ప్రత్యేక నైపుణ్యాలతో పాటు నాయకత్వ లక్షణాలు, వారికి ఉద్యోగాలు ఇస్తే దీర్ఘకాలంలో కంపెనీకి విలువ జోడించగలరా? లేదా? అని చూస్తున్నట్టు మైఖేల్ పేజ్ ఇండియా సీనియర్ ఎండీ నిలయ్ ఖండేల్వాల్ చెప్పారు. అంతర్జాతీయ అనిశ్చితి కూడా కంపెనీల నియామకాలను ప్రభావితం చేస్తోంది. అయితే పెరుగుతున్న దేశీయ వినియోగంతో కంపెనీలు ప్రత్యేక నైపుణ్యాలు ఉన్న నిపుణుల నియామకాలు చేపడుతున్నాయి.

కాంట్రాక్టు నియామకాలు

కంపెనీలు గతంలోలా పర్మినెంట్ ఉద్యోగుల నియామకాలకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఐటీ కంపెనీల్లో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రాజెక్టు అవసరాలకు అనుగుణంగా నియమిత కాలానికి అవసరమైన నైపుణ్యాలు ఉన్న ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలో తీసుకుని పని పూర్తి చేస్తున్నాయి. పర్మినెంట్ ఉద్యోగులతో పోలిస్తే వీరికి 30 నుంచి 40 శాతం వరక అధిక జీతాలు చెల్లిందుకు సైతం వెనకాడడం లేదు. దీంతో సాఫ్ట్‌వేర్, డేటా, డిజిటల్ డిజైన్ నిపుణులకు మంచి డిమాండ్ ఏర్పడింది.

జీసీసీ ప్రాధాన్యత

ప్రస్తుతం దేశీయ నియామకాల్లో జీసీసీలు కీలకంగా మారాయి. అనేక అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు మన దేశంలో తమ జీసీసీలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తున్నాయి. ఐటీ కంపెనీలతో పోలిస్తే ఈ సంస్థలు టెకీలకు 20 నుంచి 25 శాతం అధిక జీతాలు ఆఫర్ చేయడంతో చాలా మంది టెకీలు జీసీసీల వైపు మొగ్గు చూపుతున్నారు.


ఎల్ఐసీ లాభం రూ.12,958 కోట్లు

న్యూఢిల్లీ: భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ).. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికం (క్యూ3)లో రూ.12,958 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.11,056 కోట్లతో పోల్చితే లాభం 17% పెరిగింది. సమీక్షా త్రైమాసికంలో ఎల్ఐసీ ప్రీమియం ఆదాయం రూ.1,06,891 కోట్ల నుంచి రూ.1,25,613 కోట్లకు పెరిగింది. కాగా సంస్థ ఆర్జించిన మొత్తం ఆదాయం రూ.2,33,984 కోట్లుగా ఉంది. అలాగే సంస్థ తమ ఏజెంట్లకు రూ.6,011 కోట్లు కమీషన్‌గా చెల్లించింది. కొత్త ప్రీమియం ఆదాయం రూ.10,605 కోట్లుగా ఉంది. కాగా బీమా మార్కెట్లో ఎల్ఐసీ వాటా డిసెంబరు చివరి నాటికి 57.07% ఉంది.

ఎయిర్‌టెల్ లాభంలో 55% క్షీణత

నెట్‌వర్క్ నిర్వహణ వ్యయాలు భారం కావడం, చట్టపరమైన ఫీజులు, సిబ్బంది వ్యయాలు డిసెంబరు త్రైమాసికంలో భారతి ఎయిర్‌టెల్ కన్సాలిడేటెడ్ లాభం ఏకంగా 55% క్షీణించి రూ.6,630.5 కోట్లకు పరిమితమైంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.14,781.2 కోట్లుంది. డిసెంబరు త్రైమాసికంలో లైసెన్స్ ఫీజులు, స్పెక్ట్రమ్ చార్జీల రూపంలో రూ.3,846 కోట్లు చెల్లించినట్టు కంపెనీ తెలిపింది. ఉద్యోగులపై వ్యయం కూడా 21% పెరిగి రూ.1,958 కోట్లకు చేరింది. క్యూ3లో కంపెనీ ఆదాయం 19.6% పెరిగి రూ.53,982 కోట్లుగా నమోదైంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



6వ తేదీ			
హైదరాబాద్	490	విజయవాడ	505
వరంగల్	492	గోదావరి	480
చిత్తూరు	563	విశాఖపట్నం	490
		డజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	135	విజయవాడ	133
వరంగల్	135	గుంటూరు	133
కరీంనగర్	135	ఒంగోలు	133
మహబూబ్‌నగర్	135	చిత్తూరు	112
కర్నూలు	135	నెల్లూరు	117
విశాఖపట్నం	125	అనంతపురం	117
గోదావరి	133		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,54,420 ▼	1,41,550 ▼	2,80,000 ▼
విజయవాడ	1,56,000 ▼	1,44,000 ▼	2,60,000 ▼
విశాఖపట్నం	1,57,685 ▼	1,41,550 ▼	3,00,000 ▼
రాజమండ్రి	1,54,420 ▼	1,41,550 ▼	2,68,000 ▼
ప్రొద్దుటూరు	1,60,500 ▼	1,47,660 ▼	2,65,000 ▼
ముంబై	1,52,502 ▼	1,39,692 ▼	2,54,339 ▼

మూడు రోజుల ర్యాలీకి బ్రేక్

సెన్సెక్స్ 504 పాయింట్లు డౌన్

ముంబై: స్టాక్ మార్కెట్లో మూడు రోజుల వరుస ర్యాలీకి తెర పడింది. ప్రామాణిక సూచీలు గురువారం భారీ నష్టాలను చవిచూశాయి. ఒక దశలో 666 పాయింట్లకు పైగా క్షీణించి 83,151 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసిన సెన్సెక్స్.. చివరికి 503.76 పాయింట్ల నష్టంతో 83,313.93 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 133.20 పాయింట్లు కోల్పోయి 25,642.80 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవడం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలతో పాటు వారాంతంలో ఆర్‌బీఐ పరపతి సమీక్ష నిర్ణయాలను ప్రకటించనున్న నేపథ్యంలో మదుపరులు అప్రమత్తమై విక్రయాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 13 పైసలు బలపడి రూ.90.34 వద్ద స్థిరపడింది.

సిల్వర్ మళ్లీ క్రాష్



- ఒక్కరోజులో రూ.30,300 పతనమై రూ.2.68 లక్షలకు తగ్గిన కిలో వెండి
- రూ.1.60 లక్షలకు దిగొచ్చిన బంగారం

న్యూఢిల్లీ: వరుసగా రెండు రోజుల పాటు పెరుగుతూ వచ్చిన విలువైన లోహాల ధరలు గురువారం భారీగా తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్లో ట్రెండ్‌కు అనుగుణంగా దేశీయంగా ఢిల్లీ మార్కెట్లో కిలో వెండి ధర ఒక్కరోజే రూ.30,300 (10.16 శాతం) తగ్గి రూ.2,68,000కు జారుకుంది. 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాముల రేటు రూ.4,500 (దాదాపు 3 శాతం) తగ్గుదలతో రూ.1,60,600కు దిగివచ్చింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లోనూ సిల్వర్ ఫ్యూచర్స్ మార్చి కాంట్రాక్టు ధర రూ.26,850 (10 శాతం) తగ్గి రూ.2,42,000కు జారుకోగా.. గోల్డ్ ఫ్యూచర్స్ ఏప్రిల్ కాంట్రాక్టు రేటు రూ.2,310 (1.51 శాతం) తగ్గుదలతో రూ.1,50,736గా నమోదైంది. అగ్రరాజ్య కరెన్సీ డాలర్ మళ్లీ బలపడటం, ప్రామాణిక వడ్డీ రేట్లపై ఫెడరల్ రిజర్వ్ కఠిన వైఖరితో పాటు అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో ప్రతికూలతల్లో భద్రమైన పెట్టుబడి సాధనంగా పేరున్న విలువైన లోహాలకు గిరాకీ తగ్గింది. దాంతో అంతర్జాతీయ మార్కెట్లో వీటి ధరలు 13 శాతం వరకు క్షీణించాయి. ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 137.32 డాలర్లు (2.77 శాతం) తగ్గి రూ.4,827 డాలర్లకు జారుకోగా.. సిల్వర్ 11.94 డాలర్లు (13.54 శాతం) పతనమై 76.26 డాలర్లకు దిగివచ్చింది.

బిట్‌కాయిన్ 70,000 డాలర్ల దిగువకు..

ప్రపంచ ప్రముఖ క్రిప్టోకరెన్సీ బిట్‌కాయిన్ విలువ 2024 నవంబరు తర్వాత తొలిసారిగా 70,000 డాలర్లకు దిగువకు పతనమైంది. అంతర్జాతీయ మార్కెట్లో గురువారం ఒక దశలో 11 శాతం క్షీణించి 67,245 డాలర్లకు జారుకుంది. అమ్మకాల ట్రెండ్ కొనసాగితే, మున్ముందు బిట్‌కాయిన్ 60,000 డాలర్లకు జారుకోవచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఆర్థిక అనిశ్చితుల్లో పెట్టుబడులకు భద్రమైన సాధనంగా పేరున్న బంగారంతో పాటు సంప్రదాయ కరెన్సీకి ప్రత్యామ్నాయంగా ఎదిగిన ఈ డిజిటల్ కరెన్సీ విలువ గత ఏడాది అక్టోబరులో ఆల్‌టైం గరిష్ఠ స్థాయి 1.26 లక్షల డాలర్లకు ఎగబాకింది. అయితే, గత కొంతకాలంగా బిట్‌కాయిన్ సహా ఇతర క్రిప్టోల విలువ వేగంగా తగ్గుతూ వస్తోంది. వాస్తవిక ప్రపంచంలో వీటి వినియోగంపై ఇన్వెస్టర్లు పునరాలోచనలో పడటం ఇందుకు కారణమని విశ్లేషకులు అంటున్నారు.

2040 నాటికి 700 గిగావాట్ల ఏసీసీ బ్యాటరీలకు డిమాండ్

ఐఈఎస్ఏ అంచనా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశంలో అడ్వాన్స్‌డ్ కెమిస్ట్రీ సెల్ (ఏసీసీ) బ్యాటరీల డిమాండ్ 2040 నాటికి 700 గిగావాట్లకు పెరగనుంది. ప్రస్తుత డిమాండ్ 28 జీడబ్ల్యూహెచ్ ఉంది. ఇండియా ఎనర్జీ స్టోరేజ్ అలయెన్స్ (ఐఈఎస్ఏ) గురువారం విడుదల చేసిన నివేదికలో ఈ విషయం ప్రకటించింది. హైదరాబాద్‌లో ఐఈఎస్ఏ రెండు రోజుల పాటు నిర్వహించిన ఇండియా బ్యాటరీ తయారీ, సరఫరా వ్యవస్థ శిఖరాగ్ర సదస్సులో (ఐబీఎంఎస్‌సీఎస్) ఈ నివేదిక విడుదల చేశారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించాలన్న లక్ష్యాన్ని చేరే ప్రయత్నంలో ఉన్న భారత్ తాను ప్రకటించిన వాతావరణ కట్టుబాట్లను నెరవేర్చాలంటే విద్యుత్ మొబిలిటీలోకి మారడం, భారీ ఎత్తున ఇంధన నిల్వ వసతులు అందుబాటులో ఉంచడం కీలకమని ఆ నివేదిక పేర్కొంది. ఈ సందర్భంగా పునరుత్పాతక ఇంధన మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి రాజేష్ కుల్హరి మాట్లాడుతూ.. బ్యాటరీ తయారీ, స్టోరేజి విభాగంలో భారీ ఎత్తున సహకార భాగస్వామ్యాలు ఏర్పడాల్సిన అవసరం ఉన్నదన్నారు. కాగా తెలంగాణ ప్రభుత్వం బ్యాటరీ ఉత్పత్తిదారులు, ఇన్వెస్టర్లకు ప్రోత్సాహకరమైన వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నదని తెలంగాణ ఐటీఈసీ డైరెక్టర్ ఎస్‌కే శర్మ అన్నారు. చైనా, జపాన్, కొరియా, ఫిన్లాండ్, ఆస్ట్రేలియా, జర్మనీ, అమెరికా ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆ ఇద్దరికీ ముందస్తు బెయిల్ ఇవ్వొద్దు

- వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌కు దర్యాప్తు సంస్థ సహకరిస్తోంది
- మద్యం కుంభకోణం కేసులో చెవిరెడ్డి, థర్డ్ పార్టీ అనుబంధ పిటిషన్ల విచారణార్హతపై ముగిసిన వాదనలు

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం నిందితులు ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ పూర్వ ఎండీ వాసుదేవరెడ్డి, ఎక్సైజ్ శాఖ ప్రత్యేక అధికారి దొడ్డా వెంకట సత్యప్రసాద్ ముందస్తు బెయిల్ పిటిషన్లు తిరస్కరించాలని కోరుతూ సహ నిందితుడు వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, థర్డ్ పార్టీ సువర్ణరాజు దాఖలు చేసిన అనుబంధ పిటిషన్ల విచారణార్హతపై హైకోర్టులో వాదనలు ముగిశాయి. రాతపూర్వక వాదనలు సమర్పించేందుకు వీలుగా విచారణను ఫిబ్రవరి 9కి వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. మద్యం కుంభకోణం కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ నిందితులు వాసుదేవరెడ్డి(ఏ2), సత్యప్రసాద్(ఏ3) వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. అప్రూవర్లుగా మారతామంటూ ముందస్తు బెయిల్ అభ్యర్థిస్తున్నారని, వారికి బెయిల్ మంజూరు చేయవద్దని సహ నిందితుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి(ఏ38), థర్డ్ పార్టీ సువర్ణరాజు అనుబంధ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు గురువారం విచారణకు రాగా వాసుదేవరెడ్డి, వెంకట సత్యప్రసాద్ తరపు సీనియర్ న్యాయవాది కె.పరమేశ్వర్ జోక్యం చేసుకుంటూ థర్డ్ పార్టీ, సహనిందితుడు వేసిన అనుబంధ పిటిషన్లకు విచారణార్హత లేదని అన్నారు. ముందుగా అనుబంధ పిటిషన్లపై వాదన విని నిర్ణయం వెల్లడించిన తరువాత ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణ జరపాలని కోరారు. చెవిరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దవే వాదిస్తూ... వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌కు దర్యాప్తు సంస్థ సహకరిస్తోందని, వీరికి క్షమాభిక్ష ప్రసాదించేందుకు ప్రభుత్వం, సీఐడీ అనుకూలంగా ఉన్నాయని వివరించారు. సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు.

రిమాండ్ ఉత్తర్వులు రద్దు చేయండి

- హైకోర్టులో వైసీపీ నేత అంబటి పిటిషన్

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో గుంటూరు కోర్టు ఇచ్చిన రిమాండ్ ఉత్తర్వులతో పాటు నల్లపాడు పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ వైసీపీ నేత అంబటి రాంబాబు దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. ఫిర్యాదుదారుడు పిల్లి మాణిక్యరావుకు నోటీసులు జారీ చేసింది. కేసుకి సంబంధించి పూర్తి వివరాలు సమర్పించాలని నల్లపాడు పోలీసులను ఆదేశించింది. విచారణను ఫిబ్రవరి 11కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాంబాబు తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు.

నోటీసులు ఇచ్చి.. వివరణ తీసుకోండి

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారాన్ని పక్కదారి పట్టించేలా, కులమతాల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేలా మాట్లాడిన వైసీపీ నేతలు విడదల రజని, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మరికొందరికి బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్లపై నమోదు చేసిన సెక్షన్లు అన్నీ ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నవేనని గుర్తుచేసింది. అదేవిధంగా లైంగిక వేధింపుల ఆరోపణలతో తనపై నమోదుచేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్‌పై నమోదైన సెక్షన్లు ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నవే అయినందున బీఎన్ఎస్ఎస్ 35(3) ప్రకారం నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ఉత్తర్వులు ఇచ్చారు. పిటిషనర్ తరఫున న్యాయవాది టి.నాగార్జునరెడ్డి వాదనలు వినిపించారు.

నకిలీ నెయ్యి కేసులో చిన్నప్పన్నకు బెయిల్

కఠిన షరతులతో మంజూరు చేసిన హైకోర్టు

- ఆస్తుల వివరాలతో అఫిడవిట్ దాఖలుకు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి నకిలీ నెయ్యి సరఫరా చేసిన కేసులో వైసీపీ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మాజీ పీఏ చిన్నప్పన్నకు హైకోర్టు కఠిన షరతులతో బెయిల్ మంజూరు చేసింది. రూ.లక్ష విలువైన రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. విచారణ కోర్టు వద్ద పాస్‌పోర్టు జమచేయాలని, ఆ కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లడానికి వీల్లేదని స్పష్టం చేసింది. దర్యాప్తు అధికారికి సమాచారం ఇవ్వకుండా రాష్ట్ర సరిహద్దులు దాటి వెళ్లడానికి వీల్లేదంది. దర్యాప్తు అధికారి కోరినప్పుడు హాజరుకావాలని, విచారణకు సహకరించాలని పేర్కొంది. నిందితులు సమాచారం ఇచ్చేందుకు వీలుగా వాట్సాప్ నెంబర్ ఇవ్వాలని దర్యాప్తు సంస్థను ఆదేశించింది. 'ప్రత్యక్షంగా, పరోక్షంగా సాక్ష్యాలను తారుమారు చేయడానికి వీల్లేదు. సాక్షులను బెదిరించడం, లోబర్చుకోవడం, ప్రభావితం చేయడానికి వీల్లేదు. విచారణ సమయంలో తప్ప, ఏ సందర్భంలోనూ సాక్షులను, సహచర నిందితులను సంప్రదించకూడదు. బెయిల్‌పై విడుదలైన రెండువారాల్లో వ్యక్తిగతంగా, ఉమ్మడిగా తమకు ఉన్న స్థిర-చరాస్థులు, బ్యాంక్ ఖాతాలు, డిమాట్ అకౌంట్, వ్యాపార ప్రయోజనాలకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తూ ట్రయల్ కోర్టులో అఫిడవిట్ దాఖలు చేయాలి. విచారణ ముగిసేవరకు కేసుకు సంబంధించిన వివరాలను ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో వెల్లడించడానికి, ప్రచురించడానికి వీల్లేదు. నిందితులు వెల్లడించిన, ప్రాసిక్యూషన్ గుర్తించిన ఆస్తులను ట్రయల్ కోర్టు ముందస్తు అనుమతి లేకుండా విక్రయించడం, తనఖా పెట్టడం, వాటిపై థర్డ్‌పార్టీకి ఎటువంటి హక్కులు కల్పించడానికి వీల్లేదు. దర్యాప్తు సంస్థకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా నేరంతో సంబంధం ఉన్న కంపెనీలు, సంస్థలు, బ్యాంక్ ఖాతాలను నిందితులు నిర్వహించడానికి వీల్లేదు. దర్యాప్తు అధికారికి ఫోన్‌నెంబర్ అందజేయాలి. ఫోన్‌లో అందుబాటులో ఉండాలి. ఫోన్ నెంబర్ మారిస్తే వెంటనే దర్యాప్తు అధికారికి తెలియపర్చాలి. కోర్టు తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు ప్రతి శనివారం ఉదయం 10నుంచి సాయంత్రం 5 మధ్య దర్యాప్తు అధికారి ముందు హాజరుకావాలి' అని కోర్టు స్పష్టం చేసింది. నిందితుడు షరతులను ఉల్లంఘించినట్లైతే బెయిల్ రద్దు కోసం కోర్టును ఆశ్రయించేందుకు ప్రాసిక్యూషన్‌కు స్వేచ్ఛనిచ్చింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ఉత్తర్వులు ఇచ్చారు. తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ చిన్నప్పన్న దాఖలు చేసిన పిటిషన్‌పై ఇటీవల వాదనలు ముగియడంతో తీర్పు రిజర్వ్ చేసిన న్యాయమూర్తి గురువారం నిర్ణయాన్ని వెల్లడించారు. 'దర్యాప్తు కీలక దశలో ఉందనే కారణంతో గతంలో ఓ బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించాం. ఆ తర్వాత దర్యాప్తు పూర్తి అయ్యి, చార్జ్‌షీట్ దాఖలు చేశారు. పిటిషనర్‌ను మరింత కాలం కస్టడీలో ఉంచి విచారించాల్సిన అవసరం లేదని భావిస్తున్నాం. పిటిషనర్‌పై మోపిన ఆరోపణల తీవ్రత, సాక్షులనుప్రభావితం చేస్తారన్న ప్రాసిక్యూషన్ ఆందోళనను పరిగణనలోకి తీసుకొని కఠిన షరతులతో బెయిల్ మంజూరు చేస్తున్నాం' అని పేర్కొన్నారు.

వివేకా హత్య కేసు దర్యాప్తు..
నెల గడువుతో విచారణపై ప్రభావం

- సీబీఐ వీలైనంత త్వరగా పూర్తిచేయాలి
- సునీతారెడ్డి అభ్యర్థనలు స్వీకరించాలి: సుప్రీం
- ఎవరిని విచారించాలో సీబీఐకి పూర్తి స్వేచ్ఛ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తు ప్రక్రియపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. నెలరోజులంటూ గడువుపెడితే దర్యాప్తుపై ప్రభావం పడే అవకాశముందని అభిప్రాయపడింది. అందుకే.. ట్రయల్ కోర్టు ఆదేశాల ప్రకారం నెల రోజుల్లో కాక.. వీలైనంత త్వరగా దర్యాప్తు పూర్తిచేయాలని సీబీఐని ఆదేశించింది. నిందితులు దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, గజ్జల ఉదయ్‌కుమార్ రెడ్డి, యాదాటి సునీల్ యాదవ్, టి.గంగిరెడ్డిలకు కింది కోర్టులు ఇచ్చిన బెయిళ్లను రద్దు చేయాలని వివేకా కుమార్తె సునీతారెడ్డి, సీబీఐ దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లు గురువారం న్యాయస్థానం ముందుకొచ్చాయి. కేసులో అన్ని కుట్ర కోణాలను వెలికితీసేంత వరకూ సీబీఐ దర్యాప్తు జరిపేలా ఆదేశించాలని సునీత కోరగా.. హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టు నిరాకరించింది. కేవలం ఇద్దరి పాత్రను వెలికితీసేంత వరకే దర్యాప్తు జరపాలని ఆదేశించింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ సునీత దాఖలు చేసిన పిటిషన్ సైతం విచారణకు వచ్చింది. అన్ని పిటిషన్లను కలిపి జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. సునీత తరఫు సీనియర్‌న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. సీబీఐ దర్యాప్తు పరిధిని ప్రత్యేక కోర్టు కుదించడం సరికాదన్నారు. కేవలం నిర్దిష్ట అంశంపైనే దర్యాప్తు చేయాలని సీబీఐని ఆదేశించడం వల్ల వాస్తవాలు వెలుగులోకి రాకుండా దర్యాప్తు ముగిసే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. సీబీఐ కోర్టు ఆదేశాలతో కేసులోని ఇతర కుట్ర కోణాలు, కీలక కుట్రదారులు బయటకు వచ్చే అవకాశం లేకుండా పోతుందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అందుకే సీబీఐ కోర్టు ఆదేశాలను సవాల్ చేశామని తెలిపారు. కాగా.. సీబీఐ తరఫు న్యాయవాది కలుగజేసుకుని.. ఇప్పటికే ప్రధాన దర్యాప్తు ముగిసిందని, ట్రయల్ కోర్టు ఆదేశాల మేరకు అదనపు విచారణ నిర్వహిస్తున్నామన్నారు. తుదిదశలో ఉన్న క్రమంలో మళ్లీ అభ్యంతరాలు లేవనెత్తితే కేసును మరింత సమయం సాగదీయడమే అవుతుందని తెలిపారు.

దర్యాప్తు పేరుతో సాగదీసే కుట్ర: నిందితులు

దర్యాప్తు పేరుతో కేసును సాగదీసే కుట్ర జరుగుతోందని నిందితుల తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. తమ క్లయింట్లకు బెయిల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దర్యాప్తు కీలక దశలో ఉందని, అన్ని కోణాలను పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం తేల్చిచెప్పింది. ప్రతి పిటిషన్‌పై మినీ ట్రయల్ నిర్వహించలేమని స్పష్టం చేసింది. ఇలాంటి విజ్ఞప్తులను అనుమతిస్తూ పోతే ఈ కేసుకు అంతుండదని తెలిపింది. ఇలాగే పిటిషన్లపై విచారిస్తుంటే దర్యాప్తు ముగియడానికి మరో నాలుగేళ్లు పట్టే అవకాశం ఉందని వ్యాఖ్యానించింది.

అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తేనే వాస్తవాలు వెలుగులోకి: ధర్మాసనం

సునీత తరఫున రెండు కీలక అభ్యర్థనలు ఉన్నాయని.. వాటిని స్వీకరించేలా సీబీఐని ఆదేశించాలని లూథ్రా విజ్ఞప్తి చేశారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ఆమె అభ్యర్థనలు స్వీకరించాలని సీబీఐని ఆదేశించింది. అలాగే ట్రయల్ కోర్టు ఇచ్చిన నెలరోజుల గడువుతో కేసు దర్యాప్తుపై ప్రభావం పడుతుందని.. కొత్త నిజాలు తెలిసినప్పుడు గడువు ముగిసిందనే కారణంతో నిరాకరించలేం కదా అని ప్రశ్నించింది. సీబీఐకి ఉన్న స్వేచ్ఛను దెబ్బతీయలేమని, దానికి ఎవరినైనా విచారించే స్వేచ్ఛ ఉంటుందని జస్టిస్ సుందరేశ్ గుర్తుచేశారు. దర్యాప్తుపై నిర్ణీత గడువు విధించడాన్ని లూథ్రా మరోసారి ప్రస్తావిస్తుండగా.. ముందు దర్యాప్తు జరగనివ్వాలని.. ఆ తర్వాత ఏం చేయాలో ఆలోచిద్దామని న్యాయమూర్తి తెలిపారు. ట్రయల్ కోర్టు ఆదేశాల మేరకే సీబీఐ తన దర్యాప్తును కొనసాగించవచ్చని.. ఎవరిని విచారించాలి.. ఎవరిని అదుపులోకి తీసుకోవాలపై కలుగజేసుకోలేమని, ధర్మాసనం తేల్చిచెప్పింది. అది పూర్తిగా సీబీఐ విచక్షణకు సంబంధించిన అంశమని స్పష్టతనిచ్చింది. ట్రయల్ కోర్టు పర్యవేక్షణలో విచారణ వేగంగా జరగడమే ముఖ్యమని.. అధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అభిప్రాయపడింది. వీలైనంతత్వరగా దర్యాప్తు పూర్తి చేయాలని సీబీఐని ఆదేశించింది. దర్యాప్తులో పురోగతిని బట్టి.. సునీత అభ్యర్థనలు, నిందితులు సమర్పించే అదనపు మెటీరియల్‌ను పరిగణనలోకి తీసుకుని తదుపరి నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను మార్చి 11వ తేదీకి వాయిదా వేసింది.

నకిలీ మద్యం నిందితుల రిమాండ్ పొడిగింపు

- ఐదుగురికి 19 వరకు పొడిగించిన కోర్టు

విజయవాడ/ములకలచెరువు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న ఐదుగురు నిందితులకు కోర్టు రిమాండ్‌ను పొడిగించింది. విజయవాడ, నెల్లూరు జైళ్లలో ఉన్న తలారి రంగయ్య (ఏ14), టి.రమేష్(ఏ15), దారబోయిన ప్రసాద్ (ఏ23), జినేష్(ఏ24), షిబు(ఏ24)ను అధికారులు గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విజయవాడ ఆరో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయాధికారి ముందు హాజరుపరిచారు. దీంతో వారికి ఈ నెల 19 వరకు రిమాండ్ పొడిగించారు. నకిలీ మద్యం కేసులో షరతులను ఉల్లంఘించిన మాజీ మంత్రి జోగి రమేష్, అతని తమ్ముడు జోగి రాముల బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ శుక్రవారానికి వాయిదా పడింది. దీనిపై విజయవాడ ఎనిమిదో అదనపు జిల్లా కోర్టులో గురువారం విచారణ జరిగింది. కాగా, నకిలీ మద్యం కేసులో మధ్యంతర బెయిల్‌పై బయటకు వచ్చిన నిందితుడు సుదర్శన్ గురువారం కోర్టులో లొంగిపోయాడు. కాగా, ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు స్నేహితుడు, హైదరాబాద్‌కు చెందిన నకిరికంటి రవి(ఏ16)కి తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం కేసులోనూ అతడు నిందితుడిగా ఉండటంతో జైలు నుంచి బయటకు రాలేని పరిస్థితి ఉంది.

పోలీసు కుటుంబాలకు అండగా ప్రభుత్వం: డీజీపీ

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలుస్తుందని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా చెప్పారు. విధుల్లోఉంటూ ప్రాణాలు కోల్పోయిన పోలీసు కుటుంబాలకు చెక్కుల రూపంలో ఆయన సాయం అందజేశారు. బాపట్ల ఇంటెలిజెన్స్‌లో హెడ్ కానిస్టేబుల్ కీర్తి వెంకటరాజు కుటుంబ సభ్యులకు రూ.1.11కోట్లు, అనంతపురం జిల్లా ట్రాఫిక్ వింగ్ కానిస్టేబుల్ సతీష్‌కుమార్ కుటుంబానికి రూ.20.65లక్షలు, ప్రకాశం జిల్లా ఆర్మ్‌డ్ పోలీస్ కానిస్టేబుల్ ఎం.నిరీక్షణ బాబు కుటుంబానికి రూ.20.37లక్షలు, నంద్యాలలో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ ఎం.నగేష్ కుటుంబానికి రూ.20.45లక్షలు, పల్నాడు జిల్లా ఇంటెలిజెన్స్ డీఎస్పీ కార్యాలయ హోంగార్డు కుటుంబానికి రూ.10.35లక్షలు అందజేశారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

విజయ్.. రష్మిక పెళ్లి 26న?



విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న పెళ్లి ఎప్పుడెప్పుడా అని అభిమానులు ఎదురుచూస్తున్నారు. మరోవైపు, వీరి వివాహం జరిగే తేదీ ఇదే అంటూ సోషల్‌మీడియాలో విస్తృత ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే.. ఈ నెల 26న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో కేవలం బంధువులు, అతి కొద్ది మంది సన్నిహితుల సమక్షంలో వీరి వివాహం జరగనుందని తెలిసింది. మార్చి మొదటి వారంలో హైదరాబాద్‌లో వీరి పెళ్లి విందు ఉంటుందని తెలిసింది. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్'లతో ప్రేక్షకులను అలరించారు విజయ్ దేవరకొండ, రష్మిక. ప్రస్తుతం రాహుల్ సాంక్రిత్యాన్ తెరకెక్కిస్తున్న 'రణ బాలి' చిత్రంలో మూడోసారి కలసి నటిస్తున్నారు.

గుంజి గుంజి పాటపై వివాదం.. నటుడు, దర్శకనిర్మాతల వివరణ



నటుడు చంద్రహాస్ ప్రధాన పాత్రలో నటించిన 'బరాబర్ ప్రేమిస్తా' ప్రీ రిలీజ్ వేడుకలో ఆయన పాడిన 'గుంజి.. గుంజి' పాట వివాదాస్పదమైంది. చాలా అసభ్యకరంగా ఉందంటూ సోషల్ మీడియాలో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఓ మీడియా ప్రతినిధి చంద్రహాస్‌ను విమర్శిస్తూ ఓ వీడియో పోస్ట్ చేశారు. అది చూసి చంద్రహాస్ ఆ వీడియో ప్రతినిధికి వార్నింగ్ ఇచ్చారు. చివరకు విషయం పోలీసుల దాకా వెళ్లగా వారు చంద్రహాస్‌పై కేసు నమోదు చేశారు. తాజాగా ఈ వివాదంపై నిర్మాత గాయత్రి చిన్ని, దర్శకుడు సంపత్ రుద్ర స్పందిస్తూ 'సినిమాలో తన పాత్ర గురించి చెప్పే ఉద్దేశంతో చంద్రహాస్ ఆ పాట పాడారు. ఆ ప్రయత్నంలో చిన్న పొరపాటు జరిగింది. సినిమాలో అలాంటి పాటలు లేవు' అని స్పష్టం చేశారు. చివరకు ఈ విషయంపై నటుడు చంద్రహాస్ కూడా స్పందించారు. 'ఇది ఎవరినీ ఉద్దేశించి పాడినది కాదు. హీరో జోలికొస్తే అతను ఎలా స్పందిస్తాడనేది అందులో ఉంటుంది. ఈ పాటను ఇప్పటికే విడుదల చేశాం. ఇది కేవలం ప్రచారం కోసం చేసిన ప్రయత్నం. ఇది సినిమాలో లేదు. నిజం చెప్పాలంటే ఆ పాటలో అంత అసభ్యత లేదు. అందులో మహిళల్ని కించపరిచేలా, అగౌరవపరిచేలా ఎలాంటి పదాలు లేవు. ఎన్నో సినిమాల్లో ఇలాంటి పదాలు ఉన్నాయి. ఇంతకు మించిన బూతు పదాలు వాడిన చాలా సినిమాలు ఉన్నాయి. కేవలం దీనినే అంతగా హైలైట్ చేయాల్సిన అవసరం లేదని నేను నమ్ముతున్నాను' అని తెలిపారు.

కొత్తగా..

మాదాల వంశం నుంచి మూడో తరం



తెలుగు చిత్ర పరిశ్రమలో విప్లవ చిత్రాలకు ఒక మార్గం ఏర్పరచి, రెడ్‌స్టార్‌గా పేరొందిన నటుడు మాదాల రంగారావు. ఆయన తనయుడు మాదాల రవి 'నేను సైతం', 'మా ఇలవేల్పు', 'బ్రోకర్ 2', 'పంచముఖి' వంటి చిత్రాల్లో నటించారు. కొన్ని సినిమాలు నిర్మించారు. ఇప్పుడు ఆయన తనయుడు సన్నీ తాత, తండ్రి బాటలో నడవడానికి హీరోగా ఎంట్రీ ఇస్తున్నారు. సన్నీ నటిస్తున్న 'ఓ టార్చర్ ప్రేమ' చిత్రం టైటిల్ పోస్టర్‌ను రచయిత పరుచూరి గోపాలకృష్ణ విడుదల చేశారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ 'మాదాల వంశంలో మూడో తరం చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నందుకు ఆనందంగా ఉంది' అని అన్నారు. దర్శకనిర్మాత శ్రీకర్ కృష్ణ మాట్లాడుతూ 'ఇది ఒక మంచి ప్రేమ కథా చిత్రం. త్వరలో విడుదల చేస్తాం' అని చెప్పారు. మౌనిక డాకోజు హీరోయిన్‌గా నటించారు.

తగ్గింపు రేట్లతో 'సుమతీ శతకం'



అమర్దీప్ చౌదరి, శైలి చౌదరి జంటగా నటించిన 'సుమతీ శతకం' చిత్రం నేడు విడుదలవుతోంది. ఎం.ఎం.నాయుడు దర్శకత్వంలో సాయి సుధాకర్ కొమ్మాలపాటి నిర్మించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నిర్మాత సుధాకర్ మాట్లాడుతూ 'సినిమాపై మాకు పూర్తి నమ్మకం ఉంది. టికెట్ ధర అందరికీ అందుబాటులో ఉండాలని రేట్లు తగ్గించాం' అని తెలిపారు. తమ సినిమాను ఆదరించాలని హీరో అమర్దీప్ చౌదరి కోరారు. అందరి సహకారంతో మంచి సినిమా తీయగలిగానని నిర్మాత ఎం.ఎం.నాయుడు చెప్పారు.

ప్రేక్షకుల అభిరుచికి పెద్దపీట వేసే సినిమా



'ప్రేక్షకులను దేవుళ్లుగా భావించి, వారి సమయం, డబ్బు, విజ్ఞతకు విలువ ఇస్తూ, 'యుఫోరియా' చిత్రాన్ని తెరకెక్కించాను. ఈ సినిమా ఏ ఒక్కరి సమయాన్నీ వృథా చేయదు. ప్రేక్షకుల అభిరుచికి పెద్ద పీట వేసే సినిమా ఇది' అని దర్శకుడు గుణశేఖర్ అన్నారు. భూమికా చావ్లా, సారా అర్జున్, నాజర్ ముఖ్య పాత్రల్లో గుణశేఖర్ తెరకెక్కించిన చిత్రమిది. రాగిణి గుణ సమర్పణలో నీలిమ గుణ, యుక్తా గుణ నిర్మించారు. నేడు విడుదలవుతోంది. చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో భూమిక మాట్లాడుతూ 'ఇలాంటి సినిమాలు తీయడానికి చాలా ధైర్యం కావాలి. గుణశేఖర్ గారు, ఆయన కుటుంబం ఈ రిస్క్ తీసుకున్నారు. నా కెరీర్‌లో నటిగా నేర్చుకోవాల్సింది ఇంకా చాలా ఉందని ఈ సినిమా నేర్పింది' అని చెప్పారు. నీలిమ గుణ మాట్లాడుతూ 'ఇది కేవలం సందేశాత్మక చిత్రం మాత్రమే కాదు, ఒక కొత్త కథకు కమర్షియల్ హంగులు అద్ది తీసిన చిత్రమిది. తప్పకుండా ప్రేక్షకులను మెప్పిస్తుంది' అన్నారు.

శ్రీ చిదంబరం గెలవాలి



అందరూ పుడుతూనే సెలబ్రిటీలు అవ్వరు. ప్రతి ఒక్కరి జీవితంలో కష్టాలు, అనుభవాలు ఉంటాయి. నేను గాయకుణ్ణి అవ్వాలని ఇండస్ట్రీకి వచ్చాను. అది కష్టమని తెలిసి సంగీత దర్శకుడిగా మారాను. అవకాశం వచ్చినప్పుడు మంచి పాటలు పాడడం ద్వారా నా కోరిక తీర్చుకుంటున్నాను. 'శ్రీ చిదంబరం గారు' లాంటి మంచి చిత్రం కోసం ఓ చక్కటి పాట పాడగలిగినందుకు ఆనందంగా ఉంది. ఈ సినిమా బ్లాక్‌బస్టర్ అవ్వాలి. యంగ్ టీమ్ అంతా గెలవాలి' అని కీరవాణి ఆకాంక్షించారు. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట జంటగా వినయ్ రత్నం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'శ్రీ చిదంబరం'. చింతా వినీష రెడ్డి, చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మించారు. నేడు విడుదలవుతోంది. చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత మాట్లాడుతూ 'ఈ సినిమా టీమ్ క్రౌడ్ ఫండింగ్ కోసం తిరుగుతుంటే, కథ నచ్చి నేనే నిర్మాతగా మారాను' అని చెప్పారు. జీవితంలో చాలా కోల్పోయాం అని భావించేవాళ్లకు స్ఫూర్తినిచ్చే సినిమా ఇదని నిర్మాత వంశీ నందిపాటి అన్నారు.

రాష్ట్రంలో విధ్వంసానికి జగన్ యత్నం

▸▸ ఆయన చేసేవి పరామర్శలు కావు... ప్రదర్శనలు: మంత్రి అనిత



నక్కపల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): క్రిమినల్ ఆలోచనలతో రాష్ట్రంలో విధ్వంసం సృష్టించేందుకు జగన్ యత్నిస్తున్నారని హోం మంత్రి అనిత ఆరోపించారు. గురువారం అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల తో మాట్లాడారు. ఆయన బూతుల మంత్రిగా పేరు పొందాడు. అంబటి ఏమైనా స్వాతంత్ర్య సమరయోధుడా..! పరామర్శించడానికి జగన్ వెళ్లాడానికి? పవిత్రమైన తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో వైసీపీ పాలనలో కల్తీ జరిగిందనడానికి పూర్తి ఆధారాలు ఉన్నాయి. మహాపాపాలు చేసి, మళ్లీ మా ప్రభుత్వంపై బురదజల్లేందుకు యత్నిస్తున్నారు. జగన్ చేసేవన్నీ పరామర్శలు కాదు... ప్రదర్శనలు' అని ఎద్దేవా చేశారు.

సీమకు ఎవరేం చేశారో చర్చకు సిద్ధమా..!

▸▸ జగన్‌కు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సవాల్



అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్న ఐదేళ్లు రాయలసీమను నిర్లక్ష్యం చేసిన జగన్ నేడు దీక్షల పేరుతో డ్రామాలు ఆడితే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'జగన్... రాయలసీమకు ఎవరి హయాంలో ఏం చేశారన్న దానిపై అసెంబ్లీలో చర్చిద్దాం. అసెంబ్లీకి వచ్చి చర్చించే ధైర్యం ఉందా?' అని మంత్రి సవాల్ విసిరారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం 2020లో జగన్ సీఎంగా ఉన్నప్పుడే ఆగిపోయిందని, ఇదే విషయాన్ని జగన్ స్నేహితుడు, తెలంగాణ మాజీ మంత్రి హరీశ్ రావు స్వయంగా చెప్పారని అన్నారు.

శ్రీశైలం లడ్డూలకూ నకిలీ నెయ్యి

▸▸ 11 నెలల పాటు 3.25 లక్షల కిలోలు సరఫరా: పట్టాభి



శ్రీశైలం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): 'తిరుమల తరహాలోనే శ్రీశైలం ప్రసాదం లడ్డూలకూ నకిలీ నెయ్యి సరఫరా అయింది. తిరుమలకు నెయ్యి సరఫరా చేసిన సంస్థే శ్రీశైలానికి కూడా నెయ్యిని సరఫరా చేసిందని సిట్ విచారణలోనే తేలింది' అని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం ఆరోపించారు. గురువారం శ్రీశైల భ్రమరాంబికా మల్లికార్జునస్వామి వారిని దర్శించుకున్న ఆయన అనంతరం విలేకరులతో మాట్లాడారు. 'రాజేష్ కార్పొరేషన్ సంస్థ శ్రీశైలం దేవస్థానానికి 11 నెలలపాటు సుమారు 3,25,064 కిలోల నకిలీ నెయ్యి సరఫరా చేసి రూ.15.89 కోట్ల బిల్లులను తీసుకుంది. ఈ విషయాన్ని సిట్ అధికారుల తమ విచారణలో తేల్చారు. బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది' అని చెప్పారు.

విద్యుత్ చార్జీలు పెంచే ఆలోచన లేదు

▸▸ మూడేళ్లలో యూనిట్‌కు రూ.1.10 తగ్గింపు: గొట్టిపాటి

మండపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో రాబోయే మూడేళ్లలో విద్యుత్ చార్జీలు పెంచే యోచన లేదు. విద్యుత్ చార్జీలను యూనిట్‌కు రూ.1.10 పైసలు తగ్గించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే ట్రూ అప్ చార్జీలు డౌన్‌చేసి 13 పైసలు తగ్గించాం' అని విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా మండపేట లో గురువారం విలేకరులతో మాట్లాడారు. 'రాష్ట్రంలో కొత్తగా 75 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చాం. 200 సబ్ స్టేషన్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. దేశంలో కోటి సోలార్ విద్యుత్ కనెక్షన్లు మంజూరు కాగా అందులో గుజరాత్‌తో పోటీగా 20 లక్షల కనెక్షన్లు సీఎం రాష్ట్రానికి తీసుకువచ్చారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో నూతన సబ్ స్టేషన్ల నిర్మాణం కోసం స్థల సేకరణకు పరిశీలిస్తున్నాం' అని వివరించారు.


సెర్ప్-ఎఫ్‌పీఓలు బలోపేతం కావాలి: కొండపల్లి

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం, వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా చేపట్టే కార్యక్రమాలను రైతు ఉత్పత్తిదారుల సంస్థల(ఎఫ్‌పీఓ)లతో అనుసంధానం చేయాలని గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం విజయవాడలోని సెర్ప్ ప్రధాన కార్యాలయంలో ఎఫ్‌పీఓలకు సాంకేతిక సహకారం అందిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, సెర్ప్ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సెర్ప్-ఎఫ్‌పీఓల నిర్మాణం, వాటి బలోపేతం, ప్రస్తుత స్థాయిని అంచనా వేసేందుకు ప్రత్యేక టూల్ అభివృద్ధిపై చర్చించారు. నెల, ఏడాది కాలానికి స్పష్టమైన రోడ్‌మ్యాప్, జీవనోపాధి ప్రణాళికలను సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. విజయవంతమైన ఎఫ్‌పీఓల కేస్ స్టడీలను వీడియో డాక్యుమెంటరీలుగా రూపొందించాలన్నారు.

సబ్‌ప్లాన్ నిధులు వంద శాతం ఖర్చు చేయాలి: డోలా

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను వంద శాతం ఖర్చు చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి నూరు శాతం ఖర్చు చేయాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి అన్ని హాస్టళ్లలో అడ్మిషన్లు పూర్తి చేయాలన్నారు.

ఆయిల్‌పామ్ రైతులకు అదనపు లబ్ధి: అచ్చెన్న



అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగు చరిత్రలో తొలిసారి తెలంగాణ కన్నా ఏపీలోనే రైతులకు అధిక ధర లభిస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. ఆయిల్‌పామ్ రైతులకు గిట్టుబాటు ధర కోసం కూటమి ప్రభుత్వం తాజా పండ్లలో చమురు నిష్పత్తి 20.01 శాతానికి పెంచినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి నెలకు తెలంగాణలో టన్ను ఆయిల్‌పామ్‌కు రూ.20,456 లభించిందని.. ఏపీలో రికార్డు స్థాయిలో రూ.20,860 వచ్చిందని చెప్పారు. ఆయిల్‌పామ్ రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బీవీ రాఘవరావు ఆధ్వర్యంలో రైతు నాయకులు మంత్రిని కలిసి ధర పెంపు నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు.

క్వాంటమ్ వ్యాలీకి రేపు భూమిపూజ

గుంటూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయనున్న క్వాంటమ్ వ్యాలీ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేయనున్నారు. ఉద్దండరాయునిపాలెంలో ఏర్పాటు చేయనున్న క్వాంటమ్ వ్యాలీకి ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం మధ్యాహ్నం 2:30 గంటలకు భూమి పూజ చేయనున్నారు. అనంతరం ఇక్కడ నిర్వహించే భారీ బహిరంగ సభలో రాజధాని కోసం భూములిచ్చిన స్థానిక రైతులు, విద్యార్థులతో సీఎం మాట్లాడనున్నారు. సభకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. దాదాపు 3 వేల మంది రైతులు, విద్యార్థులు హాజరయ్యేలా భారీ షెడ్లను నిర్మిస్తున్నారు. సభ ఏర్పాట్లకు సంబంధించిన పనులను గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ అశుతోశ్ శ్రీవాస్తవ, ఆర్డీవో శ్రీనివాసరావు తదితరులు పరిశీలించారు.

గాడ్సేకు, మోదీకి పెద్ద తేడా లేదు: షర్మిల

పుంగనూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మాగాంధీని హత్య చేసిన గాడ్సేకు, గాంధీ పేరును నాశనం చేయాలని చూస్తున్న ప్రధాని మోదీకి పెద్దతేడా లేదని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. అన్నమయ్య జిల్లా పుంగనూరులో, కలికిరిలో గురువారం జరిగిన ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్రలో ఆమె మాట్లాడారు. మాజీ సీఎం జగన్, ప్రస్తుత సీఎం చంద్రబాబు కలిసి రాష్ట్రాన్ని రూ.11లక్షల కోట్ల అప్పుల కుప్పగా తయారు చేశారని అన్నారు. రాహుల్‌గాంధీని ప్రధానిని చేస్తే పదేళ్లు రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోపాటు అధిక నిధులు తెప్పిస్తామని షర్మిల చెప్పారు. మోదీ అమెరికా చేతిలో బానిసగా మారారని, అమెరికా వ్యవసాయ ఉత్పత్తులను భారతదేశం నిండా నింపేందుకు సుంకం మాఫీ చేశారని ఆరోపించారు.

భూమాతకు జలహారతి

(మొదటి పేజీ తరువాయి)

ఎడమ ప్రధాన కాలువను వచ్చే మార్చి నాటికి పూర్తి చేసి అనకాపల్లికి నీరందిస్తామని వెల్లడించారు. పోలవరం-నల్లమలసాగర్ అనుసంధానం చేస్తామన్నారు. ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులకు గోదారి జలాలు తరలిస్తామన్నారు. తుఫాను బారిన పడి రైతులు నష్టపోకుండా, ఈ ఏడాది నుంచి ఖరీఫ్ పంట ప్రణాళికలు మారుస్తున్నామని తెలిపారు. అమరావతి పరేడ్ గ్రౌండ్స్‌లో గురువారం నిర్వహించిన నీరు-ప్రగతి-జల హారతి సాగునీటి వినియోగ సంఘాల భాగస్వామ్య కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ ఈ ఏడాది మే 15వ తేదీనాటికి వరి నారుమళ్లకు నీరందిస్తామని .. వర్షాకాలంలో కురిసిన వాన నీటిని సంరక్షించుకుని రబీ పంటకు వాడుకోవాలని రైతాంగానికి సూచించారు. ఈ ఏడాది మే ఒకటో తేదీ నుంచి నీటి సంవత్సరంగా లెక్కిస్తామన్నారు. వరి పంటను తగ్గించుకుని, పండ్లతోటల పెంపకానికి వెళ్లాలని రైతులకు సూచించారు. దీనివల్ల రైతులకు ఖర్చులు తగ్గుతాయన్నారు. యూరియా వాడకాన్నీ తగ్గించాలని సూచించారు.



నీరు-ప్రగతి-జలహారతి కార్యక్రమంలో సీఎం చంద్రబాబు అభివాదం, పక్కన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రులు అచ్చెన్న, దుర్గేశ్, ఎమ్మెల్యే శ్రవణ్

జగన్ హయాంలోనే సీమ ఎత్తిపోతలపై స్టే..

2020లో సీఎంగా జగన్ బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలోనే రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులపై నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్(ఎన్జీటీ) స్టే ఇచ్చిందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఆ స్టేను ఎత్తివేయించే ప్రయత్నం జగన్ చేయలేదెందుకని నిలదీశారు. ఆ పథకాన్ని ఇప్పుడు ఆపేశామంటూ జగన్ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ చేతకాక చేయలేని పనులను చేసేసినట్లుగా మాట్లాడుతున్నారని, చేతకానివాళ్లే ఇలా మాట్లాడతారని విమర్శించారు. ఒక నిర్దిష్ట లక్ష్యంతో రాయలసీమలో ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని చెప్పారు. హంద్రీనీవా ప్రాజెక్టు కాలువను విస్తరించి కుప్పం దాకా నీటిని తరలించామన్నారు. గాలేరు-నగరి సుజల స్రవంతి పనులను కూడా యుద్ధ ప్రాతిపదికన చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రం ఒకప్పుడు రైతుల ఆత్మహత్యలకు కేంద్రంగా ఉండేదని, ఇప్పుడు రైతాంగానికి సానుకూల ప్రదేశ్‌గా మార్చేశామని తెలిపారు. నీటి భద్రత అందరికీ కావాలని, కానీ ఎవరూ ఆచరించరని చురకలంటించారు. తెలంగాణ కాళేశ్వరం కట్టుకుంటే ఏపీ అడ్డు చెప్పలేదన్నారు. గోదావరి జలాలు ప్రతియేటా రెండు వేల టీఎంసీలకుపైగా సముద్రంలో వృథాగా కలుస్తున్నాయని.. ఇందులో 200 టీఎంసీలను పోలవరం-నల్లమల సాగర్‌కు మళ్లిస్తే రాష్ట్రంలో కరువులేకుండా చేయవచ్చన్నారు. నీటి విలువ తెలిసిన వ్యక్తినని, భూగర్భ జలాలను పెంచుతూ భూమినే రిజర్వాయరుగా మలచాలన్నదే తాపత్రయమని తెలిపారు.

హార్టీకల్చర్ హబ్‌గా మార్చేందుకు కృషి..

అనంతపురం జిల్లాలో చేపడుతున్న జల సంరక్షణ విధానాలను ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రత్యేకంగా ప్రస్తావించడాన్ని చంద్రబాబు గుర్తు చేశారు. అనంతపురాన్ని పండ్లతోటల వనంగా మార్చిన ఘనత ఎన్డీయేదే అన్నారు. రాష్ట్రాన్ని హార్టీకల్చర్ హబ్‌గా మలచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రతి ఎకరాకూ నీరిచ్చేలా నీటి సంఘాల ప్రతినిధులు యత్నించాలని.. పరిగెత్తే నీటిని నిలపాలని, భూమినే జలాశయంగా మార్చే ప్రణాళికఅమలు చేయాలని కోరారు.

పోలవరంపైనా జగన్ విధ్వంసం..

పోలవరం ప్రాజెక్టునూ జగన్ విధ్వంసానికి గురిచేశాడని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.440 కోట్లతో నిర్మించిన డయాఫ్రమ్ వాల్‌ను నిర్లక్ష్యంతో ధ్వంసం చేశాడన్నారు. సమాంతర డయాఫ్రమ్ వాల్ నిర్మించేందుకు రూ.1000 కోట్లను అదనంగా ఖర్చు చేయాల్సి రావడంతోపాటు సమయమూ వృథా అయిందని చెప్పారు. కృష్ణా డెల్టాకు పట్టిసీమ ద్వారా నీరివ్వడం వల్ల రూ.50 వేల కోట్ల జీఎస్‌డీపీ వ్యవసాయోత్పత్తి ద్వారా వచ్చిందన్నారు. కరువును తరిమికొట్టేలా కార్యాచరణ చేపడుతున్నామని, 2014-19 కాలంలో జలవనరుల ప్రాజెక్టులకు రూ.68 వేల కోట్లు ఖర్చుచేశామని, వాటి ఫలితాలే ఇప్పుడు కనిపిస్తున్నాయని వెల్లడించారు.

సంఘాల పనులపై జీఎస్టీ రద్దు చేయిస్తాం..

జల వనరుల శాఖ చేపట్టే కాలువల అభివృద్ధి, నీటి సంరక్షణ, వారబందీ, నీటి యాజమాన్య సంరక్షణ విధానాలు, నీటి పన్నుల వసూలు తదితర పనులన్నీ సాగునీటి వినియోగదారుల సంఘాల తోనే చేయిస్తామని చంద్రబాబు వెల్లడించారు. సంఘాల ద్వారా చేసే పనులపై జీఎస్టీని రద్దు చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, దుర్గేశ్, అచ్చెన్నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల హర్షం..

సాగునీటి రంగంలో చేపట్టే పనుల్లో వినియోగదారుల సంఘాలను భాగస్వాములను చేస్తామని, జీఎస్టీని రద్దు చేయిస్తామని చంద్రబాబు చేసిన ప్రకటనపై రాష్ట్ర సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల వెంటకగోపాల కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు.

కొత్త ఒరవడికి శ్రీకారం

సాగునీటి సంఘాల సమావేశంలో సీఎం కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. వేదిక మీదకు వచ్చిన వెంటనే ర్యాంపు మీదుగా నడిచి వెళ్తూ సంఘాల ప్రతినిధులు, సామాన్యులు ఇచ్చిన అర్జీలను మంత్రులతో కలిసి సీఎం స్వీకరించారు. ర్యాంపుపై అటూ ఇటూ నడుస్తూనే దాదాపు రెండున్నర గంటల సేపు ప్రసంగాన్ని కొనసాగించారు. మధ్యలో సాగునీటి సంఘాల ప్రతినిధులు వేస్తున్న ప్రశ్నలకు సమాధానాలు చెబుతూనే ఉల్లాసంగా మాట్లాడారు.

వరి తగ్గించండి .. పండ్ల తోటలు పెంచండి: అచ్చెన్న

▸▸ పోలవరం పూర్తి చేస్తామని జగన్ హయాంలో తొడగొట్టారు: నిమ్మల

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అధిక వ్యయంతో కూడిన వరి పంట వేయడాన్ని తగ్గించాలని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ రైతులకు సూచించారు. సాగునీటి సంఘాల సమావేశంలో మాధవ్ మాట్లాడుతూ కేంద్రం పండ్ల తోటల సాగును ప్రోత్సహించేందుకు వీలుగా కిసాన్ సమృద్ధి యోజన కింద రైతులకు ఆర్థిక సాయం చేస్తోందన్నారు. రైతులు వరి పంటను తగ్గించి ఉద్యానవన పంటలు వేయడం ద్వారా అధిక లాభాలు పొందే వీలుందని అచ్చెన్నాయుడు సూచించారు. ఖరీఫ్ సాగును మే నెల నుంచే చేపట్టాలన్నారు. మంత్రి నిమ్మల మాట్లాడుతూ డయాఫ్రమ్ వాల్ ఎందుకు కడతారో తెలియకుండా మాట్లాడినవారూ జగన్ సర్కారులో నీటిపారుదల మంత్రులైపోయారంటూ సెటైర్లు వేశారు. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లకూ వాల్ కట్టారన్న వారూ, పోలవరం ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి చేస్తారంటే తొడలు కొట్టినవారూ, బుల్లెట్ దిగిందా లేదా? అని డైలాగులు కొట్టిన వారూ జగన్ మంత్రివర్గంలో పనిచేశారన్నారు. ఈ సందర్భంగా సాగునీటి సంఘాల సభ్యులు 'అంబటి రాంబాబు' అంటూ అరిచారు.

జూన్ 1న 'ఈఏపీసెట్' ఫలితాలు!

▸▸ వివిధ ప్రవేశ పరీక్షల తేదీలు ప్రకటించిన ఉన్నత విద్యామండలి

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఈఏపీసెట్ ఫలితాలను జూన్ 1న విడుదల చేసే అవకాశం ఉందని ఉన్నత విద్యామండలి తెలిపింది. తుది ఫలితాల విడుదల తాత్కాలిక తేదీ, దరఖాస్తులు, పరీక్షల తేదీలకు సంబంధించిన షెడ్యూల్‌ను గురువారం ప్రకటించింది. ఈఏపీసెట్ దరఖాస్తుల స్వీకరణ బుధవారం ప్రారంభమైంది. మార్చి 7 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. మే 12 నుంచి 20 వరకు పరీక్షలు జరుగుతాయి. 23న ప్రాథమిక కీ విడుదల చేస్తారు. మరోవైపు ఈసెట్ దరఖాస్తుల స్వీకరణ బుధవారం ప్రారంభమైంది. మార్చి 2 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏప్రిల్ 23న పరీక్ష జరుగుతుంది. మే 7న ఫలితాలు విడుదల చేస్తారు. ఐసెట్ దరఖాస్తుల స్వీకరణ గురువారం ప్రారంభం కాగా, మార్చి 2 వరకు గడువుంది. మే 2న పరీక్ష, 16న ఫలితాలు ప్రకటిస్తారు.

ఆర్టీఈ అడ్మిషన్లకు నేడు నోటిఫికేషన్

వచ్చే విద్యా సంవత్సరానికి విద్యాహక్కు చట్టం అడ్మిషన్లకు పాఠశాల విద్యాశాఖ ప్రక్రియ ప్రారంభించింది. అడ్మిషన్ల నోటిఫికేషన్ శుక్రవారం విడుదల చేయనున్నట్లు సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ http://c-se.ap.gov.in ద్వారా పిల్లల తల్లిదండ్రులు ఈనెల 20 నుంచి మార్చి 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల డేటా ఆధారంగా విద్యార్థుల అర్హతను మార్చి 17 నాటికి నిర్ధారిస్తారు. మార్చి 25న మొదటి విడత లాటరీ నిర్వహించి సీట్లు కేటాయిస్తారు. 26 నుంచి ఏప్రిల్ 7 వరకు విద్యార్థుల ప్రవేశాలను పాఠశాలలకు వెళ్లి ధృవీకరించుకోవాలి. రెండో విడత లాటరీ ఏప్రిల్ 12న నిర్వహిస్తారు. ఏప్రిల్ 13 నుంచి 23 వరకు పాఠశాలల్లో చేరి అడ్మిషన్లను ధృవీకరించుకోవాలి.

టెన్త్ పరీక్ష ఫీజులకు తత్కాల్ అవకాశం

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఇంకా ఫీజు చెల్లించనివారికి తత్కాల్ సౌకర్యం కల్పిస్తున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి ఈనెల 12 వరకు రూ.వెయ్యి ఆలస్య రుసుముతో తత్కాల్ విధానంలో ఫీజు చెల్లించవచ్చన్నారు.

మరో 38 ప్రైవేటు జూనియర్ కాలేజీలు

▸▸ కొత్తగా ఏర్పాటుకు నోటిఫికేషన్

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా 38 ప్రైవేటు జూనియర్ కాలేజీల ఏర్పాటుకు ఇంటర్మీడియట్ విద్యాశాఖ డైరెక్టర్ పి.రంజిత్ బాషా గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 26 మండలాల్లో 32 కాలేజీలు, రెండు మున్సిపాలిటీల్లో ఆరు కాలేజీల ఏర్పాటుకు అవకాశం ఉన్నట్లు గుర్తించామన్నారు. 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఈ కాలేజీలు ప్రారంభించుకునేందుకు ఆసక్తి ఉన్న విద్యా సంస్థలు, ట్రస్టులు... ఇంటర్ విద్యాశాఖ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారు ఇంటర్ విద్యామండలి యాప్‌లో భవనం, తరగతి గదులు, ల్యాబ్స్, గ్రంథాలయం, క్రీడా ప్రాంగణం ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. వివిధ పత్రాలను ఇంటర్ విద్యామండలి తనిఖీ చేస్తుందన్నారు. దరఖాస్తులకు ఈనెల 25 చివరి తేదీ అని పేర్కొన్నారు.

అవినీతిపరులపై ఏసీబీ పంజా!

▸▸ విశాఖలో పంచాయతీరాజ్ రిటైర్డ్ ఎస్ఈ అరెస్టు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)





విశాఖలో శ్రీనివాసరావు ఇంట్లో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు (కళ్లజోడు, తెల్ల చొక్కా ధరించిన వ్యక్తి శ్రీనివాసరావు), ఏసీబీకి చిక్కిన ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్, బిల్ కలెక్టర్

అవినీతి నిరోధక శాఖ గురువారం రాష్ట్రంలోని పలు చోట్ల దాడులు నిర్వహించింది. పంచాయతీరాజ్ రిటైర్డు ఎస్ఈ కల్లేపల్లి శ్రీనివాసరావు రూ.30 కోట్ల విలువైన ఆస్తులు కలిగి ఉన్నట్లు గుర్తించింది. విశాఖ, సాలూరుతో పాటు హైదరాబాద్‌లలో శ్రీనివాస్, ఆయనకు చెందిన సన్నిహితులు, బంధువుల ఇళ్లలో ఐదు చోట్ల ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. ఆయనపై ఆదాయానికి మించిన కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు. వీఎల్‌టీ మంజూరుకు రూ.20వేలు లంచం తీసుకుంటున్న నంద్యాల జిల్లా ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ ఎల్.రమేష్‌బాబును, భోజనం బిల్లులు మంజూరుకు రూ.15 వేలు లంచం తీసుకున్న శ్రీసత్యసాయి జిల్లా బీసీ సంక్షేమ శాఖ సహాయ అధికారి బాలాజీని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

భారీస్థాయిలో ఆస్తుల గుర్తింపు

పంచాయతీరాజ్ శాఖలో సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ)గా పనిచేసిన కె.శ్రీనివాసరావు గత డిసెంబరు 31న రిటైరయ్యారు. ఆయన ఆదాయానికి మించి భారీగా ఆస్తులు కూడబెట్టారనే సమాచారంతో విశాఖ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో గురువారం ఉదయం దాడులు చేశారు. విశాఖలో ఎంవీపీ సిటీలోని శ్రీనివాసరావు నివాసంతోపాటు మురళీనగర్‌లోని అతని స్నేహితుడైన పంచాయతీరాజ్ శాఖ రిటైర్డ్ ఈఈ గౌరీశంకర్ ఇళ్లు, పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులోని శ్రీనివాసరావు, అతని సమీప బంధువు నివాసాలు, హైదరాబాద్‌లో కుమార్తె ఇంటిలో సోదాలు నిర్వహించారు. విశాఖలో మూడు చోట్ల ఇళ్ల స్థలాలు, రెండు ఫ్లాట్‌లు, ఒక ఇల్లు, సాలూరులో కుమార్తె పేరిట 18.57 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్టు గుర్తించారు. సాలూరులోని బావమరిది ఇంట్లో రూ.30 లక్షలు నగదు, హైదరాబాద్‌లోని కుమార్తె ఇంట్లో రూ.25 లక్షలు, ఎంవీపీ సిటీలోని శ్రీనివాసరావు ఇంట్లో రూ.లక్ష, 2.5 కిలోల బంగారం, 20.3 కిలోల వెండి, హుండాయ్ కారు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆస్తుల విలువ రూ.30 కోట్లకు పైగా ఉంటుందని అంచనా.

రూ.20 వేలు లంచం తీసుకుంటూ..

నంద్యాల జిల్లా ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ ఎల్.రమేష్ బాబును కార్యాలయంలోనే లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఓ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి అవసరమైన ఖాళీ స్థలానికి పన్ను (వీఎల్‌టీ) మంజూరుకు ఆయన రూ.20 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించగా ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో... మున్సిపల్ కమిషనర్ బిల్ కలెక్టర్ భాస్కర్ ద్వారా రూ.20 వేలు తీసుకుంటుండగా పట్టుకున్నారు.

ఏసీబీ వలలో ఏబీసీడబ్ల్యూవో

బీసీ హాస్టళ్ల భోజనం బిల్లులు మంజూరు చేసేందుకు రూ.15వేలు లంచం తీసుకుంటూ శ్రీసత్యసాయి జిల్లా కదిరి డివిజన్ బీసీ సంక్షేమశాఖ సహాయ అధికారి పురం బాలాజీ పట్టుబడ్డారు. 2023-24కి సంబంధించిన భోజనం బిల్లుల మంజూరుకు వార్డెన్ లక్ష్మీనారాయణను రూ.18వేలు లంచం అడిగారు. వార్డెన్ రూ.15 వేలు ఇస్తానని ఒప్పుకొని, ఏసీబీని ఆశ్రయించారు. కదిరిలోని బాలాజీ ఇంటికెళ్లి డబ్బులు ఇచ్చి బయటకు వచ్చిన వెంటనే ఏసీబీ అధికారులు దాడులు చేసి, బాలాజీని పట్టుకున్నారు. బాలాజీ సొంతూరు అన్నమయ్య జిల్లా రాయచోటిలో చేసిన సోదాల్లో పెద్దఎత్తున బంగారం, వెండి, ఆస్తిపత్రాలు స్వాధీనం చేసుకున్నారు.

ఐదేళ్లలో ఏపీలో రోడ్ల కోసం 40,345 కోట్లు: గడ్కరీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఏపీలో జాతీయ రహదారుల విస్తరణ, నిర్వహణ కోసం గత ఐదేళ్లలో రూ.40,345 కోట్లు కేటాయించామని ఈ నిధుల్లో రూ.40,324 కోట్లు ఖర్చయ్యాయని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ లోక్‌సభకు తెలిపారు. ఏపీకి గత ఐదేళ్లలో రూ.62,614 కోట్ల విలువైన 145 జాతీయ రహదారుల ప్రాజెక్టులను కేటాయించామని, వీటి పొడవు 3,633 కిమీ అని చెప్పారు. వీటిలో 69 నిర్మాణ దశలో ఉన్నాయని, ఈ ప్రాజెక్టుల కోసం 6,071 హెక్టార్ల భూమిని సేకరించి, రూ.2,922 కోట్లు నష్టపరిహారం చెల్లించామన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఐదేళ్లలో 4,383 మంది మృతి

ఆంధ్రప్రదేశ్‌లో గత ఐదేళ్లలో జాతీయ రహదారులపై 31,652 ప్రమాదాలు జరగ్గా.. 4,383 మంది మరణించారని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. టీడీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గురువారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ ఈమేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ నిర్వహణలో 2,562 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు ఉండగా, జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) నిర్వహణలో 2,620 కిలోమీటర్ల జాతీయ రహదారులు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో మెట్రో రైలు ఏర్పాటుకు కీలకమైన కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ రూపకల్పన కోసం కేంద్ర ప్రభుత్వం రూ.84.48 లక్షలు విడుదల చేసినట్లు మంత్రి టోఖన్ సాహు తెలిపారు.

జనాభా లెక్కల సేకరణ వచ్చే ఏడాది: సీఎస్

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది ఫిబ్రవరి 9 నుంచి 28వ తేదీ వరకు రాష్ట్రంలో జనాభా లెక్కల సేకరణ జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. జనాభా లెక్కల సేకరణ-2027పై గురువారం సచివాలయంలో సీఎస్ అధ్యక్షతన రాష్ట్రస్థాయి కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇప్పటి నుంచే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జనాభా లెక్కల రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎస్ఎస్ రావత్, రాష్ట్ర సెన్సెస్ డైరెక్టర్ జె.నివాస్ పాల్గొన్నారు

పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట: ఏపీ చాంబర్స్

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి, ఎంఎస్ఎంఈల స్థిరత్వం, ఎగుమతులు, ఉపాధి కల్పనకు రాష్ట్ర బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేయాలని ఏపీ చాంబర్స్ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. త్వరలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌ను దృష్టిలో పెట్టుకుని ఏపీ చాంబర్స్ ప్రీ-బడ్జెట్ ప్రతిపాదనలను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు సమర్పించినట్లు ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు గురువారం తెలిపారు.

ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణే లక్ష్యం

▸▸ వేస్ట్ రీసైక్లింగ్ పాలసీ మార్గదర్శకాలు విడుదల

ఆంధ్రప్రదేశ్ సర్క్యులర్ ఎకానమీ అండ్ వేస్ట్ రీసైక్లింగ్ పాలసీ (4.0)ని ప్రభుత్వం ప్రకటించింది. దీని అమలుకు కార్యాచరణ, మార్గదర్శకాలు పేర్కొంటూ పరిశ్రమలు, వాణిజ్య శాఖ గురువారం ఉత్తర్వులు విడుదల చేసింది. ప్రజారోగ్యాన్ని, పర్యావరణాన్ని పరిరక్షించడం, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య రంగాల్లోని పెట్టుబడిదారులు, ఆపరేటర్లకు లావాదేవీల ఖర్చు తగ్గించడం ఈ పాలసీ ముఖ్యఉద్దేశం. వ్యర్థాల తగ్గింపు, వనరుల పునరుద్ధరణ, సర్క్యులర్ ఎకానమీ పార్కులు, మెటీరియల్ రికవరీ, రీసైక్లింగ్ కేంద్రాలు, ట్రీట్‌మెంట్ స్టోరేజ్, రిజిష్టర్డ్ వెహికల్ స్క్రాపేజ్ సౌకర్యాలు, ఇంకా సహాయక, మౌలిక సదుపాయాల స్థాపన, నిర్వహణ, పర్యవేక్షణ కోసం స్పష్టమైన విధానాలను అందించడం దీని ప్రధాన లక్ష్యాలు.

మళ్లీ పెరిగిన చలి

విశాఖపట్నం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మధ్య భారతంలో నెలకొన్న అధిక పీడనం ప్రభావంతో కోస్తాలోని పలు జిల్లాల్లో గురువారం ఉదయం పొగమంచు కురిసింది. అటు నుంచి వీస్తున్న చలిగాలుల ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో చలి తీవ్రత స్వల్పంగా పెరిగింది. కొన్నిచోట్ల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు, మూడు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. అల్లూరి జిల్లా అరకులోయలో 8.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తాలో పలుచోట్ల పొగమంచు కురుస్తుందని, ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల్లో చలి తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది.

సిలికానాంధ్ర రజతోత్సవ వేడుకలకు శ్రీకారం

(డాలస్ నుంచి కిలారు గోకుల్‌కృష్ణ)

తెలుగు సాహితీ సాంస్కృతిక సంప్రదాయ స్ఫూర్తిని ప్రపంచ వ్యాప్తంగా చాటేందుకు 2000వ సంవత్సరంలో అమెరికాలోని కాలిఫోర్నియాలో ఏర్పడిన సిలికానాంధ్ర సంస్థ రజతోత్సవ వేడుకల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ఆగస్టు 8వ తేదీ శనివారం నాడు కాలిఫోర్నియాలోని ఓక్‌ల్యాండ్ ఎరీనాలో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు సిలికానాంధ్ర వ్యవస్థాపక చైర్మన్ కూచిభొట్ల ఆనంద్ తెలిపారు. తెలుగు సంప్రదాయాన్ని పాటిస్తూ సిలికానాంధ్ర సభ్యులతో కలిసి ఆయన రజతోత్సవ వేడుకల ఆహ్వాన పత్రికను శని, ఆదివారాల్లో స్థానిక ప్రవాస తెలుగువారి ఇంటింటికీ వెళ్లి అందజేశారు. అమెరికా వ్యాప్తంగా ప్రవాస తెలుగువారి ఇళ్లకు వెళ్లి ప్రత్యక్షంగా ఆహ్వానించేందుకు సిలికానాంధ్ర కుటుంబసభ్యులు ప్రణాళికలు రూపొందిస్తున్నారని ఆనంద్ వెల్లడించారు. 15 వేలమంది తెలుగువారు ఈ రజతోత్సవ వేడుకల్లో పాల్గొంటారని అంచనా వేస్తున్నామని పేర్కొన్నారు. ప్రవాస తెలుగు పరిమళాలకు ఈ రజతోత్సవ వేదిక పెద్దపీట వేస్తుందని తెలిపారు.

లా చదివి ల్యాప్‌టాప్‌ల చోరీ..!

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): లా చదివిన ఓ ప్రబుద్ధుడు.. ల్యాప్‌టాప్‌ల చోరీలో ఆరితేరాడు. యూనివర్సిటీలు, ఐఐటీ, ఎన్ఐటీ, మెడికల్ కళాశాలల్లో బాలుర హాస్టళ్లను లక్ష్యంగా చేసుకుని ల్యాప్‌టాప్‌లు మాయం చేస్తున్నాడు. ఇలా పలు రాష్ట్రాల్లో పదులకొద్దీ ల్యాప్‌టాప్‌లు దొంగిలించిన వ్యక్తిని గుంటూరు జిల్లా మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ వివరాలను డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ వెల్లడించారు. తమిళనాడులోని తిరువారూర్ జిల్లా పులివలం గ్రామానికి చెందిన పతమిళ్ సెల్వన్ లా చదివాడు. గతేడాది డిసెంబరు 31న మంగళగిరి మండలం కురగల్లు గ్రామంలోని అమృత విశ్వవిద్యాపీఠం బాయ్స్ హాస్టల్‌లో 3 ల్యాప్‌టాప్‌లు, అదే రోజు ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో రెండు ల్యాప్‌టాప్‌లు దొంగతనం చేశాడు. ఈ ఘటనలపై కళాశాల తరపున పోలీసులకు ఫిర్యాదులు అందాయి. అలాగే విట్, కేఎల్ యూనివర్సిటీల్లో దొంగతనాలకు సిద్ధపడుతున్న క్రమంలో గురువారం ఉదయం ఎర్రబాలెం డాన్‌బోస్కో స్కూల్ సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతనివద్ద నుంచి 15 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. సెల్వన్‌పై 11 రాష్ట్రాల్లో 61 చోరీ కేసులు నమోదైనట్టు విచారణలో తేలింది.



హిందూమతంపై పకడ్బందీ కుట్ర!

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు, జనసేనాని, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీఎన్‌వీ మాధవ్ ధ్వజమెత్తారు. భగవంతుడిపైనే పగబట్టారని విమర్శించారు. కల్తీ నెయ్యి వ్యవహారంలో సీబీఐ సిట్ రాష్ట్రప్రభుత్వానికి చేసిన సూచనలపై తదుపరి చర్యలకు ఏకసభ్య కమిటీ వేస్తున్నట్లు ప్రకటించారు. గురువారం ఉండవల్లి సీఎం నివాసంలో సీఎం, ఉపముఖ్యమంత్రి, మాధవ్, మంత్రులు లోకేశ్, పయ్యావుల కేశవ్, కొలుసు పార్థసారథి, సత్యకుమార్, ఆనం రామనారాయణరెడ్డి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కీలక సమావేశం నిర్వహించారు. అనంతరం వారంతా విలేకరులతో మాట్లాడుతూ జగన్ అండ్ కో తీరును ఎండగట్టారు.

219 ఆలయాలపై దాడులు..

తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడకం.. కమీషన్ల కక్కుర్తి కోసం చేసింది కాదని చంద్రబాబు స్పష్టంచేశారు. ఇది పథకం ప్రకారం.. ఉద్దేశపూర్వకంగా తిరుమల పవిత్రతను.. ప్రాభవాన్ని దెబ్బతీసే కుట్రగా పేర్కొన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన ఘటనలను పరిశీలిస్తే వారి అసలు ఉద్దేశం అర్థమవుతుందన్నారు. ఆ ఐదేళ్లలో 219 ఆలయాలపై దాడులు చేసి, అపవిత్రం చేశారని.. వీటన్నింటినీ పరిశీలిస్తే.. పకడ్బందీగా, పక్కా ప్రణాళిక ప్రకారం హిందూ ఆలయాలపైన.. హిందూ మతంపైన దాడి చేస్తూ వచ్చారని స్పష్టమవుతోందని ముఖ్యమంత్రి తేల్చిచెప్పారు. ముస్లింలకు మక్కా, క్రిస్టియన్లకు జెరూసలేం ఎంత పవిత్రమైనవో హిందువులకు తిరుమల అంత పవిత్రమైనదన్నారు. తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడకం అనేది కోట్లాది మంది భక్తుల మనోభావాలకు సంబంధించిన విషయం. ఈ లడ్డూ ప్రసాదం ప్రత్యేకమైనది, దానిని ఇతరులెవరూ తయారుచేయలేరు. అంతటి పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసి కోట్ల మంది ప్రజలకు ప్రసాదంగా ఇచ్చి గత పాలకులు మహా పాపం చేశారు. ఆ ఐదేళ్లలో లడ్డూ ప్రసాదం తినాలంటేనే భక్తులు భయపడే పరిస్థితి తీసుకొచ్చారు. ఇది వేంకటేశ్వరస్వామి పవిత్రతను దెబ్బతీయడానికి కావాలనే చేసిన పనిగా మేం భావిస్తున్నాం' అని తెలిపారు. స్వామి తమ కులదైవమన్నారు. 2003లో టీటీడీలో పవిత్రమైన 'ప్రాణదానం' కార్యక్రమాన్ని ప్రారంభించి తిరుమలకు వెళ్తుంటే తనపై 23 క్లైమోర్ మైన్స్‌తో హత్యాయత్నం జరిగితే.. సాక్షాత్తూ స్వామే పునర్జన్మ ఇచ్చాడని గుర్తుచేసుకున్నారు. సీఎం ఇంకా ఏం చెప్పారంటే..

హైందవ ధర్మంపై జగన్‌కు విశ్వాసం లేదు..

వైసీపీ పాలనలో హిందూ ఆలయాల విషయంలో ఎన్నో అపచారాలు చోటుచేసుకున్నాయి. రామతీర్థంలో రాముడి తల తొలగించారు. చూడడానికి వెళ్తే నాపై కేసులు పెట్టారు. అంతర్వేదిలో రథం తగలబెట్టి కందిరీగలు కారణమన్నారు. తిరుమలలో కల్తీ నెయ్యి వ్యవహారం 2022లోనే వెలుగు చూసినా తొక్కిపెటారు. లడ్డూల్లో నాణ్యత తగ్గిపోవడంపై ప్రతిపక్షంగా ఎంతో పోరాడాం. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే లడ్డూకు వాడిన నెయ్యిని ఎన్‌డీడీబీకి పంపితే.. చాలా స్పష్టంగా కల్తీ జరిగిందని చెప్పింది. దానిపై నేను మాట్లాడితే నన్ను తప్పుబట్టారు. భగవంతుడంటే లెక్కలేనితనంగా వ్యవహరించారు. హైందవ ధర్మంపై జగన్‌కు విశ్వాసం లేకపోయినంత మాత్రాన ఇలా చేస్తారా? చరిత్రలో వేంకటేశ్వర స్వామితో ఎవరూ ఆటలాడుకోలేదు. బ్రిటిషర్లు కూడా తిరుమల సంప్రదాయాలు, ఆచారాలను గౌరవించారు.. మెరుగుపరిచారు. వాళ్ల కంటే హీనంగా గత పాలకులు వ్యవహరించారు. తిరుమల శ్రీవారి పవిత్రతను కాపాడుకోవడం మనందరి బాధ్యత. ఈ తరహా విషయాలను ముక్తకంఠంతో ఖండించాలి. మరోసారి ఎవరైనా ఇలాంటి మహాపచారం చేయాలంటే భయపడాలి. కల్తీ నెయ్యి వ్యవహారాన్ని వదిలిపెట్టం. దోషులను కఠినంగా శిక్షించడానికి అన్ని చర్యలూ తీసుకుంటాం.

2022 నివేదికను ఎందుకు తొక్కిపెట్టారు?

లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసిందే కాకుండా మళ్లీ ఎదురుదాడి చేస్తున్నారు. ఈ వ్యవహారాన్ని డైవర్ట్ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. 2022లో వచ్చిన నివేదికను ఎందుకు తొక్కిపెట్టారు? అప్పుడే ఎందుకు చర్యలు తీసుకోలేదు? గతంలో పనిచేసిన చైర్మన్ పీఏకు రూ.4 కోట్ల పైచిలుకు లంచంగా ఇచ్చారు. అప్పటి టీటీడీ బోర్డు చైర్మన్‌కు, కొనుగోలు కమిటీకి తెలిసే కల్తీ నెయ్యి సరఫరా నిర్ణయాలు జరిగాయి. ఇప్పుడు వాళ్లే ఎదురుదాడి చేస్తున్నారు. దౌర్జన్యం, రౌడీయిజం చేయాలనుకుంటే మీ ఆటలు సాగవు. నాడు వైఎస్ వివేకానందరెడ్డిని హత్య చేసి మళ్లీ నాపై ఆరోపణలు చేశారు. ఇప్పుడు శ్రీవారి ప్రసాదం కల్తీ చేసి తిరిగి నాపై ఆరోపణలు చేస్తున్నారు. భక్తుల విశ్వాసంపైనా, నమ్మకంపైనా దాడి చేస్తున్నారు. వైసీపీ హయాంలో తిరుమలతోపాటు పది ఆలయాల్లో నెయ్యి కల్తీకి పాల్పడ్డారు. దేవుడికి అపచారం జరిగినప్పుడు అందరూ ముక్తకంఠంతో ఖండించాలి. నెయ్యి కల్తీ చేసేందుకు ఎన్నో రకాల రసాయనాలు వాడినా భక్తుల ప్రాణాలకు ప్రమాదం వాటిల్లలేదంటే అది దేవుడి మహిమే.



రెండు కొండలు చాలన్నారు..

'మానవ సేవే.. మాధవ సేవ' అంటాం. భక్తులు ఎంతో పవిత్రంగా భావించే భగవంతుడి ప్రసాదాన్నే కల్తీ చేశారు. ఏడుకొండలవాడికి రెండు కొండలు చాలు అన్న వ్యక్తులు భక్తుల మనోభావాలతో ఆడుకున్నారు. స్వామి నిస్సహాయుడని అనుకుంటున్నారా? క్షమించరాని మహాపాపం చేశారు. ఈ మహాపాపాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు. జగన్ కరుడుగట్టిన నేరస్థుడు.. అసత్యాన్ని సత్యమని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. మహాపచారాన్ని సరిచేసేందుకు దేవుడు మమ్మల్ని ఎంచుకున్నాడు.. దీనిని దైవ కార్యక్రమంగా భావిస్తున్నాను.

డిక్లరేషన్‌పై ఎందుకు సంతకం చేయలేదు?

జగన్‌కు వేంకటేశ్వరస్వామిపై భక్తి ఉంటే డిక్లరేషన్‌పై ఎందుకు సంతకం పెట్టలేదు? టీటీడీ నిబంధనల ప్రకారం అన్యమతస్తులు డిక్లరేషన్‌పై సంతకం చేయాల్సిందే. సంతకమే చేయకుండా ఇష్టానుసారం వ్యవహరించిన వ్యక్తులు.. నాపై నిందారోపణలు చేస్తున్నారు.

కల్తీ జరగలేదని దేవుడు వచ్చి చెప్పాడా?

నెయ్యిలో కల్తీ జరగలేదని సీబీఐ సిట్ క్లీన్ చిట్ ఇచ్చిందని నివేదికలో ఎక్కడుంది? వైసీపీ వాళ్లు ఏమైనా కల గన్నారా? వాళ్లకు దేవుడు వచ్చి చెప్పాడా? ఉద్దేశపూర్వకంగానేస్వామిని అపవిత్రం చేయడానికి కుట్రలు చేస్తున్నారు. ప్రభుత్వానికి సిట్ చేసిన సూచనలపై తదుపరి చర్యలు తీసుకునేందుకు ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేస్తాం. కల్తీ నెయ్యి వ్యవహారంపై పీఠాధిపతులతోనూ చర్చించి ముందుకెళ్తాం.



అన్యమతస్థుల ప్రాబల్యం పెంచే కుట్ర

- అందులో భాగమే తిరుమల లడ్డూ కల్తీ
- వైసీపీది కల్తీ మనస్తత్వం.. కల్తీ పాలన
- దేవాలయ వ్యవస్థ అంటే వారికి లెక్కలేదు
- మహాపచారం చేసి క్లీన్ చిట్ ఇచ్చుకోవడం వారికే చెల్లు: బీజేపీ నేత మాధవ్

రాష్ట్రంలో అన్యమతస్థుల ప్రాబల్యం పెంచే కుట్రలో భాగంగానే తిరుమల లడ్డూని కల్తీ నెయ్యితో తయారు చేయడమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీది కల్తీ మనస్తత్వమని, వారి పాలన అంతా కల్తీ అన్నారు. హిందూ దేవాలయ వ్యవస్థ అంటే వైసీపీ వారికి లెక్క లేదని, దాని పర్యవసానమే వారి హయాంలో ఆలయాలపై జరిగిన దాడులు, తిరుమలలో లడ్డూ కల్తీ అని పేర్కొన్నారు. తప్పు చేసి తమకు తామే క్లీన్ చిట్ ఇచ్చుకోవడం వైసీపీ వారికే చెల్లుతుందని ఎద్దేవా చేశారు. 'తప్పు చేసి క్షమాపణ చెప్పాల్సిన వారే నిస్సిగ్గుగా మమ్మల్ని క్షమాపణ చెప్పాలంటున్నారు. మేమెందుకు క్షమాపణ చెప్పాలి..? మీ కల్తీ బాగోతాన్ని బయట పెట్టినందుకా.. మీలా తిరుమలలో అన్యమతస్థులను చైర్మన్లుగా, ఉద్యోగులుగా నియమించనందుకా..? తిరుమలతోపాటు అన్ని ఆలయాల పవిత్రతను కాపాడుతున్నందుకా..? దేనికి క్షమాపణ చెప్పాలి? బీజేపీ కేవలం హిందూమతానికే ప్రతినిధి కాదు. భారతీయులందరికీ ప్రాతినిధ్యం వహిస్తోంది. మతాలకతీతంగా ప్రజల మతవిశ్వాసాలను కాపాడేందుకు కూటమి తరఫున కలిసికట్టుగా పోరాడతాం' అని స్పష్టంచేశారు.

కల్తీ.. తెలిసి చేసిన నేరం: పయ్యావుల కేశవ్

తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం గత పాలకులకు తెలిసి జరిగిన నేరమని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. తిరుమలకు సరఫరా అవుతున్న నెయ్యిలో కల్తీ జరుగుతోందని 2022లో సీఎఫ్‌టీఆర్ఐ స్పష్టంగా ఇచ్చిన నివేదికను నాటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తొక్కిపెట్టారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 2024లో ఎన్‌డీడీబీ కూడా తిరుమల నెయ్యి కల్తీ జరిగిందని స్పష్టంగా పేర్కొందన్నారు. ఆ నివేదికలో పంది కొవ్వు, గొడ్డు కొవ్వు కలిసిందని స్పష్టంగా చెప్పారని.. దాని ఆధారంగానే సీఎం మాట్లాడారని తెలిపారు. 'తప్పు జరిగిందని తెలిసీ ప్రజలకు చెప్పకపోతే అది కూడా నేరమే. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పక్కా పథకం ప్రకారం నెయ్యి కల్తీకి తెరదీసింది. ముందుగా నిబంధనలు సడలించారు. తర్వాత తమకు అనుకూలమైన సంస్థలతో బేరాలు మాట్లాడుకుని అర్హత లేకున్నా.. ఫేక్ డాక్యుమెంట్లు పెట్టినా పట్టించుకోకుండా వారికే నెయ్యి సరఫరా బాధ్యత అప్పగించారు. కల్తీ లడ్డు వ్యవహారంలో దోషులుగా ఉన్న ఇద్దరు వ్యక్తులు ఎన్డీఆర్ఐలో పనిచేస్తున్నారు. ఈ ఇద్దరే తిరుమలకు సరఫరా అయ్యే నెయ్యి నాణ్యతను పరీక్షించే కమిటీలో కూడా ఉన్నారు. ఆ కారణంగానే సీబీఐ ఎన్డీఆర్ఐకు నెయ్యి శాంపిల్స్‌ను పంపితే అరకొరగా నివేదిక ఇచ్చింది. అయితే తామిచ్చిన రిపోర్టు అంతిమం కాదని.. తమకు జంతుకొవ్వును నిర్ధారించే సామర్థ్యం లేదని కూడా పేర్కొంది. అయినా ఆ నివేదికనే తీసుకుని వైసీపీ వారు తమకు క్లీన్ చిట్ వచ్చిందంటూ ప్రచారం చేసుకుంటున్నారు. జంతు కొవ్వు కలవలేదని సీబీఐ తన నివేదికలో ఎక్కడా పేర్కొనలేదు' అని తేల్చిచెప్పారు.

భగవంతుడిపైనే పగబట్టారు

- వాళ్లు సర్వనాశనమైపోతారు.. వైసీపీ వాళ్లకు హిందూ ధర్మంపై గౌరవం లేదు
- తప్పు చేసినవారు భగవంతుడి ముందు మోకరిల్లేవరకు యుద్ధం: పవన్ కల్యాణ్



వైసీపీ వాళ్లకు హిందూ ధర్మంపై గౌరవం లేదని.. వారు భగవంతుడి మీద పగబట్టారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విమర్శించారు. శ్రీవారికి ఏడు కొండలు ఎందుకు.. రెండు కొండలు మాత్రమే చాలంటారు. తిరుమల లడ్డూని కల్తీ చేసి, సీబీఐ తమకు క్లీన్ చిట్ ఇచ్చిందని ప్రచారం చేసుకుంటారు. భగవంతుడిపై పగబట్టిన వాడు సర్వనాశనమైపోతాడు తప్ప బతికిన దాఖలాల్లేవు. దేవుడు, మతం అనేవి సున్నితమైన అంశాలు. వీటి విషయంలో జనసేన ముందు నుంచీ ఆచితూచి మాట్లాడుతోంది. కల్తీ నెయ్యి ఘాతుకానికి పాల్పడిన వారి అసలు ఉద్దేశం తెలియాలంటే ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏం జరిగిందో తెలుసుకోవాలి. వారి హయాంలో హిందూ ఆలయాలపై ఎన్నో దాడులు జరిగాయని, రామతీర్థంలో రాముడి విగ్రహానికి శిరచ్ఛేదం చేశారని, అంతర్వేదిలో రథం కాలిపోతే పిచ్చోడి పని అన్నారు. దుర్గమ్మ ఉత్సవ రథానికి ఉన్న వెండి సింహాన్ని చోరీ చేస్తే పోతే పోయిందని వ్యాఖ్యానించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి సంఘటనలు 219 వరకు జరిగాయి' అని తెలిపారు. తిరుమల లడ్డూ కల్తీ అనేది హిందూ విశ్వాసాలపై దెబ్బకొట్టే ప్రయత్నమని అన్నారు. 'అయోధ్య రామాలయ నిర్మాణం కోసం దేశమంతా ఎంతో కాలం ఎదురుచూసింది. అలాంటి అయోధ్యకు కూడా సుమారు లక్ష కల్తీనెయ్యితో తయారైన తిరుమల లడ్డూలని పంపారరంటే వీరు హిందూమతంపై ఏ స్థాయిలో కుట్ర చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు' అని చెప్పారు.

రాజకీయ లబ్ధి మా లక్ష్యం కాదు..

తిరుమలకు సరఫరా చేసిన నెయ్యిలో జంతు కొవ్వు, పందికొవ్వు, గొడ్డు కొవ్వు ఉందని ఎన్‌డీడీబీ రిపోర్టులో చాలా స్పష్టంగా పేర్కొన్నారు. ఈ విషయం మాకు తెలిసిన తర్వాత చెప్పకపోతే నేరం అవుతుంది. అందుకే సీఎం చంద్రబాబు ఈ విషయాన్ని చెప్పారు. దీని వల్ల మేమెలాంటి రాజకీయ లబ్ధి పొందాల్సిన అవసరం లేదు. ఎన్నికలకు ముందు ఇలాంటి విషయాలు చెబితే రాజకీయ లబ్ధి కోసం అనుకోవచ్చు. అధికారంలోకి వచ్చిన రెండో నెలలోనే ఆ రిపోర్టులో ఏముందో చెప్పకపోతే నేరం అవుతుంది. తిరుమలకు సరఫరా చేసేందుకు ఆయా డమ్మీ డెయిరీలు.. సుమారు 58 లక్షల కేజీల పామాయిల్ కొన్నాయి. మరో 2 లక్షల కేజీల వరకు కెమికల్స్ కొన్నాయి. ఆన్ రికార్డుగా దొరికారు. సీబీఐ ఎక్కడా వీరికి క్లీన్ చిట్ ఇవ్వలేదు. ఈ కల్తీ వ్యవహారంలో ఇతర మతాలకు ఎలాంటి సంబంధం లేదు. వైసీపీ వాళ్లు చేసిన తప్పునకు క్షమాపణ కోరకుండా.. పైగా మమ్మల్ని క్షమాపణ కోరడం విడ్డూరంగా ఉంది. 2022లోనే కల్తీ జరిగిందని నివేదిక వస్తే దాన్ని తొక్కిపెట్టారు. తెలియక చేస్తే పొరపాటు అవుతుంది. తెలిసి చేస్తే నేరమవుతుంది. 2019లో నెయ్యి ధర బహిరంగ మార్కెట్‌లో కిలో కనీసం రూ.420గా ఉండేది. రూ.319కే సరఫరా చేస్తామంటే అప్పటి పాలకులు గుడ్డిగా ఎలా అంగీకరించారు? ఓ సాధారణ గృహిణి కూడా అది కల్తీ నెయ్యి అని చెప్పగలదు. వివేకానందరెడ్డిని హత్య చేసి గుండెపోటు అంటారు. నెయ్యిలో కల్తీ లేదు.. సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చిందంటారు. అన్నీ తెలిసి అయోధ్యకు కల్తీ లడ్డూలు పంపారు. హిందూ విశ్వాసాలపై దెబ్బ కొట్టే ప్రయత్నం ఇది. దేవుడితో పెట్టుకుంటే మట్టికరుస్తారు. ఈ ఘటనతో ముడిపడిన ప్రతి ఒక్కరినీ దోషులుగా నిలబెడతాం.

తప్పు చేశా..



- టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంలో డెయిరీ ఎక్స్‌పర్ట్ విజయభాస్కర్‌రెడ్డి పశ్చాత్తాపం
- నాడు 'నెయ్యి' దందాలో కీలక పాత్ర

(తిరుపతి-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ హయాంలో టీటీడీ కల్తీ నెయ్యి దందాకు దారులు వేసింది డెయిరీ ఎక్స్‌పర్ట్ విజయభాస్కర్‌రెడ్డేనని 'సిట్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఎక్కడో ఉత్తరాఖండ్‌లో ఉన్న భోలేబాబా డెయిరీ యజమాని పొమిల్ జైన్‌ను తిరుపతి సమీపంలోని వైష్ణవి డెయిరీకి తీసుకొచ్చింది, ఆ సంస్థతో కల్తీ నెయ్యి సరఫరాకు ఒప్పందం కుదిర్చింది కూడా విజయభాస్కరరెడ్డే. ఆ విషయం స్వయంగా ఆయనే సిట్ వద్ద అంగీకరించారు. 'తప్పు చేశాను' అంటూ పశ్చాత్తాపం ప్రకటించారు. తాను లంచంగా తీసుకున్న సొమ్ములో మిగిలిన రూ.34 లక్షల నగదును, గోల్డ్ కాయిన్‌ను సిట్‌కు స్వచ్ఛందంగా అప్పగించారు. ఈ కేసులో అప్రూవర్‌గా మారేందుకు కూడా సిద్ధపడ్డారు. హైదరాబాద్‌కు చెందిన విజయభాస్కర్‌రెడ్డి ఏపీలో ప్రాచుర్యం కలిగిన దొడ్ల డెయిరీకి తొలుత కన్సల్టెంట్‌గా పనిచేశారు. ఎలాగో టీటీడీకి చేరువై 2013 నుంచి 2027 వరకు నెయ్యి కొనుగోలు వ్యవహారాల్లో కీలక పాత్ర వహిస్తూ వచ్చారు. ఏమైందో ఏమో గానీ ఆ తర్వాత టీటీడీ ఆయనను దూరం పెట్టింది. 2019లో వైసీపీ ప్రభుత్వం రాగానే, తిరిగి టీటీడీ నెయ్యి కొనుగోలు వ్యవహారాల్లో విజయభాస్కర్‌రెడ్డి తెర ముందుకు వచ్చారు.

పునబాకకు పొమిల్‌జైన్..

2019 ఆగస్టులో ట్యాంకర్ల ద్వారా టీటీడీకి నెయ్యి సరఫరా చేసే టెండర్లలో ఉత్తరాఖండ్ రాష్ట్రం భగవాన్‌పూర్‌లోని భోలేబాబా డెయిరీ పాల్గొంది. ఆ క్రమంలో డెయిరీ ప్లాంట్‌ను తనిఖీ చేసేందుకు డెయిరీ ఎక్స్‌పర్ట్ విజయభాస్కర్‌రెడ్డి ఉత్తరాఖండ్ వెళ్లారు. అక్కడ తనిఖీలో భోలేబాబా డెయిరీకి పాల సేకరణ సామర్థ్యం గానీ, నెయ్యి సరఫరా సామర్థ్యం గానీ లేవని తిరస్కరించారు. అదే సమయంలో భోలేబాబా డెయిరీ యజమాని పొమిల్‌జైన్‌తో విజయభాస్కర్‌రెడ్డి కుమ్మక్కై కీలక సలహా ఇచ్చారు. ఏపీలోని డెయిరీలను ప్రోత్సహించడానికి టీటీడీ 2018 నుంచీ ఏపీ కేటగిరీ కింద ప్రత్యేకంగా టెండర్లు పిలుస్తోందని, ఆ కేటగిరీ కింద టెండర్లలో పాల్గొంటే నెయ్యి సరఫరా కాంట్రాక్టు దక్కించుకోవచ్చునని సూచించారు. ఏపీలో తనకు వైష్ణవి అనే డెయిరీ తెలుసుని, దానితో ఒప్పందం కుదిరిస్తానని చెప్పారు. ఆ డెయిరీని టేకప్ చేసి దాని ద్వారా టెండర్లు వేసి టీటీడీ నెయ్యి కాంట్రాక్టు సొంతం చేసుకోవాలని పొమిల్ జైన్‌కు సూచించారు. 2019 అక్టోబరులో పొమిల్ జైన్‌ను వెంటబెట్టుకుని తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం పునబాక గ్రామం వద్ద ఉన్న వైష్ణవీ డెయిరీకి ఆయనే తీసుకెళ్లారు.

రూ. 7 కోట్ల అప్పులు... జీతాలివ్వలేని వైష్ణవి

పునబాకలో వైష్ణవి డెయిరీ 2011లో ఏర్పాటైంది. దానికి నలుగురు యజమానులు. 2016 వరకూ ఆ డెయిరీ బాగానే నడిచింది. తర్వాత ఆర్థికంగా సంక్షోభంలో కూరుకుపోయింది. 2019 అక్టోబరులో విజయభాస్కర్‌రెడ్డి భోలేబాబా యజమాని పొమిల్‌జైన్‌ను అక్కడికి తీసుకెళ్లేనాటికి వైష్ణవి డెయిరీ రూ.7 కోట్ల అప్పుల్లో ఉంది. సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉంది. నలుగురు యజమానుల్లో ముగ్గురు డెయిరీని నడపడం తమ వల్ల కాదంటూ నాలుగో వ్యక్తి రాజేశ్ చావడాకు అప్పగించి వెళ్లిపోయారు. రాజేష్‌ను పొమిల్‌జైన్‌కు విజయభాస్కర్‌రెడ్డి పరిచయం చేశారు. వైష్ణవి డెయిరీ నిర్వహణను పొమిల్ జైన్ చేపడతారని, కేవలం డాక్యుమెంట్లు ఇస్తే చాలు... వైష్ణవి పేరిట టీటీడీ టెండర్లలో పాల్గొంటారని చెప్పారు. నెయ్యి తయారీ, సరఫరా, టీటీడీని మేనేజ్ చేయడం వంటివన్నీ పొమిల్ జైనే చూసుకుంటారని చెప్పారు. నిజానికి వైష్ణవి డెయిరీకి కూడా టీటీడీ టెండర్లలో పాల్గొనే అర్హత లేదు. డెయిరీ డాక్యుమెంట్లు తీసుకున్న పొమిల్ జైన్ వాటి ఆధారంగా ఎక్కువ సామర్థ్యం చూపుతూ నకిలీ పత్రాలు సృష్టించి టెండర్లలో పాల్గొన్నారు. పొమిల్ జైన్ 2020 జనవరి నుంచి 2024 వరకూ నిరంతరంగా టీటీడీకి 'నెయ్యి' సరఫరా చేశారు. భోలేబాబా డెయిరీ నుంచి కల్తీ నెయ్యిని 32 వేల కిలోల సామర్థ్యం కలిగిన ట్యాంకర్లలో వైష్ణవి డెయిరీకి తరలించారు. ఈ విధంగా విజయభాస్కర్‌రెడ్డి సహకారంతో వైష్ణవి డెయిరీ ద్వారా టీటీడీకి ఏకంగా రూ. 130 కోట్ల విలువైన 33 లక్షల కిలోల కల్తీ నెయ్యిని పొమిల్ జైన్ సరఫరా చేయగలిగారు. సిట్ ఈడెయిరీని తనిఖీ చేసే నాటికి వైష్ణవీ డెయిరీలో కనీసం వెయింగ్ మెషిన్ కూడా లేకపోదు. కాగా, వైష్ణవి డెయిరీ యాజమాన్యాన్ని పరిచయం చేసి ఒప్పందం కుదిర్చిన తీరులోనే పుణెలోని మాల్‌గంగా డెయిరీ యాజమాన్యాన్ని కూడా విజయభాస్కర్‌రెడ్డే పొమిల్ జైన్‌కు పరిచయం చేశాడు. 2022లో దీని కోసమే ఆయన టీటీడీకి దక్షిణ భారత దేశంలోని డెయిరీల నుంచీ నెయ్యి కొనుగోలు చేయాలని సలహా ఇచ్చారు. ఈ మేరకు టీటీడీ 1500 కిలోమీటర్ల పరిధిలోని డెయిరీల నుంచీ టెండర్లు పిలిచింది. ఆ క్రమంలోనే పొమిల్ జైన్‌కు పుణెలోని మాల్‌గంగా డెయిరీ యాజమాన్యంతో ఒప్పందం కుదిర్చారు.

విజయభాస్కర్‌రెడ్డి పశ్చాత్తాపం..

శ్రీవారి ప్రసాదాలైన లడ్డూల తయారీకి వాడే నెయ్యి విషయంలో తప్పిదానికి పాల్పడ్డానని విజయభాస్కర్‌రెడ్డి పశ్చాత్తాపానికి లోనయ్యారు. అప్రూవర్‌గా మారేందుకు సిద్ధపడ్డారు. అయితే అనారోగ్యం కారణంగా ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. శ్రీవారి పట్ల తప్పు చేశానన్న పశ్చాత్తాపాన్ని వ్యక్తం చేసిన విజయభాస్కర్‌రెడ్డి, తాను లంచంగా తీసుకున్న సొమ్ములో కొంత స్వచ్ఛందంగా సిట్ అధికారులకు అందజేశారు. ఆయనకు పొమిల్ జైన్ నుంచి హవాలా మార్గంలో రూ. 25 లక్షలు చొప్పున మూడుసార్లుగా మొత్తం రూ.75 లక్షలు లంచంగా అందింది. దానితో పాటు ఆల్ఫా డెయిరీ యాజమాన్యం నుంచి ఎనిమిది గ్రాముల గోల్డ్ కాయిన్ కూడా లంచం రూపంలో అందింది. లంచంగా తీసుకున్న నగదు, గోల్డ్ కాయిన్‌లను డర్టీ మనీగా భావిస్తున్నానంటూ రూ. 34 లక్షల నగదు, 8 గ్రాముల గోల్డ్ కాయిన్‌లను సిట్‌కు అప్పగించేశారు. వాటిని ఏసీబీ కోర్టుకు సిట్ స్వాధీనం చేసింది.

బీజేపీ మరింత క్రియాశీలం కావాలి!

- కల్తీ లడ్డూ వ్యవహారం ఆ పార్టీ ద్వారానే మరింత బలంగా ప్రజల్లోకి వెళ్తుంది: చంద్రబాబు సూచన
- తమ నేతలకు ఆదేశాలిస్తామన్న మాధవ్
- కలిసికట్టుగా ఎదుర్కోవలసిందేనన్న పవన్

అమరావతి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో బీజేపీ కూడా మరింత క్రియాశీలంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు అన్నట్లు తెలిసింది. ఇలాంటి అంశాలను బీజేపీ అయితేనే మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలదని పేర్కొన్నట్లు సమాచారం. ఉండవల్లి నివాసంలో గురువారం కూటమి నేతలతో ఆయన సుమారు గంటన్నరపాటు చర్చలు జరిపారు. సమావేశంలో తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. నెయ్యి కల్తీ జరిగిందని స్పష్టంగా తేలినా జగన్ అండ్ కో నిస్సిగ్గుగా ఏం జరగలేదంటూ బుకాయిస్తున్నారని, పైగా తనపైనే ఎదురుదాడి చేస్తున్నారని చంద్రబాబు వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఇలాంటి వాటిని తేలిగ్గా తీసుకుంటే ముందు మరింత బరితెగించి.. వారి తప్పులను మనపై నెట్టేస్తారని హెచ్చరించారు. హిందూధర్మం.. హిందూ మతవిశ్వాసాల విషయంలో ఇతర పార్టీలు ఎన్ని మాట్లాడినా.. బీజేపీ స్పందిస్తేనే అది ప్రజల్లోకి బలంగా వెళ్తుందన్నారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో బీజేపీ నుంచి ఒకరిద్దరు తప్ప మిగిలిన వారు పెద్దగా స్పందించడం లేదని చెప్పారు. దీనిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ స్పందించి.. తమ పార్టీ నేతలందరికీ స్పష్టమైన ఆదేశాలిస్తామని చెప్పినట్లు తెలిసింది. తిరుమల వ్యవహారం కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ముడిపడిన అంశమని, వేరే ఆలోచనకు తావులేకుండా తాము కూడా కూటమి పార్టీలతో కలిసి పోరాడతామని స్పష్టం చేసినట్లు సమాచారం. జనసేనాని పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. హిందువుల మనోభావాలను.. హిందూ దేవుళ్లను.. హిందూ మతాన్ని దెబ్బతీసి, నిర్వీర్యం చేసేందుకు వైసీపీ కుట్ర పన్నుతోందని అన్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇలాంటి వాటిని కూటమి పార్టీలన్నీ కలిసికట్టుగా ఎదుర్కోవలసిందేనని ఆయన తేల్చిచెప్పినట్లు తెలిసింది. ఇటీవల నిర్వహించిన సర్వేల్లో వైసీపీకి పెద్దగా సానుకూలత లేదని తేలిందని.. ఆ పార్టీ గ్రాఫ్ మరింత దిగజారిందని, అందుకే జగన్ ప్రజల్లోకి వస్తూ ఇమేజ్ పెంచుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని టీడీపీకి చెందిన మంత్రులు వ్యాఖ్యానించినట్లు సమాచారం. లడ్డూ వ్యవహారంపై మూడు పార్టీల నుంచి త్రిసభ్య కమిటీ వేస్తే ఎలా ఉంటుందన్న అంశంపై నేతల మధ్య చర్చ జరిగింది. దీనిపై మరోసారి కూర్చుని తుది నిర్ణయం తీసుకోవాలని నిశ్చయించారు.

జంతు కొవ్వు దక్షిణ కొరియా నుంచి దిగుమతి!

సమావేశంలో.. నెయ్యి కల్తీ ఎలా చేశారో మంత్రి పయ్యావుల కేశవ్ కూటమి నేతలందరికీ సవివరంగా తెలియజేశారు. అసలు పాలే లేకుండా కేవలం పామాయిల్, రసాయనాలతో నెయ్యి తయారు చేసి తిరుమలకు సరఫరా చేశారని.. ఆయా డెయిరీలు.. 58 లక్షల కేజీల పామాయిల్, సుమారు 2 లక్షల కేజీల వివిధ రకాల రసాయనాలు కొనుగోలు చేసినట్లు ఆన్ రికార్డు ఉందని ఆయన తెలిపినట్లు సమాచారం. జంతు కొవ్వు అయితే తక్కువ ధరకు వస్తుందనే ఉద్దేశంతో దక్షిణ కొరియా నుంచి దిగుమతి చేసుకున్నట్లు కూడా ఆధారాలు ఉన్నాయన్నట్లు తెలిసింది. టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న ఖాతాలోకి వచ్చిన రూ.4 కోట్లు అంతిమంగా ఎవరికి చేరాయో తేలితే అసలు సూత్రధారుల గుట్టు రట్టు అవుతుందన్నారు. అలాగే నెయ్యి వ్యవహారంలో భారత ఆహార భద్రత-ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) అనుమతులు అవసరం లేదని బోర్డులో తీర్మానం చేయడం వెనుక ఎవరి ప్రోద్బలం ఉందో కూడా వెలుగు చూడాల్సి ఉందని చెప్పారు. ఇలాంటి ఎన్నో అంశాలపై మరింత దృష్టి సారిస్తే ఈ మొత్తం వ్యవహారంలో సూత్రధారులను ప్రజల ముందు నిలబెట్టవచ్చని కేశవ్ చెప్పినట్లు తెలిసింది.

కొవ్వు కలవలేదని సిట్ చెప్పింది

అయినా చంద్రబాబు దుష్ప్రచారం: వైవీ సుబ్బారెడ్డి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు కలవలేదని సిట్ చెప్పినా చంద్రబాబు అసత్య ప్రచారమే చేస్తున్నారని వైసీపీ ఎంపీ, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. టీటీడీలో తాము ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదన్నారు. దీనిపై స్వామి వారి ముందు ప్రమాణం చేయడంతో పాటు, సత్య శోధన పరీక్షకూ సిద్ధమేనని సవాల్ చేశారు. గురువారం ఢిల్లీలో వైసీపీ ఎంపీలు మిథున్ రెడ్డి, గొల్ల బాబూరావు, గురుమూర్తిలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమల లడ్డూ ప్రసాదంపై తప్పుడు ప్రచారంతో సీఎం చంద్రబాబు కోట్లాది మంది హిందూ భక్తుల మనోభావాలను దెబ్బ తీశారన్నారు. ఎన్‌డీడీబీ రిపోర్టు సహా సీబీఐ కూడా నెయ్యిలో జంతు కొవ్వులు లేవని నివేదికిచ్చినా.. దీనిపై విచారణకు మరో కమిటీ ఏర్పాటు చేయడం రాజకీయ కుట్రేనని ఆరోపించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నెయ్యి నాణ్యతా పరీక్ష నిర్వహించిన నాలుగు ట్యాంకర్లలో జంతుకొవ్వు ఉందా? లేదా?, ఒకవేళ ఉంటే దాన్ని లడ్డూ ప్రసాదం తయారీలో వాడారా? లేదా? అన్నదానిపై సమగ్రంగా దర్యాప్తు నిర్వహించాలని డిమాండ్ చేశారు. భక్తుల మనోభావాలు దెబ్బ తీయొద్దని సుప్రీంకోర్టు చెప్పినా కూడా కూటమి ప్రభుత్వ పెద్దలు, మంత్రులు గత పది రోజులుగా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

జంతువుల కొవ్వూ కలిసింది!

(మొదటి పేజీ తరువాయి)

అయ్యింది నెయ్యే కాదు! పామోలిన్ నూనెలో రకరకాల రసాయనాలు కలిపి పంపారు. మరో దారుణమైన సత్యం ఏమిటంటే... 'నెయ్యే కాని ఆ నెయ్యి'లో జంతువుల కొవ్వులూ కలిశాయి. ఇది... అక్షరాలా నిజం. పాడిపరిశ్రమకు సంబంధించిన అత్యున్నత నియంత్రణ సంస్థ 'ఎన్‌డీడీబీ-కాఫ్' ప్రయోగశాలలోనే ఇది రుజువైంది. అందులో... పంది కొవ్వు (ల్యార్డ్) కలిసిందని తేలింది. అయినా సరే... 'అది అనుమానం' మాత్రమే అని వైవీ సుబ్బారెడ్డి దబాయించడం గమనార్హం. ప్రపంచంలో ఏ ప్రయోగ శాల అయినా... తన పరీక్షల ఫలితాలను 'ఇదే ఫైనల్' అని చెప్పదు. చివరికి... మనం రక్తపరీక్ష చేయించుకున్నప్పటికీ 'కోరిలేట్ చేసుకోవాలని రిపోర్ట్‌లో ఉంటుంది. నెయ్యికి సంబంధించి ఎన్‌డీడీబీ నివేదికలో 'సస్పెక్టెడ్' అనే పదానికి అర్థం కూడా అదే!

ఎన్‌డీడీబీ చెప్పిందిదే... 'స్వచ్ఛమైన ఆవు నెయ్యి' అంటూ జగన్ హయాంలో ట్యాంకర్ల కొద్దీ కల్తీ నెయ్యిని టీటీడీకి సరఫరా చేశారు. అప్పటికే వచ్చిన ఫిర్యాదులు, బలమైన అనుమానాల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే టీటీడీ అధికారులు 'నెయ్యి' శాంపిళ్లను ఎన్‌డీడీబీ ప్రయోగశాలలకు పంపించారు. అందులో నివ్వెరపోయే వాస్తవాలు బయటపడ్డాయి. అందులో... బీటా సిటోస్టిరాల్, లారిక్‌యాసిడ్, లిగ్నోసెరిక్ యాసిడ్ వంటివి పరిమితికి మించి ఉన్నాయని తేల్చింది. చివరికి, జంతువుల కొవ్వు, పంది కొవ్వూ (ల్యార్డ్) ఉందని నిర్ధారించింది. ఆవు నెయ్యి స్వచ్ఛతను 'ఎస్-వాల్యూ' ఆధారంగా గుర్తిస్తారు. ఒక ప్రమాణం ప్రకారం... ఎస్-వాల్యూ 97.96 నుంచి 102.04 మధ్య ఉండాలి. కానీ... ఏకంగా 117.15 ఉన్నట్లు తేలింది. పంది కొవ్వు (ల్యార్డ్) కలిపితేనే ఇంత ఎస్-వాల్యూ వస్తుంది.

ఎప్పుడో కల్తీ తేలినా... వైవీ సుబ్బారెడ్డి టీటీడీ అధ్యక్షుడిగా ఉండగానే... కల్తీ బండారం బయటపడింది. టీటీడీకి సరఫరా చేసిన 3 ట్యాంకర్లు, ఒక టిన్ నెయ్యిని 2022 జూన్ 8న పరీక్షించగా... అందులోనూ కల్తీ జరిగిందని కేంద్ర ఆహార-సాంకేతిక పరిశోధనా సంస్థ (సీఎఫ్‌టీఆర్ఐ) నిర్ధారించింది. 2022 ఆగస్టు 3న టీటీడీకి నివేదించింది. మరి... కల్తీ నెయ్యి సరఫరా చేసిన డెయిరీలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అని ప్రశ్నిస్తే, 'నాకేం తెలియదు. అంతా అధికారులే చూసుకోవాలి" అని వైవీ సుబ్బారెడ్డి చెబుతున్నారు. 'నెయ్యి కల్తీ జరిగింది' అని కేంద్ర ప్రభుత్వ పరిశోధనా సంస్థ చెప్పినా పట్టించుకోకపోవడం నిర్లక్ష్యం కాదా? చైర్మన్ హోదాలో ఆయన ఏం చేసినట్టు? కల్తీని నిర్ధారించే 2 నివేదికలు కళ్లముందున్నా వైవీ కప్పదాట్లు ప్రదర్శిస్తున్నారు.

ఎన్‌డీఆర్ఐ... ఎందుకిలా?

సీఎఫ్‌టీఆర్ఐతోపాటు ఎన్‌డీడీబీ ప్రయోగశాలల్లో కల్తీ నిర్ధారణ అయినప్పటికీ... 'సిట్ మరోసారి శాంపిళ్లను హరియాణాలోని ఎన్‌డీఆర్ఐకి పంపింది. ఆ సంస్థ...అటూ ఇటూ తేల్చని ఒక అసహాయ నివేదికను ఇచ్చింది. అసలు విషయం ఏమిటంటే...టీటీడీకి నెయ్యి కొనుగోలు టెండర్ నిబంధనలు సడలించిన సమయంలో...ఆ తర్వాత బోలేబాబా, దాని అనుబంధ డెయిరీల తనిఖీకి నియమించిన బృందంలో ఎన్‌డీఆర్ఐకి చెందిన ఇద్దరు అధికారులూ సభ్యులుగా ఉన్నారు. 'అంతా ఓకే' అంటూ గేట్లు ఎత్తేశారు. ఇప్పుడు అదే ఎన్‌డీఆర్ఐ... నిక్కచ్చిగా నివేదిక ఇస్తుందని ఎలా ఆశించగలం!?

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 ,
RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.

కార్మిక సంక్షేమ పథకాల పునరుద్ధరణ

- ఆధునిక నైపుణ్యాల్లో శిక్షణకు చర్యలు
- తద్వారా ఆదాయాలు గణనీయంగా పెరగాలి
- అసంఘటిత రంగ కార్మికులను మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్లుగా ప్రోత్సహించాలి
- కార్మిక శాఖపై సమీక్షలో సీఎం ఆదేశాలు


కార్మిక శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి సుభాష్, ఆ శాఖ అధికారులు

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగంలోని భవన నిర్మాణ, ఇతర కార్మికులకు గతంలో అందించిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రసూతికి రూ.20 వేలు, వివాహానికి రూ.40 వేలు, సహజ మరణానికి రూ.60 వేలు, అంత్యక్రియలకు రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. కార్మిక శాఖపై గురువారం తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. అసంఘటిత రంగంలో ఉన్న కార్మికుల్లో ఆధునిక నైపుణ్యాలు, జీవన ప్రమాణాలను పెంచే అంశంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిర్మాణ రంగంలో ఉన్న ప్రముఖ కంపెనీలు ఎల్ అండ్ టి, ఎన్‌సీసీ, మిట్టల్ సహా వివిధ సంస్థల సహకారంతో వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆధునిక నైపుణ్య శిక్షణ ద్వారా రాష్ట్రంలోని కార్మికులు దేశ, విదేశాల్లో ఉపాధి అవకాశాలు పొంది, అధిక ఆదాయం ఆర్జించేలా చూడాలన్నారు. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఈ డేటాబేస్‌ను అనుసంధానించడంతో పాటు కార్మికులు లేటరల్ ఎంట్రీ ద్వారా వివిధ కోర్సులు అభ్యసించి ఉన్నత విద్యార్హతను సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిగ్ వర్కర్లు, నిర్మాణ రంగ కార్మికుల ఆదాయాలు పెరిగేలా చూడాలన్నారు. ఆధునిక పనిముట్లను కార్మికులకు అందించాలన్నారు. నైపుణ్యాలు పెరిగితే అధిక ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలోని 20 లక్షల మంది కార్మికులకు నైపుణ్యాలు పెంచేందుకు అనువుగా కార్యాచరణ చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు కానున్న భారీ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కూడా మన యువతకు అవసరమన్నారు. అసంఘటిత రంగంలోని కార్మికులను మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్లుగా ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించాలని, యూనివర్సల్ హెల్త్ పాలసీతోపాటు కార్మిక శాఖ ద్వారా రూ.2.5 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్సలు, ఆపై ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ద్వారా భరించేలా చూడాలని స్పష్టం చేశారు.

నేడు కర్నూలు జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన

- రైతులకు పట్టాదారు పుస్తకాల పంపిణీ

కర్నూలు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం కర్నూలు జిల్లాలో పర్యటిస్తారు. ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తారు. అనంతరం ఉదయం 11:30 సమయంలో గ్రామసభలో, రైతులతో ముఖాముఖి, టీడీపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. రైతులు సాగు చేసిన సజ్జ, బెండ పంటలను పరిశీలిస్తారు. అక్కడే రైతులతో ముఖాముఖిలో పాల్గొంటారు. ఆ తరువాత కార్యకర్తలతో సమావేశమవుతారు. సాయంత్రం 4:20 గంటలకు తిరుగుప్రయాణం అవుతారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఆర్థిక ఇబ్బందులున్నా 1నే జీతాలు ఇస్తున్నాం
- ఉద్యోగుల బకాయిలు చెల్లిస్తాం
- ఈహెచ్‌ఎస్‌ను అప్‌డేట్ చేస్తున్నాం
- ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర మహాసభలో మంత్రులు కేశవ్, సత్యకుమార్
- పీఆర్సీ కమిషనర్‌ను నియమించండి: ఏపీ జేఏసీ అమరావతి


మంత్రులను సన్మానిస్తున్న జేఏసీ నేతలు

విజయవాడ సిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రులు పయ్యావుల కేశవ్, సత్యకుమార్ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సేవా సంఘాల ఐక్య కార్యాచరణ సమితి (ఏపీ జేఏసీ అమరావతి) 4వ రాష్ట్ర మహాసభ నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం జరిగింది. తొలుత జేఏసీ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదర్ ఆధ్వర్యంలో వేలాది మంది ఉద్యోగులు లెనిన్ సెంటర్ నుంచి ఏలూరు రోడ్డు మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభకు మంత్రులు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. ఉద్యోగులు కష్టపడి దాచుకున్న డబ్బును గత వైసీపీ ప్రభుత్వం మింగేసిందని ఆర్థిక మంత్రి కేశవ్ అన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రతి నెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు నిరంతరం చర్చలు జరుగుతున్నాయన్నారు. కాస్త ఆలస్యమైనా.. ఉద్యోగుల సంక్షేమం కోసం చేయగలినంత చేస్తామని భరోసా ఇచ్చారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ ఉద్యోగులకు బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం సానుకూలతతో ఉందన్నారు. స్త్రీ పథకం ద్వారా వైద్య ఆరోగ్య శాఖకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈహెచ్‌ఎస్‌ను అప్‌డేట్ చేసి ఉద్యోగులకు వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 18 నెలల్లో జరిగే క్లయిమ్‌లను మూడు నెలలకు తగ్గించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు.

బకాయిలన్నీ క్లియర్ చేయండి

సమావేశంలో ఉద్యోగ సంఘాల నాయకులు పలు డిమాండ్లను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. పీఆర్సీ కమిషనర్‌ను నియమించి వెంటనే ఐఆర్ ప్రకటించాలని, డీఏ ఎరియర్స్ వెంటనే చెల్లించాలని, దీనిలో తొలి ప్రాధాన్యత పెన్షనర్లకు ఇవ్వాలని, 11వ పీఆర్సీ ఎరియర్స్‌ను ఆలస్యం లేకుండా విడుదల చేయాలన్నారు. జీపీఎఫ్ మొత్తాల నుంచి పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, సరెండర్ లీవ్‌ల పెండింగ్ బిల్లులను చెల్లించాలన్నారు. జేఏసీ తీర్మానాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.


కల్యాణ మండపం వద్దకు వచ్చిన అభిమానులకు అభివాదం చేస్తున్న జగన్

ఎక్కడికెళ్లినా అదే రచ్చ

- పరామర్శ అయినా, పెళ్లి వేడుకైనా ఒకేలా జగన్ అభిమానుల హంగామా
- మండలి చైర్మన్ మోషేన్ రాజు కుమారుడి వివాహానికి మాజీ సీఎం
- పెళ్లి వేడుకలోనూ సీఎం జగన్ అంటూ నినాదాలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పరామర్శ అయినా, పెళ్లి వేడుక అయినా వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి అభిమానులు, ఆ పార్టీ కార్యకర్తలు ఒకేలా వ్యవహరిస్తున్నారు. ఆయన ఎక్కడికెళ్లినా రచ్చ రచ్చ చేస్తున్నారు. గురువారం ఉదయం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం సమీపంలోని పెద అమిరంలో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు కుమారుడి వివాహం జరిగింది. ఈ కార్యక్రమానికి జగన్ ఉదయం 11.15 సమయంలో హాజరయ్యారు. ఇది తెలిసి ఆయన అభిమానులు అక్కడ గుమిగూడారు. జగన్ కళ్యాణ వేదిక వద్దకు వెళ్లిన సమయంలో వారిని సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. అయితే అక్కడ ఏర్పాటు చేసిన స్టీల్ బారికేడ్లను నెట్టేసి కల్యాణ మండపంలోకి దూసుకెళ్లారు. పులివెందుల పులి, సీఎం జగన్ అంటూ కల్యాణం మండపంలో జగన్ ఉన్నంత సేపూ పెద్దపెట్టున నినదిస్తూనే ఉన్నారు. హెలీప్యాడ్ వద్ద కార్యకర్తల హడావుడి లేకపోయినా, కల్యాణ వేడుక ప్రాంగణంలో మాత్రం కార్యకర్తలు హంగామా చేశారు.

వారధి కాదు.. పశ్చిమ బైపాస్ మీదుగా రండి

- జగన్‌కు విజయవాడ పోలీసుల నోటీసు.. నేడు జోగి ఇంటికి మాజీ సీఎం

విజయవాడ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం ఆ పార్టీ మాజీ మంత్రి జోగి రమేశ్ నివాసానికి రానున్నారు. ఈ నేపథ్యంలో వారధి మీదుగా కాకుండా పశ్చిమ బైపాస్ మీదుగా జోగి ఇంటికి వెళ్లాలని పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆయనకు నోటీసు జారీ చేశారు. జోగి ఇబ్రహీంపట్నం ఫెర్రీ రోడ్డులో నివాసముంటున్నారు. ఇటీవల ఆయన ఇంటిపై టీడీపీ కార్యకర్తలు దాడి చేయగా.. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు జగన్ వస్తున్నారు. తాడేపల్లి నుంచి కనకదుర్గ వారధి, కృష్ణలంక రోడ్డు, దుర్గగుడి, వన్‌టౌన్, గొల్లపూడి మీదుగా ఇబ్రహీంపట్నం వెళ్లడానికి జగన్ సిద్ధమయ్యారు. మాజీ సీఎం ప్రయాణించే ఆ సమయంలో పైన పేర్కొన్న మార్గమంతా ట్రాఫిక్‌తో రద్దీగా ఉంటుంది. జగన్ ర్యాలీ వల్ల తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయని పోలీసులు భావించారు.

చంద్రబాబు తల వంచైనా సీమ లిఫ్టు పూర్తి చేయిస్తాం: సజ్జల

- పోతిరెడ్డిపాడులో వైసీపీ 'రైతు శంఖారావం'

జూపాడు బంగ్లా, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంపై ప్రజా ఉద్యమం ద్వారా చంద్రబాబు తల వంచైనా సరే.. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని రెండేళ్లలో పూర్తిచేయిస్తామని వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం నంద్యాల జిల్లా పోతిరెడ్డిపాడు వద్ద వైసీపీ నాయకులు 'రైతు శంఖారావం' పేరిట బహిరంగసభ ఏర్పాటు చేశారు. ఈ సభకు వైసీపీ ప్రాంతీయ సమన్వయకర్త పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు పలువురు నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో కూర్చుని చంద్రబాబే రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు నిలిపివేశారని చెప్పినా.. నేటికీ చంద్రబాబు నుంచి సమాధానం లేదన్నారు. వామపక్షాలను కలుపుకొని రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రబాబును రాజకీయంగా సమాధి చేస్తామని హెచ్చరించారు.

జంట హత్యల కేసులో మరోమారు.. పోలీసు కస్టడీకి పిన్నెల్లి సోదరులు

- నేడు ప్రశ్నించనున్న మాచర్ల రూరల్ పోలీసులు



మాచర్ల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు వెంకట్రామిరెడ్డిలను పల్నాడు జిల్లా మాచర్ల రూరల్ పోలీసులు మరోమారు విచారించనున్నారు. గతంలో రెండుసార్లు వీరిని పోలీసులు విచారించారు. తాజాగా శుక్రవారం ఒక్కరోజు విచారించేందుకు మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి శ్రీనివాస్ కల్యాణ్ పోలీసులకు అనుమతి ఇచ్చారు. దీంతో మాచర్ల రూరల్ పోలీసులు నెల్లూరు జిల్లా జైలుకు వెళ్లి పిన్నెల్లి సోదరులను శుక్రవారం విచారించనున్నారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడులో టీడీపీ నేతలు జెవిశెట్టి వెంకటేశ్వర్లు, అతని సోదరుడు జెవిశెట్టి కోటేశ్వరరావు గతేడాది మే నెల 24వ తేదీన హత్యకు గురయ్యారు. ఈ కేసులో రామకృష్ణారెడ్డి(ఏ6), వెంకట్రామిరెడ్డి(ఏ7) నిందితులుగా ఉన్నారు. ప్రస్తుతం వీరు నెల్లూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు.

రైల్వే అధికారి ఆస్తులు జప్తు

- భార్య, అత్తమామల పేరున 9 ఫ్లాట్లు, 3 స్థలాల గుర్తింపు
- రూ.1.39 కోట్ల ఆస్తులను జప్తు చేసిన ఈడీ

విశాఖపట్నం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రైల్వే అధికారికి చెందిన రూ.1.39 కోట్ల విలువైన స్థిర, చరాస్తులను విశాఖపట్నంలోని ఈడీ అధికారులు మనీ ల్యాండరింగ్ నిరోధక చట్టం కింద జప్తు చేశారు. గౌహతిలో పనిచేస్తున్న రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ అల్లాడబోయిన సతీశ్ ఆదాయానికి మించి ఆస్తులను కలిగి ఉన్నారని సీబీఐ అధికారులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. భార్య, అత్తమామల పేరిట తొమ్మిది ఫ్లాట్లు, మూడు స్థలాలు, మరో మూడు ఫిక్సడ్ డిపాజిట్లు గుర్తించారు. సతీశ్ 2008 ఏప్రిల్ 1 నుంచి 2026 జనవరి 24 వరకు రూ.1.39 కోట్లు అక్రమంగా సంపాదించారని దర్యాప్తులో తేలింది. ఈ ఆస్తులు ఆయన ఆదాయం కంటే 83.3 శాతం అధికంగా ఉన్నాయని అధికారులు గుర్తించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని ఈడీ ఒక ప్రకటనలో తెలిపింది.

మోహన్‌బాబు వర్సిటీని స్వాధీనం చేసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వివిధ సంఘాల సమావేశం

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అక్రమాలకు పాల్పడుతున్న మోహన్‌బాబు యూనివర్సిటీని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన వివిధ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా నేతలపై దాడి జరిగిన నేపథ్యంలో గురువారం విజయవాడలో ఈ సమావేశం నిర్వహించారు. పలు సంఘాల ప్రతినిధులు ఇందులో పాల్గొని మాట్లాడారు. విద్యార్థి నేతలపై అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. వర్సిటీ ఆగడాలను నిరసిస్తూ శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేయాలని తీర్మానించారు.

194 బార్లకు లైసెన్స్‌లు జారీ

అమరావతి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మూడో దశ నోటిఫికేషన్‌లో భాగంగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా 194 బార్లకు లైసెన్స్‌లు జారీచేసినట్లు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మిగిలిన 107 బార్లకు తిరిగి నోటిఫికేషన్ జారీ చేయాలని ఆదేశించామన్నారు. గురువారం సచివాలయంలో ఎక్సైజ్ శాఖపై మంత్రి సమీక్షించారు. నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా ఏడాది కాలంలో రాష్ట్రాన్ని నాటుసారా రహితంగా మార్చామన్నారు. ఎక్సైజ్ శాఖకు ఆదాయం కంటే ప్రజల సంక్షేమమే ముఖ్యమని చెప్పారు.